ఆర్షవిద్యా తరంగాలు -04

# స్వామి పరమార్థానంద

# ఆశీస్సులతో

# తేలికగా తైత్తిరీయం



సత్యం, జ్ఞానం, అనంతం - బ్రహ్మ

ఆనందమే - నా స్వరూపం

## తెనుగు సేత

## కస్తూరి వీర రాఘవరావు

మా చిరకాల ఆప్తమిత్రులు –

**శ్రీ వై. యస్. రావు గారు**

**శ్రీమతి వై. నిర్మల కుమారి గారు**

**తేలికగా తైత్తిరీయం పుస్తక ప్రచురణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి** ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఆ పుణ్యదంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు, జ్ఞానప్రాప్తి, బ్రహ్మనిష్ఠ కలగాలని ఈశ్వరుని వేడుకుంటున్నాము.

– రాఘవరావు, రాజ్యశ్రీ

# ఓం

# తొలిపలుకు

మన సనాతన ధర్మానికి, సత్యజ్ఞానరాశికి మూలస్తంభాలు వేదాలు. అవి నాలుగు. ఆ నాలుగు కూడ సంహిత(మన్త్ర), బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులని నాల్గుభాగాలు. అందులో జ్ఞానప్రధానమైన ఈ ఉపనిషత్తులు వేదముల చివరి భాగాలు. కాబట్టి వానిని వేదాన్తాలని కూడా అంటారు. ఈ ఉపనిషత్తుల వలన జ్ఞానం కలుగుతుంది. జ్ఞానాన్మోక్షః. ఈ ఉపనిషద్ జ్ఞానం వలననే పరమ పురుషార్థమైన, పునరావృత్తి రహితమైన మోక్షం కలుగుతుంది. జన్మరాహిత్యం లభిస్తుంది.

పరమ పూజ్య శ్రీమచ్ఛంకర భగవత్పాదులవారు తమ ఉపనిషద్భాష్యంలో ''బ్రహ్మవిద్యయే ఉపనిషత్తని పిలవబడుతూంది. ఈ బ్రహ్మవిద్య భక్తితో తనను సేవించెడివారి గర్భ, జన్మ జరాది బంధాలను శిథిలంచేసి, (అజ్ఞానాన్ని)సమూలంగా నాశం చేసి బ్రహ్మ ప్రాప్తిని కలిగించును. పరమశ్రేయస్సగు మోక్షం దీనికి విషయమైంది. కాబట్టి ఇది ఉపనిషత్ అనబడుచున్నది'' - అని వ్రాశారు.

ఈ ఉపనిషత్తులు ప్రస్థానత్రయంలో శ్రౌత ప్రస్థానమనబడుచున్నవి. ఇప్పుడు లభించే ఉపనిషత్తులు 108 అని అన్నను ప్రధానంగా ''ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక,

మాండూక్య, తైత్తిరీయం, ఐతరేయం, ఛాందోగ్య, బృహదారణ్యకం'' అనే పదీ, దశోపనిషత్తులనబడి ప్రాధాన్యతను సంతరించుకొనినవి. ఈ పదింటికి శంకరభగవత్పాదులు భాష్యాలు వ్రాశారు.

ఇందు తైత్తిరీయోపనిషత్తు కృష్ణయజుర్వేద తైత్తిరీయ శాఖకు చెందినది. ఈ తైత్తిరీయోపనిషత్తు తైత్తిరీయ అరణ్య భాగంలో పఠింపబడుతుంది. శ్రీ శంకర భగవత్పాదులు తమ బ్రహ్మసూత్ర భాష్యంలో అచటచట 147 సార్లు ఈ తైత్తరీయోపనిషత్తును ప్రస్తావించియున్నారు. ఇందు శిక్షావల్లి, బ్రహ్మవల్లి, భృగువల్లి, నారాయణప్రశ్నము, చిత్తిప్రశ్నమని ఐదు అధ్యాయాలున్నాయని సాంప్రదాయ వాదులంటారు. కాని లోకంలో శిక్షావల్లి, బ్రహ్మవల్లి, భృగువల్లులనే మూడధ్యాయాలే ప్రసిద్ధాలు.

ఈ ఉపనిషత్తు శిక్షావల్లిలో 12 అనువాకాలు, బ్రహ్మానందవల్లిలో 9 అనువాకాలు, భృగువల్లిలో 10 అనువాకాలు వున్నవి. ఇవి గద్యాత్మకాలు. ఇందు శిక్షావల్లి సగుణ బ్రహ్మవిద్యను, బ్రహ్మవల్లి నిర్గుణవిద్యను, భృగువల్లి సాధనా విధానాన్ని బోధిస్తున్నాయి.

సత్యం, జ్ఞానం, ఆనందం బ్రహ్మ స్వరూపమని బ్రహ్మ యొక్క స్వరూపలక్షణ వివరణ, ప్రపంచానికి బ్రహ్మమూల కారణమని తటస్థలక్షణ వివరణ, ఆనందమీమాంస, పంచకోశ వివరణ ఉండడం చేత ఈ తైత్తిరీయోపనిషత్తు చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ఉపనిషత్తుకు

శంకరాచార్యులవారు భాష్యం వ్రాస్తే దానికి సురేశ్వరాచార్యులవారు విపులమైన వార్తికం వ్రాసినారు. ఆనందగిరి దీనికి టీక వ్రాశారు. శ్రీ విద్యారణ్యస్వామి గురువు గారైన శ్రీ శంకరానంద స్వామిలవారు దీనికి దీపిక వ్రాశారు.

వేదభాష్యకారులు సాయనాచార్యులు ఈ తైత్తిరీయోపనిత్తు ''సాంహితి'' యని, ''వారుణి'' యని ''యాజ్ఞకి'' యని త్రివిధంగా ఉంది అనీ, అందులో శిక్షావల్లిలో సంహితాధ్యయన విధానం చక్కగా నిరూపించబడి నందువలన ''సాంహితి'' అనబడుతుందనీ వ్రాశారు. నారాయణ ప్రశ్నములో - వైశ్వదేవం, సంధ్యావందనం, దేవతా పూజా మంత్రాలుండడం వలన ''యాజ్ఞికం'' అనబడుతుందని వ్రాశారు.

ఇట్టి ఈ తైత్తిరీయోపనిషత్తుకు పూజ్యశ్రీ పరమార్థానంద స్వాములవారి ఆశీస్సులతో ''తేలికగా తైత్తిరీయం'' అను పేరిట శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు వ్రాసిన తెలుగు సేతయే ఇప్పుడు మన చేతిలోని గ్రంథము. శ్రద్ధగా చదవండి, దాని స్వాదిష్టతను అనుభవించండి. శ్రీ కె వి రాఘవరావుగారు చిన్న వయస్సు నుంచే ఆధ్యాత్మిక సంస్కారంతో రంగరింపబడ్డారు. నిర్మల శుద్ధ అపరంజి బంగారమయ్యారు.

పూజ్య శ్రీ దయానంద సరస్వతిస్వాముల వారు, పూజ్య పరమార్థానంద సరస్వతి స్వాములవారి వంటి

దిగ్దండులైన సద్గురువుల వద్ద శాస్త్రశ్రవణం చేశారు. మనన నిదిధ్యానలతో అనుభూతిని పొందారు. వారి ఆనందానుభూతిని ఇట్టి రచనల ద్వారా అందరికి అందిస్తున్నారు. వీరు ధన్యులు. వీరి జీవితం చరితార్థం.

సద్గురువుల కృపతో శ్రీరాఘవరావుగారు ఇంకను ఇట్టి ఆధ్యాత్మిక గ్రంథానువాదాలను మనకు అందించాలని ఆశిస్తూ వారికి సచ్చిదానంద పరమాత్మ, గురు పరంపర మరింత శక్తి సామర్థ్యలను ప్రసాదించుగాక.

ఓమ్ తత్ సత్ ఓమ్

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు
పీఠాధిపతి, శ్రీశుకబ్రహ్మాశ్రమం, కాళహస్తి

# నా స్పందన

ఈశ్వరానుగ్రహంతో, స్వామీజీ దీవెనలతో, రాజ్యశ్రీ, నేనూ గత ఐదు సంవత్సరాలుగా వేదాంత తరగతులు నిర్వహిస్తున్నాము. నిర్వహణలో భాగంగా ఒక చక్కటి సంప్రదాయం నెలకొని ఉంది. ఒక అంశం ముగియగానే వేదాంత శ్రవణం చేసే సత్సంగ్ సభ్యులంతా ఆ అంశం మళ్ళీ తిరిగి చెప్పాలి. తైత్తిరీయం పాఠం విన్నాక, సభ్యులకు ఆ అనువాకాలు తిరిగి చెప్పాలంటే కష్టంగా ఉంది. సత్సంగ్ సభ్యుల సౌలభ్యం కోసం నోట్సు తయారు చేసాను.

ఆ నోట్సు చాలా బాగుంది ప్రచురిస్తే నలుగురికీ పనికి వస్తుంది అని మిత్రులు అంటే, దానినే స్వల్పమైన మార్పులతో ప్రచురణకు యోగ్యంగా తయారు చేసాను. దానిని ఆగ్రాలోని నా మిత్రులు డా॥ చిలకమర్తి దుర్గా ప్రసాదరావు గారికి పంపాను. వీరు సంస్కృతపండితులు. అద్వైతంలో పి. హెచ్. డి కూడా చేసి ఉన్నారు. వారు దీనిని చక్కగా దిద్ది కొన్ని సూచనలు చేశారు. వారి సూచనలమేరకు దీనిని చక్కగా మెరుగు పరచాను. వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

ఆ తరువాత విష్ణుప్రసాదు గారు, అరుణా యశోద గారు, వై యస్ రావ్ గారు. పి. వి. యస్ యస్ శాస్త్రి గారు ప్రూఫ్ రీడింగ్ చేసి పెట్టారు. వారికి నాకృతజ్ఞతలు. ఇది పుస్తక రూపంలో రావాలని పట్టుబట్టిన నా శ్రీమతి రాజ్యశ్రీకి నా ధన్యవాదాలు.

ఎంతో ఓపికతో ఈ పుస్తకాన్ని చదివి, విలువైన సలహాలిచ్చి, ఆప్యాయతతో ఈ పుస్తకానికి తొలిపలుకు వ్రాసిన శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, స్వామీ విద్యాస్వరూపానందగిరి వారికి నా నమస్సుమాంజలు. కృతజ్ఞతలు.

ఇందులోని విషయం స్వామి పరమార్థానందగారు బోధించిన తైత్తిరీయం. అయితే ఇది ఆయన బోధనల సారం. సిద్ధాంతం బాగా అర్థమవ్వాలని మరీ సులభంగా చెప్పడం జరిగింది. చదివిన వాళ్ళు సబ్జక్టు చాలా తేలికగా ఉంది అనడంతో **తేలికగా తైత్తిరీయం** అయ్యింది. తైత్తిరీయోపనిషత్తునే తైత్తిరీయం అని కూడా వ్యవహరిస్తారు.

దీని పాఠకులెవరు? అని మా స్నేహితుడు అడిగారు. కెమిస్ట్రీ మేడ్ ఈజీ అనే పుస్తకం ఎవరికి? కెమిస్ట్రీ విద్యార్థులకే కదా! అలాగే ఇది వేదాంతం అధ్యయనం చేసేవారికే. వారికి విషయాన్ని తేలికపరిచి సరళంగా బోధించడమే ఈ పుస్తకం ఉద్దేశ్యం.

నాకు చిన్ననాటి నుండి ఆధ్యాత్మికత అంటే మక్కువ ఎక్కువ. మా అమ్మ వైపు తాతగారూ, ఆ తాతగారి వైపు దాదాపుగా అందరూ భక్తులూ-ఆంజనేయ ఉపాసకులే! బహుశః వారి ప్రభావం నా మీద ఉందేమో! అంతేకాదు తెలుగు వారికి తేటతెలుగులో గీతామకరందం ద్వారా గీతనందించిన స్వామీ విద్యాప్రకాశానందగిరి వారి ఉపన్యాసాలకు వెళ్ళి వింటూండేవాడిని. అదే నా దైవభక్తికి బీజం అయ్యింది. స్వామి చిన్మయానంద గీతోపన్యాసాలు పెద్దయ్యాక విన్నాను. వీరివల్ల నాలో జ్ఞానార్తి కలిగింది. కుందన్ బాగ్‌లో ఉపనిషత్తు క్లాసులు జరిగితే తప్పనిసరిగా వెళ్ళేవాడిని.

దైవానుగ్రహం తోడుండటంతో, స్వామీ పరమార్థానంద నాకు తారసిల్లారు. స్వామీజీ నాకు పరమ గురువయ్యారు. పరమ గురువును ఎలా తెలుసు కోవాలి? ఈ విషయం ముండకోపనిషత్తులో చాలా వివరంగా వస్తుంది. గురువు శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠుడై ఉండాలి. శ్రోత్రియుడు అంటే శ్రుతిని ప్రామాణ్య బుద్ధితో స్వీకరించిన వాడై ఉండాలి. వేదాలను పెడచెవిని పెట్టే లేదా వేదాల జోలికి పోవద్దు అనే గురువు దొరికితే ఒక జీవితం వృధా అయినట్లే.

వేదబాహ్యంగా చెప్పే గురువును అనుసరించే వారి స్థితి, ఒక గుడ్డివాడు ఇంకొక గుడ్డి వాడిని అనుసరించినట్టు ఉంటుంది అంటుంది ముండకోపనిషత్తు. గురువు కేవలం శ్రోత్రియుడైతే చాలదుట బ్రహ్మనిష్ఠుడు కావాలట.వేదపూర్వభాగం బ్రహ్మనిష్ఠ గురించి మాట్లాడదు. అందుకని తప్పని సరిగా వేద అంత భాగాన్ని మనసా వాచా కర్మణా స్వీకరించి, అహం బ్రహ్మాస్మి అనే నిష్ఠలో జీవిస్తున్న గురువు దొరకాలి.

స్వామీ పరమార్థానందగారు సరిగ్గా అక్షరాలా అటువంటి గురువే. వారు జీవన్ముక్తులవ్వడమే కాదు. వారి శిష్యులందరిని ఆ స్థితికి తేగలిగిన ధీశాలి. **మోక్షం సిద్ధ వస్తువు. సాధ్యవస్తువు కాదు** అని నొక్కి చెప్పి, **మోక్షం ఇక్కడే ఇప్పుడే** అంటూ పదే పదే బోధించే అనన్య పరమ గురువు స్వామీ పరమార్థానందగారు. క్లిష్టమైన వేదాంత విషయాలను మళ్ళీ మర్చిపోకుండా బాగా అర్థమయేటట్లు బోధించడంలో సిద్ధహస్తులు వీరు. సాక్షాత్తు పరమ గురువు లభించడంతో ఇంక తిరుగులేని ప్రయాణం మొదలైంది. వారు బోధించిన ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు పది సంవత్సరాలు అకుంఠిత దీక్షతో అధ్యయనం పూర్తిచేశాను. సంస్కృతం కూడా అధ్యయనం చేశాను.

స్వామిని ఆత్మలీనానందసరస్వతిగారి వద్ద ఐతరేయం, బృహదారణ్యం, బ్రహ్మసూత్రాలు - చతుస్సూత్రి శ్రవణం చేయడం కూడా జరిగింది. స్వామిని బోధలు చాల విపులంగా ఉండేవి. అంతేకాదు వీరిబోధలు చక్కగా ఆలోచింప చేసేవి.

దాదాపుగా ప్రతి వేసవిలోను ఋషీకేశ్‌లో పూజ్యగురుదేవులు దయానంద సరస్వతివారి వేదాంత ప్రసంగాలు శ్రవణం చేసే మహద్భాగ్యం దక్కింది. మాకందరికీ మూల గురువర్యులు వీరు. స్వామీ దయానందులు నిజంగా దయానిధే. ఆర్షవిద్య అందరికి

అందాలని అనేక మంది నిష్ణాతులైన ఆచార్యులను తయారు చేశారు. వీరి చలువ వలనే ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా అద్వైత బోధ నిరంతరంగా, నిరాఘాటంగా కొనసాగుతోంది. ఈ గురుపరంపరకి సాష్టాంగవందనాలు. ఈ గురువులు పెట్టిన జ్ఞానబిక్షే నేను ఈరోజు చెపుతున్నది. ఋషీకేశ్‌లో పూజ్యగురుదేవులు రాత్రిపూట సత్సంగం నిర్వహించేవారు. అందులో మన సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. అలా ఒకరోజు సత్సంగంలో ఒకరు కేవలం రెండే ఉపనిషత్తులు వినాలంటే - అవి ఏవి? అని అడిగారు. వెంటనే స్వామి 'కేనోపనిషత్తు, తైత్తిరీయం' అని సమాధానం ఇచ్చారు.

తైత్తిరీయం దశఉపనిత్తులలో చాలా ముఖ్యమైన ఉపనిషత్తు. ఇందులో బ్రహ్మ అంటే ఏమిటో తెలుస్తుంది. పంచకోశవివేకం ద్వారా స్వరూపతః నేనెవరిని అనే నిర్ణయం జరుగుతుంది. ఆనంద మీమాంస ద్వారా నేనే ఆనందస్వరూపుడనని తెలుస్తుంది. ఇందులో గృహస్థుకు కావల్సిన అనేక ముఖ్యమైన విలువలు చెప్పబడతాయి. వేదాంతం అధ్యయనం చేసేవారు తప్పని సరిగా తైత్తిరీయం చదవాలి. వారు ఈ పుస్తకం చదివి అధ్యయనం చేస్తే, అధ్యయనం తేలిక అయ్యే అవకాశం ఉంది.

ఈ పుస్తకం అందర్నీ ఆకర్షిస్తుందని, పాఠకులకు అద్వైతా మృతాన్ని చవి చూపిస్తుందని నమ్ముతున్నాను. ఎందరో మహాను భావులు అందరికీ పేరు పేరునా వందనాలు తెలియచేస్తూ-

\- మీ రాఘవ రావు

# ఆప్త వాక్యాలు

శ్రీ కస్తూరి వీర రాఘవరావు, నాకు గత 35 సంవత్సరములుగా తెలుసు. నాకు ఆప్తమిత్రుడు. రాఘవరావు – సతీమణి రాజ్యశ్రీతో కలిసి గత కొంత కాలంగా అద్వైతబోధ చేస్తున్నారు. నాకు తెలిసి, యూసుఫ్‌గూడ, అపర్ణా సరోవర్, అపర్ణా కమ్యూన్‌లలో తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ప్రసంగాలు ఇస్తున్నారు. రాఘవరావు, మృదుస్వభావి, మితభాషి, కల్లాకపటం తెలియని మంచి మనిషి. నేను ఈ మధ్యన స్వామి పరమార్థానందగారి బోధనల ఆధారంగా రాఘవరావు సతీమణి తెనుగీకరించిన 1.అద్వైత వేదాంత పరిచయం 2.కఠోపనిషత్తు 3. ముండకోపనిషత్తు గ్రంథములను ఆసాంతం ఆసక్తిగా చదివాను. శ్రీ రాఘవరావుగారి ప్రోత్సాహం, ప్రోద్బలం లేనిదే ఈ గ్రంథములు వెలుగు చూసేవి కాదు అనేది అక్షరసత్యం.

శ్రీ రాఘవరావు అందించిన తేలికగా తైత్తిరీయం కూడ ఎంతో సరళంగా, స్పష్టంగా రాజ్యశ్రీ గారి గ్రంథములకు పోటీగా దీటుగా సమర్థవంతంగా అందరికీ అర్థమయ్యే రీతిలో ఉంది. తైత్తిరీయోపనిషత్తులోని ముఖ్యమైన అంశాలను, సాధ్యమైనంత విశదంగా వివరించారు. ఆత్మతత్త్వం – అందరికీ గోచరమైనదే. అయినా దాని యదార్థస్వరూపం ఎవరికీ తెలియదు. అందుకే ఇది పరమరహస్యం. ఇతర ఉపనిషత్తులలో స్పష్టంగా లేని పంచకోశవివేకం తైత్తిరీయోపనిషత్తు సవిస్తారంగా ప్రతిపాదించింది.

మనజీవితం మొత్తం నాలుగు ఆశ్రమాలుగా విభజించబడింది. 1. బ్రహ్మచారి ఆశ్రమం 2. గృహస్థ ఆశ్రమం 3. వానప్రస్థ ఆశ్రమం 4. సన్యాస ఆశ్రమం, శ్రమః అంటే ఆధ్యాత్మిక సాధనం అంటే శాస్త్రం ప్రకారం జీవితం మొత్తం ఆధ్యాత్మిక సాధనే.

ఆశ్రమవ్యవస్థ రాఘవరావు, రాజ్యశ్రీ దంపతుల విషయంలో అతికినట్లుగా చక్కగా సరిపోతుంది. **పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం.** రాఘవరావు దంపతులు, పర ఉపకార కర్మలు, నిష్కామ కర్మలు మాత్రమే చేస్తారు. భార్యాభర్తలు ఇద్దరూ ఈ అద్వైత మార్గంలో వుంటూ, దయాసత్సంగ్ సభ్యులకూ, ఆర్ష ఆనందకుటీర్ సభ్యులకూ, అపర్ణా కమ్యూన్‌లోని సీనియర్ సిటిజన్స్‌కూ వేదాంతబోధ చేస్తూ వారి జీవితాల్ని పునీతం చేసుకుంటున్నారు.

పూర్వాశ్రమంలో రాఘవరావు, రాజ్యశ్రీ దంపతులు లెక్చరర్లుగా పనిచేశారు. ఎంతో క్లిష్టమైన పాఠాలను కూడ అరటి పండు వలిచి చేతిలో పెట్టినట్లుగా సులభముగా, వివరంగా, పిల్లలకు తేలికగా అర్థమయ్యేరీతిలో బోధించేవారు అని వీరికి మంచి పేరు ప్రఖ్యాతలున్నాయి. అందువలన, శంకరభాష్యాలు, ఉపనిషత్తులు, ప్రకరణగ్రంథాలలోని బ్రహ్మవిద్యను వీరు శిష్యులకు ఎంతో విపులంగా, విశదంగా బోధించగల్గుతున్నారు. రాఘవరావు, రాజ్యశ్రీ పుణ్య దంపతులకు ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు, సర్వవిజయాలు ఇచ్చి ఆశీర్వదించమని, నా ఇష్టదైవమైన శ్రీకృష్ణుణ్ణి కోటిదండాలతో వేడుకుంటున్నాను.

మీ స్నేహితుడు
యమ్. విష్ణుప్రసాద్
ఫ్లాట్ నెం. ఎ – 1605
మైహోమ్ అబ్రా
ఇన్‌ఆర్‌బిట్ మాల్ దగ్గర,
మాదాపూర్, హైదరాబాద్ – 500032

# తేలికగా తైత్తిరీయం
## విషయసూచిక

| | | | |
|---|---|---|---|
| 1. | తొలి పలుకు | ...... | 03 |
| 2. | నా స్పందన | ...... | 07 |
| 3. | ఆప్తవాక్యాలు | ...... | 11 |
| 3. | ఉపోద్ఘాతం | ...... | 14 |
| 4. | శీక్షావల్లీ | ...... | 23 |
| 5. | బ్రహ్మానందవల్లీ | ...... | 59 |
| 6. | భృగువల్లీ | ...... | 115 |

# తేలికగా తైత్తిరీయం

## తైత్తిరీయోపనిషత్తు

### ఉపోద్ఘాతం:

తైత్తిరీయోపనిషత్తుకి ఆ పేరు ఎందుకు వచ్చింది?
ఒక్కొక్క ఉపనిషత్తుకి ఒక్కొక్క పద్ధతిలో పేరు పెట్టారు.
అనేక ప్రశ్నలు ఉన్నాయి కాబట్టి ప్రశ్నోపనిషత్తు.
కేనేషితం అన్నపదంతో మొదలయినది కాబట్టి కేనోపనిషత్తు.
ఈశావాస్యమిదగ్ం సర్వంతో మొదలయినది కాబట్టి ఈశావాస్యోపనిషత్తు.

తైత్తిరీయోపనిషత్తు లేదా తైత్తిరీయంకు ఆ పేరు ఎలా వచ్చిందో ఓ కథ చెపుతారు. అయితే ఈ కథలో అనేక పాఠాంతరాలున్నాయి. పూర్వం మేరు పర్వత సమీపంలో ఋషులంతా కలిసి జగత్కల్యాణం కోసం సత్రజిత్ యాగం తలపెట్టారు. ఆ యాగానికి ముఖ్యమైన ఋషులందరు తప్పని సరిగా రావాలని వారి వంతుగా యాగంలో పాల్గొనాలని నియమం పెట్టారు. అలా రాని వారికి బ్రహ్మహత్యాదోష మొస్తుందని శాపం కూడా పెట్టారు. వైశంపాయునునికి యాగంలో బ్రహ్మ పదవి స్వీకరించమని పిలుపు వచ్చింది.

వైశంపాయనుడు వ్యాసుని శిష్యుడు. వ్యాసుని ద్వారా యజుర్వేదం నేర్చుకుని దానిని తన శిష్యులకు నేర్పి ప్రచారం చేస్తున్నాడు. ఆయన శిష్యులలో ఒకడు యాజ్ఞవల్కి. ఇతను చాలా తెలివైన వాడు. శాస్త్రాన్ని చురుకుగా గ్రహించాడు. తెలివైన వాడుగా అందరి మన్ననలు అందుకుంటున్నాడు. అంతేకాదు యాజ్ఞవల్కి వైశంపాయనునికి మేనల్లుడు కూడా.

వైశంపాయనునికి ఈ సత్రయాగంకి వెళ్ళడానికి ఓ ఇబ్బంది వచ్చింది. ఆ రోజే తన తండ్రిగారి శ్రాద్ధకర్మ చేయవలసి ఉంది. అందుకని ఆయన యాగానికి వెళ్ళలేక పోయాడు. అయితే శాపం ప్రకారం బ్రహ్మహత్యా దోషం తగలకుండా శిష్యులను పిలిచి మీరంతా నాకు బ్రహ్మహత్యాదోషం రాకుండా వారం రోజులు ప్రాయశ్చిత్త కర్మలు నా తరుపున చేయండి అని చెప్పాడు. ఇంతలో యాజ్ఞవల్కి లేచి, ‘గురువుగారు, వీరి వల్ల ఇది సాధ్యంకాదు. వీరంతా

శ్రద్ధలేనివారు. ఎందుకూ పనికిరానికి వారు. నేనొక్కడినే ఈ కార్యం చేయగల సమర్ధుడను,' అని పదే పదే చెప్ప సాగాడు.

వైశంపాయనునకు యాజ్ఞవల్కి దర్పప్రదర్శన నచ్చలేదు. ఎంత వారించినా వినడం లేదు. దానితో ఆయన కోపం తారాస్థాయికి చేరింది. 'నా నుంచి నేర్చుకున్న విద్యవల్ల నీకు ఈ గర్వం వచ్చింది కనుక ఆ విద్యను ఇక్కడే వదిలి వెళ్ళు,' అని ఆదేశించారు. దాంతో గత్యంతరం లేక యాజ్ఞవల్కి తన నేర్చుకున్న యజుర్వేద విద్యను వమనం చేసాడు. అప్పుడు అక్కడ ఉన్న శిష్యులు, ఋషులు తిత్తిరి పక్షుల రూపంలో ఆ వమనాన్ని స్వీకరించారు. తిత్తిరి పక్షులు స్వీకరించాయి కనక దీనిని తైత్తిరీయ శాఖ అన్నారు. ఆ తైత్తిరీయ శాఖలోనిదే తైత్తిరీయ ఉపనిషత్తు. వమనం చేయబడినది కనుక ఈ యజుర్వేదం కృష్ణయజుర్వేదం అయింది.

తరువాత యాజ్ఞవల్కి సూర్యభగవానుని ప్రసన్నం చేసుకుని మళ్ళీ యజుర్వేదాన్ని పొందాడు. దీనిని శుక్లయజుర్వేదం అంటారు. ఈ యజుర్వేదాల మధ్య స్వర భేదం ఉంది. ఉత్తరభారతంలో శుక్లయజుర్వేదం ప్రాచుర్యంలో ఉంది. దక్షిణభారతం అంతా కృష్ణయజుర్వేదం ప్రసిద్ధి. తైత్తిరీయోపనిషత్తు కృష్ణయజుర్వేదం లోనిది.

వేదం అపౌరుషేయం, అది ఒకరిచే వ్రాయబడినది కాదు. ఈ వేదజ్ఞానాన్ని ఋషులు వాళ్ళ సత్త్వగుణం చేత పరమాత్మ నుంచి అందుకుని పరంపరగా ముందుతరాల వారికి అందించారు. బ్రహ్మజ్ఞానానికి ప్రమాణం శ్రుతి. ఋషులు విని తెలుసుకున్నారు కాబట్టి వేదాలని శ్రుతులు అని కూడా అంటారు.

ప్రతి వేదాన్ని నాలుగు భాగాలుగా అర్థం చేసుకోవచ్చు. అవి – సంహితలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు.

సంహితలు – దేవతలను స్తుతి చేస్తూ ఉండే సూక్తాలు సంహిత భాగంలో ఉంటాయి.

బ్రాహ్మణాలు – కర్మకాండ విధి విధానం బ్రాహ్మణ భాగంలో ఉంటుంది.

ఆరణ్యకాలు – ఎక్కువగా ఉపాసనలు ఇందులో చెప్పబడ్డాయి.

ఉపనిషత్తులు – వేదాల అంత భాగమే ఉపనిషత్తులు. దీనిలో జీవ – ఈశ్వర ఐక్యం చెప్పబడింది. దీనినే జ్ఞానకాండ అని కూడా అంటారు. ఉపనిషత్తు పదాన్ని పదవిచ్ఛేదం చేస్తే **ఉప+ని+షత్** అవుతుంది.

**షత్** – షత్ అంటే నాశనం చేసేది. ఏం నాశనం చేస్తుంది? సంసారాన్ని నాశనం చేస్తుంది. అది కూడా దీనికి మూలకారణమైన అజ్ఞానాన్ని నాశనం చేయటం ద్వారా. మనం అజ్ఞానం వల్ల సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాం. అజ్ఞానం వల్ల అంతా నేనే చేస్తున్నానన్న 'అహం' పెరుగుతుంది. అహం వల్ల కోరిక పుడుతుంది. కోరిక వల్ల కర్మలు చేస్తాం. వాటివల్ల సుఖదుఃఖాలు కలుగుతాయి. పుణ్యపాపాలను పెంచుకుంటాం.

ఆ పుణ్యపాపాలను హరించుకోవటానికి పునరపి జననం, పునరపి మరణం అనే చక్రంలో పడిపోతుంటాము. ఇదే మళ్ళీ చూద్దాం –

1. అజ్ఞానం వల్ల అహంకారం పుడుతుంది.
2. అహంకారం వల్ల నేను చేస్తున్నాను, నాది, నావాళ్ళు అనే ఆలోచన పుడుతుంది.
3. ఆలోచన కోరికలకు దారి తీస్తుంది.
4. కోరికలు మనను కర్మల్లోకి తోస్తాయి.
5. కర్మలు దృష్టఫలంగా సుఖదుఃఖాలు కలుగ చేస్తాయి.
6. కర్మలు అదృష్టఫలంగా పుణ్యపాపాల నిస్తాయి.
7. పుణ్యపాపాలు పునర్జన్మకు దారి తీస్తాయి.

ఈ ఏడు అడుగులు మనం అజ్ఞానం వల్ల వేస్తున్నాం.ఆ అజ్ఞానాన్ని పారద్రోలటం వల్ల మనకు దుఃఖ నాశనం కలిగి ఆత్యంతిక ఆనంద ప్రాప్తి అంటే జీవన్ముక్తి, మోక్షప్రాప్తి కలుగుతుంది. ఆత్మవిద్య వల్ల ఈ సంసార బంధం నుంచి విముక్తి పొందుతాం.

**ఉప** – ఆత్మజ్ఞానం కోసం ఆచార్యుని దగ్గరికి వెళ్లి ప్రశ్నలు అడిగి, జ్ఞానాన్ని పొందాలి. గురువుని అడగందే బోధ చేయరు. అర్జునుడు శరణువేడి, మార్గం చూపమంటేనే గీతాబోధ వచ్చింది. అది కూడా వినయంగా అడగాలి.

**ని** – నిశ్చయజ్ఞానం. ఆచార్యుని నుంచి నిశ్చయజ్ఞానం పొందాలి. కొంతమంది చేరగానే ఎన్నాళ్లు నేర్చుకోవాలి లేదా ఏదైనా క్రాష్‌కోర్సు ఉందా

అంటారు. అలా అనకూడదు. నిశ్చయ జ్ఞానం కలిగేదాకా వేదాంతం పదే పదే నేర్చుకోవాలి. సంసార చక్రం నుంచి బయటపడి మన స్వరూపం గురించి నిశ్చయ జ్ఞానం కలగాలి. నేను శరీరాన్ని కాదు, మనసుకాదు, ఇంద్రియాలు కాదు, జీవాత్మ కాదు, పరమాత్మకి బానిసను కాదు. నేను ఏకాత్మను; నిత్య,ముక్త, శుద్ధ, పరిపూర్ణ బ్రహ్మను అని అర్థం చేసుకోవాలి. **షత్** అంటే అజ్ఞాన నిర్మూలన అని ముందే తెలుసుకున్నాం.

అందువల్ల ఉపనిషత్తు అంటే ఆచార్యుడి దగ్గరికి వెళ్లి ఆత్మజ్ఞానం పొందితే సంసారాన్ని నాశనం చేసే నిశ్చయ జ్ఞానం కలిగిస్తుంది అని అర్థం.

వేద అంతభాగంలోకి వెళ్లేముందు కర్మకాండ గురించి కొన్ని ముఖ్యమైన అంశాలు చూద్దాం. కర్మకాండలో కర్మత్రయం, ఫలత్రయం, దోషత్రయం ఉంటాయి.

**1. కర్మత్రయం** – మనం వాడే కరణాల దృష్ట్యా మనం చేసే కర్మలు మూడు రకాలుగా ఉంటాయి. వాటిని త్రివిధం కర్మ అంటారు.

| | | | |
|---|---|---|---|
| **ఎ) కాయిక కర్మ** – | శరీరంతో చేసేది | – | పూజ, ప్రదక్షిణం, నమస్కారం, తీర్థయాత్ర, యజ్ఞం |
| **బి) వాచిక కర్మ** – | వాక్కుతో చేసేది | – | పైకి చేసే జపం, పారాయణం |
| **సి) మానస కర్మ** – | మనసుతో చేసేది | – | ధ్యానం |

**2. ఫలత్రయం –** ఏ కర్మ చేసినా, దానికి ఫలం ఉంటుంది. అది దృష్టఫలం కావచ్చు. అదృష్ట ఫలం కావచ్చు.అంటే కనపడే ఫలం, కనపడని ఫలం. ఆ ఫలం పుణ్యం కావచ్చు. పాపం కావచ్చు.

ఉదాహరణకు ఆకలితో ఉన్న పేదవానికి అన్నం దానం చేస్తే పుణ్యం వస్తుంది. అది దృష్టఫలంగానూ, అదృష్టఫలంగానూ కూడా వస్తుంది. ఆకలి తీరిన ఆ పేదవాని ముఖంలో కలిగిన ఆనందం, అతను నోరారా మనను దీవించటం – దృష్టఫలం. ఈ మంచి కార్యం చేసినందుకు మన ఖాతాలో కొంత పుణ్యం వచ్చి చేరుతుంది. ఇది అదృష్టఫలం.

కాని అతను – తినీ తినగానే, 'దుక్కలా ఉన్నావు, పనిచేసుకు బతకలేక,

ఇలా ఊరిమీద పడి తింటావెందుకు?' లాంటి దుర్భాషలాడామనుకోండి. అప్పుడు అదృష్టఫలంగా పాపం కొంత వచ్చి చేరుతుంది. అలా ప్రతి కర్మకూ పుణ్యమో, పాపమో ఏదో ఒక ఫలం తెలిసో, తెలియకో చేరుతూ ఉంటుంది.

ఆ ఫలాన్ని ఫలత్రయం అన్నారు. మనకు అది అర్థ లేదా కామ లేదా ధర్మ రూపంలో కలుగుతుంది. అంటే మనం చేసే కర్మలు ధర్మార్థకామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలలో మొదటి మూడింటినీ చేకూరుస్తాయి.

**ఎ) అర్థం –** ముందు కలిగే ఫలం అర్థం. అది ప్రాధమిక ఫలం. అర్థం అంటే అసలు అర్థం డబ్బు. కాని ఇక్కడ డబ్బు ఒక్కటే కాదు. డబ్బు, పదవి, అంతస్తు ఏదైనా కావచ్చు. భద్రతని చేకూర్చేదేదైనా వస్తుంది దాని కింద. ఆవు కూడా ఎండగా ఉంటే భద్రత కోసం నీడని వెతుక్కుంటుంది.

**బి) కామం –** కామం అంటే కోరిక. కోరిక భద్రతనివ్వదు. ఆనందాన్ని కలుగజేస్తుంది. ఉదాహరణకు – టీవీ భద్రతనివ్వదు. ఆనందాన్నిస్తుంది. డబ్బు వచ్చాక హెూమ్ థియేటర్ కావాలనో, ఏ స్విట్జర్లాండ్‌కో వెళ్లాలనో కోరుకుంటారు.

**సి) ధర్మం –** దీన్ని పుణ్యం అని కూడా అంటారు. మనం చేసే కర్మలు మనకు పుణ్యాన్నో, పాపాన్నో జమ చేస్తాయని అనుకున్నాం కదా! ఒక వయసు వచ్చాక ధర్మచింతన మొదలవుతుంది. ముందు అర్థ, కామాల వెంటపరుగులు తీసినా, మొదట్లో ధర్మపదంగా చేయాలన్న చింత లేకపోయినా, అంతర్వాణి ఎప్పుడో నిలదీయటం మొదలుపెడ్తుంది. ధర్మపరంగా అర్థ, కామాలను సాధించమంటుంది. ఎప్పుడూ మంచిపనులు చేస్తూ, మంచికి మారుపేరులా ఉండి దైవ చింతనతో కాలం గడుపుతూ, చీమకి కూడా హాని తలపెట్టని వ్యక్తేమో కష్టాల కడలిలో కూరుకుపోయి, దారిద్ర్యం అట్టడుగున ఉంటాడు. మంచి అంటే ఏమిటో తెలియని, దుర్మార్గానికి దుస్తులు తొడిగితే ఇలా ఉంటుందా అనిపించే వ్యక్తి మిలమిల మెరిసే బెంజ్‌కారులో తిరుగుతూ, అష్టైశ్వర్యాలతో తులతూగుతూ ఉంటాడు. అలా ఎందుకు జరుగుతుంది?

దీనికి జవాబు చెప్పాలంటే, కర్మసిద్ధాంతం అంతా విప్పాల్సి ఉంటుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే అది వాళ్ళ వాళ్ళ పూర్వజన్మ సుకృతం లేదా దుష్కృతం. వాళ్ళ ఖాతాలో ఉన్న పుణ్యం లేదా పాపం వాళ్ళకలాంటి జీవితం ఇస్తుంది. అంతేగాని భగవానుడు తనకు తోచినట్టుగా మనకు పుణ్యమో, పాపమో హెలీకాప్టర్

లోంచి కొంత కొంత పడేయడు. ఇవాళ మనం హాయిగా ఉన్నామంటే, మనం పూర్వజన్మలో ఎంతో మంచి చేసుకున్నామన్నమాట.

అలా మనం చేసిన కర్మత్రయం మనకు ఫలత్రయం ఇస్తుంది. ఇది సానుకూలంగా చెప్పిన మాట. వ్యతిరేకంగా చూస్తే మన కర్మత్రయం మనకు ఇచ్చే ఫలత్రయంలో దోషత్రయం ఉంది.

**3. దోషత్రయం** – మూడు రకాల కర్మలు చేస్తే, మూడు రకాల పురుషార్థాలను పొందవచ్చు. అంటే కాయిక, వాచిక, మానసిక కర్మల ద్వారా ధర్మార్థకామాలనే పురుషార్థాలను పొందవచ్చు. ఇవి మనకు శాంతిని, ఆనందాన్ని, భద్రతని, ఇచ్చినట్టు కనబడతాయి. పైకి గులాబీలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. కాని వాటి వెన్నంటే, గులాబీ ముళ్లలాంటి దోషత్రయాన్ని తీసుకు వస్తాయి. మూడు కర్మల ఫలాలు పొందినా వాటి వెనుక మూడు దోషాలు ఉన్నాయి.

**ఎ) దుఃఖమిశ్రితత్వం** – ఏ లక్ష్యం సాధించాలన్నా అది ప్రశాంత గోదావరి మీద సాఫీగా సాగే పడవ ప్రయాణం లాంటిది కాదు. ఎంతో ప్రయాసతో కూడింది. ఒకటి సాధించాలంటే ఎన్నో వదులుకోవాలి. ఆఖరికి ఒక స్కూల్లో సీటు సంపాదించాలన్నా, ముందురోజు రాత్రి వెళ్ళి ఆ స్కూలు గేటు ముందు, రోడ్డుమీద తల్లిదండ్రులు పడుకున్న రోజులున్నాయి. ఇంతా కష్టపడి సీటు సంపాదించినా, ఆ అబ్బాయిగానీ, అమ్మాయిగానీ చక్కగా చదివి పైకొస్తారా? ఏమో! పెరుగుట తరుగుట కొరకే అనీ, ఓడలు బళ్ళు అవుతాయనీ మన పెద్దలు అన్నారు. మనం కడుపు కట్టుకొని, కూడబెట్టిన ఆస్తి పదికాలాలు నిలుస్తుందా? నిలవదు! అందుకని ఆనందాన్ని అంటిబెట్టుకుని ఉంటుంది దుఃఖం. ఏ వస్తువూ, ఏ వ్యక్తీ పూర్తిగా ఆనందాన్నివ్వలేదు.

**బి) అతృప్తికరత్వం** – కోరికలు అనంతం అని ఆర్థికశాస్త్రంలో నేర్చుకుంటాం. మన పిల్లలు మనను పది కోరికలు కోరితే, మనం తొమ్మిది తీర్చామనుకోండి. వాళ్ళు దానికి తృప్తిపడతారా? లేదే! తీర్చని పదో కోరిక కోసం బాధపడతారు. పోనీ అని పదీ తీరిస్తే, ఇంకో కోరికతో సిద్ధంగా ఉంటారు.

**సి) బంధకత్వం** – ఒక వ్యక్తి మీద గాని, ఒక వస్తువు మీద గాని

ప్రేమ ఉండాలి. నిజమే గానీ, ఆ ప్రేమ మనను కట్టిపడేయకూడదు. సెల్‌ఫోన్ మనకు ఒక పరికరం అంతే. అది మనను 24 గంటలూ దానికే కట్టిపడేయకూడదు. పెళ్ళిపీటల మీదా, స్మశానంలోనూ సెల్‌ఫోన్ లేందే గడవదు. మనిషికి కావాలి, వద్దు అని చెప్పే స్వేచ్ఛ ఉంది. అది మనిషికి మాత్రమే ఉంది.

ఇంతవరకూ మనం కర్మత్రయం, ఫలత్రయం, దోషత్రయం చూసాము. మనం ఇంకా కర్మకాండలోనే ఉన్నాము. ఈ మూడు దోషాల వల్ల మన పరిస్థితి ఏమిటి? నిరంతరం ఖంగారు, ఆందోళన, ఒత్తిడి, భయం.

ఇంతకీ జీవితం ఇలా బాధతో, భయంతో, ఆందోళనతో నిండి ఉంది కదా! ఈ బాధ ఎందుకు వచ్చింది? కర్మ చేయటం వల్ల, కర్మచేస్తే కలిగే ఫలం వల్ల, ఆ ఫలం దోషభూయిష్టమైనది కావటం వల్ల. అందుకని కర్మ చేయటం ఎందుకు? బాధపడటం ఎందుకు? కర్మ మానేస్తే పోలా అనుకోకూడదు. లాభం లేదు. కర్మసన్యాసం కన్నా కర్మాచరణమే మేలంటుంది భగవద్గీత.

జాగ్రత్తగా చూస్తే మనసే మన బాధలకు, దుఃఖానికి, సుఖానికి, ఆనందానికి కారణం.

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః॥**

మనస్సే బంధించినా, మోక్షానికైనా. మనస్సు మళ్ళీ మూడు దోషాలతో ఉంది. అవి – మలం, విక్షేపం, అజ్ఞాన ఆవరణం.

**ఎ) మలం** – కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం. ఇవి మన మనసుకున్న మలినాలు.

**బి) విక్షేపం** – మనస్సు స్థిరంగా లేక ఎప్పుడూ చంచలంగా ఉంటుంది.

**సి) అజ్ఞాన ఆవరణం** – నేనెవరో, నా స్వరూపమేమిటో తెలియకపోడం వల్ల నేను ఈ శరీరాన్ని, నేను మనసుని అనుకుని, నేనూ, నాదీ, నావాళ్ళూ అనే భ్రాంతితో వ్యవహరించి లేని దుఃఖాన్ని కొని తెచ్చుకుంటున్నాను.

మల నివృత్తికి కర్మయోగం చెప్పబడింది. కర్మయోగంలో కర్మలు చేయాలి. విహిత కర్మలు అంటే శాస్త్ర సమ్మతమైన కర్మలు నిష్కామంగా చేయాలి. నిషిద్ధకర్మలు విడిచిపెట్టాలి. ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేయాలి. కర్మలను ఈశ్వరునికి అర్పిస్తున్నాం కదా! అందుకని ఎంతో శ్రద్ధగా, పూచీతో కర్మలు చేయాలి. కర్మఫలాలను ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించాలి. ఇలా చేయటం

వల్ల మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. చిత్తశుద్ధి, చిత్తవైశాల్యం కలుగుతుంది.

విక్షేప నివృత్తికి ఉపాసన అవసరం. మానసిక మంత్ర జపం లేదా ధ్యానం వల్ల చిత్త ఏకాగ్రత కలుగుతుంది. పరిపరి విధాల పోయే మనసు కుదుట పడుతుంది. చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత వేదాంత శ్రవణానికి చాలా అవసరం. ఇవి సాధించకుండా శాస్త్ర శ్రవణం చేస్తే ప్రయోజనం ఉండదు.

అజ్ఞాన ఆవరణం పోవాలంటే శ్రోత్రియుడు బ్రహ్మనిష్ఠుడు అయిన గురువుద్వారా శాస్త్రం శ్రవణం చేయాలి. శ్రవణం, మననం, నిదిధ్యాసనల ద్వారా నేనే బ్రహ్మను అని నిస్సంశయంగా తెలుసుకుని ఆ బ్రహ్మనిష్ఠలో ఉండాలి.

భగవద్గీతలో మనసు లోని మలనివృత్తికి కర్మయోగం, విక్షేపనివృత్తికి ధ్యానయోగం, అజ్ఞాన ఆవరణ నివృత్తికి జ్ఞానయోగం చెప్పబడ్డాయి. భక్తియోగం అన్ని యోగాలకి అంతర్వాహినిలా ఉంటుంది. భక్తి పరాకాష్ఠే జ్ఞానం.

నారదులవారికి తెలియని విషయం లేదు. ఎన్నో శాస్త్రాలు నేర్చుకున్నారు. సిద్ధులు ఉన్నాయి, త్రికాలజ్ఞాని.

**తరతి శోకం ఆత్మవిత్ – ఛాందోగ్యం**

ఏ విద్య తెలుసుకుంటే శోకం పోతుందో ఆ విద్య నేర్పించు అని సనత్కుమారుల దగ్గరికి వెళ్లి కోరారని ఛాందోగ్య ఉపనిషత్తులో వస్తుంది.

**జ్ఞానకాండం** – వేద అంతభాగాన్ని వేదాంతం అనీ, జ్ఞానకాండం అనీ ఉపనిషత్తనీ అంటారు. కర్మకాండం వల్ల అనేక కర్మలు, యజ్ఞాలు ఎలా చేయాలో నేర్చుకుని, దాన్నించి సంసారమనే చక్రంలో ఇరుక్కోకుండా జ్ఞానకాండకి వచ్చి మోక్షం పొందాలని శాస్త్రం ఉద్దేశ్యం. కర్మలు చేయటం వల్ల చిత్తశుద్ధి, ఉపాసన చేయటం వల్ల చిత్త ఏకాగ్రత ఏర్పడుతుంది. దానివల్ల సాధన చతుష్టయ సంపన్నుడయి జ్ఞానకాండకు అధికారి అవుతారు. సాధన చతుష్టయం అంటే వివేకం, వైరాగ్యం, శమదమాది షట్క సంపత్తి, ముముక్షత్వం.

**గురుశిష్యుల సంవాదం** – ఆత్మజ్ఞానం గురుశిష్యుల సంవాదం ద్వారా బోధింపబడుతుంది. సంవాదం అంటే సంభాషణ. భగవద్గీతను కూడా శ్రీకృష్ణార్జునుల సంవాదం అంటారు. సంవాదం రూపంలోనే ఎందుకు?

1. అర్థం చేసుకోవటం తేలిక.

2. ఉపనిషత్తులను స్వయంగా అధ్యయనం చేయటానికి ప్రయత్నించకూడదు.

3. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువుద్వారానే నేర్చుకోవాలని ఉపనిషత్తు చెప్తుంది. గురువులను గౌరవించేలా చేయాలని గురువులు చెప్పుకోలేదు.

ఒక గురువుకు జ్ఞానం ఉన్నా కూడా అతను సంప్రదాయం పాటించకపోతే అతన్ని మూర్ఖునిలా పరిగణించి పట్టించుకోవద్దన్నారు శంకరాచార్యులు గీతాభాష్యంలో.

4. గురువు దగ్గరికి తానే వినమ్రుడై సమిధలు తీసుకుని వెళ్ళి, ప్రశ్నలు వేసి నేర్చుకోవాలి.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**

**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ - ముండక 1-2-12**

వేదాలలో 1180 ఉపనిషత్తులుండేవి. వాటిలో చాలా కాలగర్భంలో కలిసి పోయాయి. ఈ రోజుకు 108 ఉపనిషత్తులు మాత్రం మిగిలాయి. వాటిలో కూడా పది ఉపనిషత్తులు చాలా ముఖ్యమైనవి. అవి -

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః।**

**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

ఈశావాస్యోపనిషత్తు, కేనోపనిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, ఐతరీయోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు. వీటిని దశోపనిషత్తులంటారు. వీటిని ప్రధాన ఉపనిషత్తులని కూడా అంటారు. ఆదిశంకరులు వీటిపై భాష్యం రాశారు కనుక వీటికి ప్రాముఖ్యం వచ్చింది. వీటిని వేదాంత విద్యార్థులు అధ్యయనం చేస్తారు. బ్రహ్మ సూత్రాలలో కూడా వీటి మీద చర్చ ఉంటుంది.

ఇక తైత్తిరీయంలో ప్రవేశిద్దాం. తైత్తిరీయంలో మూడు అధ్యాయాలున్నాయి. ఇందులో అధ్యాయాన్ని వల్లీ అంటారు. అధ్యాయాల పేర్లు **శీక్షావల్లీ, బ్రహ్మానందవల్లీ, భృగువల్లీ**. ఇవి గద్యరూపంలో ఉంటాయి. ప్రతి వల్లీలో కొన్ని అనువాకాలు ఉంటాయి. అనువాకం అంటే ఒక పేరా.

# శీక్షావల్లీ
## అనువాకం 1

**శాంతి పాఠం**

**ఓం శం నో మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణు రురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్। ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥ 1**

ప్రాణవృత్తికి, రోజుకి అభిమానదేవత మిత్రుడు మాకు సుఖం కలుగజేయుగాక! అపానవృత్తికి, రాత్రికి అభిమానదేవత వరుణుడు మాకు సుఖప్రదుడగుగాక! కంటికి, సూర్యమండలానికి అభిమానదేవత సూర్య నారాయణుడు మాకు శుభప్రదుడగుగాక! బలాభిమాన దేవత ఇంద్రుడు, వాక్కుకు, బుద్ధికి అభిమానదేవత బృహస్పతి మాకు సుఖశాంతులనొసగుగాక! పెద్ద పెద్ద అంగలు వేసే, పాదాలకు అభిమాన దేవత విష్ణుభగవానుడు మాకు శుభప్రదుడగుగాక. వాయురూపుడైన బ్రహ్మకు నమస్కారం.

ఓ వాయుదేవా! నీకు నా నమస్కారం. నీవే ప్రత్యక్షమైన బ్రహ్మగా నేను చెపుతున్నాను. శాస్త్రముద్వారా నిశ్చితమైన సత్యస్వరూపుడవు నీవేనని చెపుతున్నాను. శరీరానికి వాక్కుకు వెనక ఉన్న చైతన్య సత్యము నీవేనని చెపుతున్నాను. ఆ సర్వాత్మకుడైన వాయు రూపములోనున్న బ్రహ్మ, నాకు జ్ఞానసంపదనిచ్చి నన్ను రక్షించుగాక। ఆ బ్రహ్మము ఆచార్యులకు వక్తృత్వ సామర్థ్యాన్ని ప్రసాదించి రక్షించుగాక। నాకు గ్రహణ ధారణ సామర్థ్యములనిచ్చి నన్ను రక్షించుగాక। నన్ను రక్షించుగాక। ఆచార్యులను రక్షించుగాక। ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆదిదైవిక తాపములు శమించుగాక!

**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥** – మూడు రకాలైన విఘ్నాల నుంచి విముక్తి కోరుతున్నాము.

**1. ఆధ్యాత్మిక** – నా నుంచి ఆటంకాలు కలగకుండా చేయి. నా నుంచి అంటే నా శరీరపరంగా, మనసు పరంగా ఎటువంటి ఇబ్బంది

లేకుండా శాంతి. మనం వేదాంతం బోధకి వెళదామంటే జ్వరం రావచ్చు. మనం మూడు అడుగులు ముందుకు వేద్దామని చూస్తే, మన మనసు మనను ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది. నేనేమిటి ఆత్మజ్ఞానం పొందటమేమిటి అది నా తల మీంచి పోతుంది అని అపోహ పడతాం మనం. ఈ ఆటంకాలను లేకుండా చేయమని ప్రార్థన. ఇది మొదటి శాంతి.

**2. ఆదిభౌతిక** – పరిసరాల నుంచి, పక్కవాళ్ళ నుంచి, తోటి జీవరాసుల నుంచి కలిగే ఆటంకాలు. సరిగ్గా వేదాంతం క్లాసుకి వెళదామనే సరికి ఫోను మ్రోగుతుంది మీ యింటికి ఇంకో ఐదు నిముషాల్లో వస్తున్నాం, ఎక్కడకీ వెళ్ళద్దని లేదా క్లాసులో చక్కగా పాఠం వింటున్నాం ఎటునుంచో ఓ కందిరీగ వచ్చి మన నెత్తి మీద స్వైర విహారం చేస్తుంది. ఈ రెండింటి మీద మనకి కొంత అదుపు, అధికారం ఉంది. ఈ ఆటంకాలు లేకుండా చేయమని ప్రార్థన. ఇది రెండవ శాంతి.

**3. ఆదిదైవిక** – తుఫాను, వాతావరణంలో మార్పులలాంటి ప్రకృతి వైపరీత్యాల ఆటంకాలు. వీటిమీద మనకి బొత్తిగా అధికారం లేదు. వీటి నుంచి నన్ను కాపాడమని సర్వజ్ఞుడైన భగవంతుని ప్రార్థిస్తున్నాం. ఇది మూడవ శాంతి.

శీక్షావల్లీ సాధకుని అంతఃకరణశుద్ధికి దోహదం చేస్తుంది. ఇందులో ఐదు ఉపాసనలు, రెండు జపాలు, పారాయణం, కర్మయోగం చెప్పబడ్డాయి. ఇవి నిష్కామంగా చేసిన సాధకునకు అంతఃకరణ శుద్ధికలిగి ముందు అధ్యాయంలో చర్చించబోయే బ్రహ్మవిద్యకు అతను అధికారి అవుతాడు.

**అనువాకం 2**

**శీక్షాం వ్యాఖ్యాస్యామః । వర్ణః స్వరః। మాత్రా బలమ్। సామ సంతానః। ఇత్యుక్తః శీక్షాధ్యాయః।**

**శీక్షాం వ్యాఖ్యాస్యామః।** ఈ రెండవ అనువాకంలో శిక్షాశాస్త్రాన్ని చక్కగా తెలుసుకుందాం. ముందుగా వేద అధ్యయనానికి పనికివచ్చే అంగాలు.

అవి – శిక్షా, కల్పం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిష్యమ్.

**శిక్షాశాస్త్రం** అంటే ఏమిటి? **శిక్షా** – వేద ఉచ్చారణకు సంబంధించిన శాస్త్రం. ఉదా: పాణినీయ శిక్షా శాస్త్రం.

**కల్పమ్** – యజ్ఞ విధివిధానం తెలిపేది కల్పం. సత్యన్నారాయణ వ్రతకల్పం అంటాము. అంటే సత్యన్నారాయణ వ్రతం చేసే పద్ధతి. అదే విధంగా కల్పం అంటే ఇక్కడ వేదంలో యజ్ఞయాగాదుల విధానం చెప్పబడుతుంది.

**నిరుక్తమ్** – వేదంలో వచ్చే పదాలు, వాటి అర్థాలు, ధాతువులు వాటి లోని మార్పులు ఇవన్నీ నిరుక్తం చెపుతుంది. ఒక విధంగా నిఘంటువు అనవచ్చు. నిరుక్తాలలో యాస్కాచార్య నిరుక్తం చాలా ప్రసిద్ధి కెక్కినది.

**ఛందస్సు** – వేదం పద్యరూపంలో ఉంటే ఛందోబద్ధంగా వుంటుంది. అనేక ఛందస్సులున్నాయి. ఉదా: అనుష్టుప్, బృహతీ, మహతీ, గాయత్రీ, పంక్తి.

**జ్యోతిష్యమ్** – వేదకాలంలో యజ్ఞయాగాదులకు అనుకూలమైన కాలనిర్ణయంకోసం జ్యోతిష్యశాస్త్రం వాడేవారు. కాలక్రమేణ ఇది భవిష్యత్ తెలిపే శాస్త్రంగా పరిణమించింది. ఉదా: పరాశర సంహిత.

శిక్షా అనే పదాన్నే ఇక్కడ శీక్షా అని చెప్పబడింది. శీక్షా అనేది ఛాందస ప్రయోగం. శిక్షా అనే పదమే సరైనది. వల్లీ అనేది అధ్యాయం. శీక్షా పదంతో మొదలయింది కనుక ఈ వల్లీకి శీక్షావల్లీ అన్న పేరు వచ్చింది. ఈ అధ్యాయం శీక్షావల్లీ కనుక ఇందులో శిక్షాశాస్త్రానికి సంబంధించిన ముఖ్య అంశాలు పేర్కొనబడ్డాయి.శిక్షాశాస్త్రం చాలా లోతైనది, విస్తారమైనది. ఇది గురుముఖతః శ్రవణపరంగా నేర్చుకునే శాస్త్రం. తైత్తిరీయంలో శీక్షావల్లీలో కేవలం కొన్ని అంశాలు సూచనప్రాయంగా పేర్కొనబడ్డాయి. శిక్షాశాస్త్రంలోని ముఖ్య అంశాలు **– వర్ణం, సర్వం, మాత్రా, బలం, సామం, సంతానం.**

**వర్ణమ్** – వర్ణం అక్షరాలు పలికే విధానం ఇక్కడ చెప్పబడుతుంది. ఈ అక్షరాలు మన శిరస్సులోని 8 స్థానాల నుంచి ఉత్పన్నమౌతాయి. వాటి స్థానాల గుర్తెరిగి వాటిని చక్కగా పలకాలి. ఒకదానికొకటి పలకకూడదు.

అక్షరాలు ఉత్పత్తి అయ్యే కొన్ని స్థానాలు చూద్దాం.

కంఠవ్యాలు – క,ఖ,గ,ఘ,ఙ ఇవి కంఠం నుంచి పుడతాయి.

తాలవ్యాలు – చ,ఛ,జ,ఝ,ఞ ఇవి దవడల నుంచి పుడతాయి.

మూర్ధన్యాలు – ట,ఠ,డ,ఢ,న ఇవి నాలుక పై అంగుటి మధ్యభాగాన్ని స్పృశించడంతో పుడతాయి.

దంతవ్యాలు – త,థ,ద,ధ,ణ ఇవినాలుక దంతపు మొనను స్పృశించడంతో

పుడతాయి.

ఓష్ఠ్యాలు – ప,ఫ,బ,భ,మ ఇవి రెండు పెదవుల కలయిక వల్ల పుడతాయి.

అల్పప్రాణాలు – క,చటత,ప వీటికి ఎక్కువ వాయువు అవసరం లేదు.

మహా ప్రాణాలు –ఖ,ఘ,ఛ,ఝ,ఠ,ఢ,థ,ధ,హ వీటికి ఎక్కువ వాయువు కావాలి.

పలికేటప్పుడు భ అనే చోట బ అనకూడదు. చాలామంది భారతం అనటానికి బారతం అంటారు, అది తప్పు. మన మాతృభాష ప్రభావం సంస్కృత పదాలు పలికేటప్పుడు కనిపిస్తూంటుంది. ఉదా: బంగాలీలకు వ పలకడం కష్టం. వారు వ బదులు బ పలుకతారు. వివాహ భోజనంబు వింతైన వంటకంబు వియ్యాల వారి విందు అనాలంటే బిబాహ భోజనంబు బింతైన బంటకంబు బియ్యాల బారి బిందు అంటారు.

అలాగే మన తెలుగు సోదరులకు థ, ధల దగ్గర చాలా ఇబ్బంది వస్తుంది. గ్రంథం అనడానికి గ్రంధం అంటారు. శంకర అనకూడదు శఙ్కర అనాలి. దండము అనకూడదు దణ్డము అనాలి. అక్షరాలు ఎలా పలకాలో అలాగే పలకాలి.అలా పలకడాన్ని అక్షరశుద్ధి అంటారు.

**స్వరమ్** – వేదపారాయణంలో స్వరం చాలా ముఖ్యమైనది. వేదం అపౌరుషేయం. ఇది కర్ణపరంపరగా ఈ రోజువరకు కాపాడబడింది అంటే స్వరమే కారణం. స్వరం అంటే పారాయణం చేసేటప్పుడు స్థాయీ భేదం పాటించడం.

మొదటిది ఉచ్చస్థాయిలో పలికే స్వరం. దీనిని స్వరితం అంటారు. స్వరితం వచ్చే అక్షరాలపైన ‘ । ’ గుర్తు ఉంటుంది.

రెండవది కిందస్థాయిలో పలికే స్వరం – అనుదాత్తం అంటారు. అనుదాత్తం వచ్చే అక్షరాల కింద ‘ – ’ గుర్తు ఉంటుంది.

మూడవది దీర్ఘస్వరితం: అక్షరాన్ని దీర్ఘంగా రెండు మాత్రలకాలం పలకాలి. దీర్ఘస్వరితం వచ్చే అక్షరాలపైన ‘ ॥ ’ గుర్తు ఉంటుంది.

నాలుగవది ఉదాత్తం: ఇది ఏ గుర్తు లేకుండా సాధారణమైన అక్షరం. దీనిని పైస్థాయి, క్రిందస్థాయి కాకుండా మామూలుగా పలకాలి.

ఇప్పటి సంప్రదాయం బట్టి ఉదాత్త, అనుదాత్త, స్వరిత, దీర్ఘస్వరితాలు ఇలా ఉన్నాయి. అయితే వ్యాకరణ పితామహ పాణిని తన సూత్రాలలో

ఉచ్చైరుదాత్తః, నీచైరనుదాత్తః, సమాహారః స్వరితః అని చెప్పారు.

స్వరనిర్వచనంలో అనేక రకాల వైవిధ్యాలు ఉన్నాయి. శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామి రచించిన **వేదసదస్సు** అనే పుస్తకంలో ఈ విషయం చాలా వివరంగా ఉంది. ఔత్సాహికులు చదివి తెలుసుకొనగలరు.

స్వరాలను గుర్తించి పలకడం స్వరశుద్ధి. వేదపఠనంలో దైవప్రీతి స్వరశుద్ధి వల్లే కలుగుతుంది.

స్వరం సరిగ్గా లేకపోతే అనర్థాలు కూడా జరుగుతాయి. దీనికి వేదమే ఓ కథచెపుతుంది. పూర్వం విశ్వరూప అని దేవపురోహితుడుండే వాడు. ఆయన పేరుకి దేవపురోహితుడైనా అసుర పక్షపాతి. దొంగచాటుగా వాళ్ళకు మేలు చేస్తూండేవాడు. ఇది గమనించిన ఇంద్రుడు ఆయనను తన వజ్రాయుధంతో హతమార్చాడు. ఇది తెలిసిన విశ్వరూప తండ్రి త్వష్ట, ఇంద్రుని హతమార్చే పుత్రుని కోసం యాగం చేశాడు. యాగఫలంగా అతనికి పుత్రుడు పుట్టాడు. అతని పేరు వృత్రాసురుడు. కాని ఆ పుత్రుడు కూడా ఇంద్రుని చేత చంపబడ్డాడు.

విషయం వాకబు చేస్తే తెలిసింది. యాగంలో అతను ఇంద్రశత్రుః అని పలికాడు – ఇంద్రుని చంపే శత్రువు కావాలి అనటానికి (స్వరం సరిగా లేక తత్పురుష సమాసానికి బదులు బహువ్రీహి వాడాడు). స్వరభేదం చేత ఇంద్రునిచే చంపబడే పుత్రుడు కావాలి అని అర్థం వచ్చింది. కాబట్టి స్వరం చాలా ముఖ్యం. అలాగే కుంభకర్ణుడు నిర్దేవత్వం అని అడగడానికి నిద్రత్వం అన్నాడుట. అందుకే అతనిని వల్లమాలిన నిద్ర వరించింది.

**మాత్రా –** అక్షరాలు పలికే కాలం లేదా నిడివిని మాత్ర అంటారు. అక్షరాలు అర్ధమాత్ర, హ్రస్వం, దీర్ఘం అని మూడు రకాలు. ఇవి కాకుండా సామవేదంలో ప్లుతం అని వస్తుంది. ప్లుతం దీర్ఘం కన్నా పెద్దది.హ్రస్వం ఒక చిటిక కాలం ఉచ్ఛరించాలి. దీర్ఘం రెండు చిటికల కాలం ఉచ్ఛరించాలి. అర్థమాత్రకు ఉదా: మ్ పలకాలంటే అర్థ చిటిక కాలం చాలు. ప్లుతంకు అక్షరం పక్కన 3 లేదా అంతకన్నా పెద్ద సంఖ్య ఉంటుంది. ఆ సంఖ్య ఎంత ఉంటే అన్ని చిటికల కాలం ప్లుతం ఉచ్ఛరించాలి. ప్రతి అక్షరాన్ని పలికే కాలాన్ని చక్కగా పాటించడం మాత్రాశుద్ధి అంటారు.

**బలం** – అక్షరం ఎంత ప్రయత్నంతో పలకాలో చెప్పేది బలం. ఇది చాలా లోతైన విషయం. గురుముఖతః నేర్చుకో తగినది. బాహ్యప్రయత్నం, ఆంతరప్రయత్నం అని ఉంటాయి.

**సామం** – ఏ వేగంతో వేదపఠనం చెయ్యాలో చెప్పేది సామం. అధ్యయన కాలంలో వల్లె వేసేటప్పుడు వేగంగా చదవాలి. క్రతువులో మధ్యస్థాయిలో చదవాలి. నేర్పేటప్పుడు మెల్లిగా చదవాలి. ఇవన్నీ సామం నియమాలు.

**గీతీ శీఘ్రీ శిరఃకంపీ తథా లిఖితపాఠకః**

**అనర్థజ్ఞః అల్పకణ్ఠశ్చ షడతే పాఠకాధమాః॥**

**గీతీ** – వేదం పాటలా పాడేవాడు.

**శీఘ్రీ** – తొందర తొందరగా తరుముకొస్తునట్టు పఠించేవాడు.

**శిరః కంపీ** – పఠించేటప్పుడు అదేపనిగా తల ఊపేవాడు.

**లిఖితపాఠకః** – వేదం కంఠస్థం చేయకుండా చూచి చదివేవాడు.

**అనర్థజ్ఞః** – అర్థం తెలుసుకోకుండా పఠించే వాడు.

**అల్పకణ్ఠః** – లోగొంతులో పఠించేవాడు.

పై దోషాలతో పఠించేవాడు శాస్త్రం ప్రకారం అధముడు.

**సంతానం** – పదం పదంకు మధ్య ఇచ్చే నిశ్శబ్దకాలం సంతానం. మరీ ఎక్కువ విరామం లేకుండా చదవాలి. సమాసంలో పదాలు విడతీయ కుండా చదవాలి. ఉదా: అఖండమండలాకారంవ్యాప్తంయేనచరాచరం అన్నది ఒకే సమాసం. దీని చదివేటప్పుడు విడదీయ కూడదు. ఓమ్ ఉచ్చరించిన తర్వాత స్వల్పమైన విరామం పాటించాలి. ఒక పదం అచ్చుతో ముగిసి మళ్ళీ వచ్చే పదం అచ్చుతో మొదలైతే మధ్యలో స్వల్పమైన విరామం పాటించాలి. విసర్గం తరువాత క్ష వస్తే విసర్గకు, క్షకు మధ్య స్వల్పమైన విరామం పాటించాలి. సంతాన నియమాలు ఈ విధంగా ఉంటాయి.

వేద పఠనం అంటే పుస్తకం చూసి చదవడం కాదు! వేదం మొత్తం చూడకుండా చెప్పగలగాలి. ఇది ఒక అమోఘమైన సాధన. ఇవి కాక వేదపఠనం, ధారణకు దోహదం చేసే విధంగా వేదం చదివే పద్ధతులు అనేకం ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి సంహితా, పద, క్రమ, జఠ, ఘన పద్ధతులు. చిన్నప్పుడు

ఎక్కాలు నేర్చుకునేటప్పుడు క్రిందనించి పైకి వల్లె వేయించేవారు. దీనివల్ల నిద్రలో లేపి అడిగినా చెప్పే సామర్థ్యం వచ్చేది. అదే విధంగా వేదం మొత్తం ధారణ చేయడానికి ఈ పద్ధతులు ఎంతో సహాయకారిగా ఉంటాయి.

సంహితా పద్ధతి – ఇందులో మొత్తం వాక్యం చదవాలి.

ఉదా – నమః శివాయ చ।

పద పద్ధతి – ప్రతి పదము ఆపి చదవాలి. నమః। శివాయ। చ।

క్రమ పద్ధతి – ఒక వాక్యంలో పదాలను 1 2 / 2 3 / 3 4 / 5 6 / 7 8 /.... పద్ధతిలో పఠిస్తే క్రమపద్ధతి అవుతుంది. ఉదా – నమః శివాయ॥ శివాయ చ॥ ఈ పద్ధతిలో కేవలం పదాలను అమర్చడమే కాదు దానికి సంబంధించిన వ్యాకరణం కూడా అమలు చేయాలి.స్వరంతో పలకాలి. క్రమ పద్ధతిలో ఆరితేరిన వానిని క్రమవిత్ అంటారు.

జటా పద్ధతి – 1 2 2 1 1 2 / 2 3 3 2 2 3 / 3 4 4 3 3 4 / 4 5 5 4 4 5 / ... పద్ధతిలో పఠిస్తారు. జటా పద్ధతిలో ఆరితేరిన వానిని జటావల్లభుడు అంటారు. ఉదా– నమః శివాయ శివాయ నమో నమః శివాయ॥ శివాయ చ చ శివాయ శివాయ చ॥

ఘన పద్ధతి – 1 2 2 1 1 2 3 3 2 1 1 2 3 / 2 3 3 2 2 3 4 4 3 2 2 3 4 / 3 4 4 3 3 4 5 5 4 3 3 4 5 / ........ పద్ధతిలో పఠిస్తారు.ఘన పద్ధతిలో ఆరితేరిన వానిని ఘనాపాఠి అంటారు. ఉదా: నమః శివాయ చ ఘనపాఠమ్ – నమః శివాయ శివాయ నమో నమః శివాయ చ చ శివాయ నమో నమః శివాయ చ॥

ఇవేకాక మాలా, శిఖా, రేఖా, ద్వజ, దణ్డ అనే పద్ధతులు కూడా ఉన్నాయి.

మాలా పద్ధతి 1 2 / 2 1 / 1 2 / 2 3 / 3 2 / 2 3 / 3 4 / 4 3 / 3 4 ....

శిఖా పద్ధతి 1 2 2 1 1 2 3 / 2 3 3 2 2 3 4 / 3 4 4 3 3 4 5 /

రేఖా పద్ధతి 1 2 / 2 1 / 1 2 / 2 3 4 / 4 3 2 / 2 3 / 3 4 5 6 / 6 5 3 4 / 3 4 / 4 5 6 7 8 / 8 7 6 5 4 /

ద్వజ పద్ధతి 1 2 / 99 100 / 2 3 / 98 99 / 3 4 / 97 98 / 4 5 /

96 97 / 5 6 / 95 96 / ....... 98 99 / 2 3 / 99 100 / 1 2
దణ్డ పద్ధతి 1 2 / 2 1 / 1 2 / 2 3 / 3 2 1 / 1 2 / 2 3 / 3 4 / 4 3 2 1 / 1 2 / 2 3 / 3 4 / 4 5 / 5 4 3 2 1 ................

**అనువాకం 3**

**సహనౌ యశః। సహ నౌ బ్రహ్మ వర్చసమ్। అథాతస్సగ్ంహితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః। పంచస్వధికరణేషు। అధిలోకమధిజ్యౌతిషమధి విద్యమధిప్రజ మధ్యాత్మమ్। తా మహాసగ్ంహితా ఇత్యాచక్షతే। అథాధిలోకమ్। పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తరరూపమ్। ఆకాశస్సన్ధిః। వాయుస్సన్ధానమ్। ఇత్యధిలోకమ్।**

**అథాధిజ్యౌతిషమ్। అగ్నిః పూర్వరూపమ్। ఆదిత్య ఉత్తరరూపమ్। ఆపస్సన్ధిః। వైద్యుతస్సన్ధానమ్। ఇత్యధిజ్యౌతిషమ్।**

**అథాధివిద్యమ్। ఆచార్యః పూర్వరూపమ్।అంతేవాస్యుత్తర రూపమ్। విద్యా సన్ధిః। ప్రవచనగ్ం సన్ధానమ్। ఇత్యధివిద్యమ్।**

**అథాధిప్రజమ్। మాతా పూర్వరూపమ్। పితోత్తరరూపమ్। ప్రజాసన్ధిః। ప్రజననగ్ం సన్ధానమ్। ఇత్యధిప్రజమ్।**

**అథాధ్యాత్మమ్। అధరాహనుః పూర్వరూపమ్। ఉత్తరాహనురుత్తరరూపమ్। వాక్సన్ధిః। జిహ్వా సన్ధానమ్। ఇత్యధ్యాత్మమ్।**

**ఇతీమా మహాసగ్ంహితాః। య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద। సంధీయతే ప్రజయా పశుభిః। బ్రహ్మవర్చసేనాన్నాద్యేన సువర్గ్యేణ లోకేన॥**

మూడవ అనువాకంలో ఉపనిషత్తు సంహితోపాసన చెప్పబోతోంది. ఉపాసనలో ఆలంబన లేదా ప్రతీక ఉంటుంది.

సంహితోపాసనలో అక్షరాలు, వాటి కలియికల మీద ఉపాసన చేయాలి. ఇలా ఎందుకు చెప్పడం జరిగింది? ఇక్కడ వేదవిద్యార్థి 24 గంటలు వేదాన్ని వల్లెవేస్తున్నాడు. అతని మస్తిష్కం వైదిక పదజాలంతో నిండి పోయింది. అతన్ని అక్షరాలతో ఉపాసనలు చేయమంటే చాలా సులభంగా చేయగలుగుతాడు.

**సహనౌ యశః। సహ నౌ బ్రహ్మ వర్చసమ్।** నేను, మా గురువుగారు యశస్సుతో బ్రహ్మవర్చస్సు కలిగి ఉందుము గాక! ఇది సంకల్పం.

**అథాతస్సగ్ంహితాయ ఉపనిషదం వ్యాఖ్యాస్యామః।**

ఉపాసనలు మొదలౌతున్నాయి. ఉపాసన అంటే ఏమిటి? నికృష్ట వస్తువు మీద ఉత్కృష్ట వస్తు భావన – ఒక చిన్న వస్తువు మీద చాలా పెద్ద వస్తువును భావన చేయడమే ఉపాసన. ఉదాహరణకు స్వాతంత్ర్య దినోత్సవంలో మన యావద్భారతానికి నమస్కారం పెట్టాలి అనుకున్నాం. అది ఎలా సాధ్యం? కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు నమస్కారం పెడుతూ తిరగలేం కదా! చక్కగా జాతీయ పతాకం ముందు నుంచుని వినయంగా నమస్కారం చేస్తాం. జాతీయ పతాకంలో భారత దేశాన్నంతా భావన చేస్తాం. ఇదే ఉపాసనంటే.

పూజా సమయంలో పసుపుని ముద్దగా చేసి అందులోకి వినాయకుని ఆహ్వానం చేసి పసుపు ముద్దే వినాయకుడని భావన చేసి పూజ చేస్తాం. పసుపు ముద్ద ఆలంబన లేదా ప్రతీకం. వినాయకుడు ఉపాస్య వస్తువు లేదా ఉపాస్య దేవత. పసుపు ముద్దే వినాయకుడనే భావన ఉపాసన.

**పంచస్వధికరణేషు।అధిలోకమధిజ్యౌతిషమధివిద్యమధిప్రజమధ్యాత్మమ్।**

**తా మహాసగ్ంహితా ఇత్యాచక్షతే।**

ఇప్పుడు సంహితోపాసన గురించి తెలుసుకుందాం! ఇవి ఐదు అధికరణాలతో కూడినవి. అవి లోకానికి, జ్యోతులకు, విద్యలకు, సంతతికి, శరీరానికి సంబంధించినవి.

సంహిత అంటే సంధి. **దేవ+ఇంద్ర = దేవేంద్ర** అనే గుణసంధిని తీసుకుందాం. + ముందు ఉన్న అక్షరం **వ** ఇది పూర్వరూపం. + తర్వాతి అక్షరం **ఇ** ఉత్తర రూపం. + అనేది సంధి. వీటి కలయిక వల్ల వచ్చిన కొత్త అక్షరం **వే** సంధానం.

పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సంధానం అనే నాలుగు ఆలంబనల మీద ఐదు రకాల ఉపాస్య వస్తువులను ఊహించుకుని ఉపాసన చేయాలి. మొత్తం 20 ఉపాస్య వస్తువులను నాలుగు ఉపాసనా స్థానాల్లో ఆరోపించి ఒక ఉపాసన తర్వాత ఇంకొకటి వేదం చెప్పిన క్రమంలో ఉపాసన చేయాలి.

ఆలంబనలు మారవు.

**అథాధిలోకమ్।పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తరరూపమ్। ఆకాశస్సన్ధిః। వాయుస్సన్ధానమ్। ఇత్యధిలోకమ్।**

అధిలోక ఉపాసన – పృథివిని పూర్వరూపంగా, స్వర్గాన్ని ఉత్తరరూపంగా, ఆకాశాన్ని సంధిగా, వాయువును సంధానంగా ఊహించుకుని ఉపాసన చేయాలి. ఈ విధంగా ఉపాసన చేస్తే అధిలోక ఉపాసన అవుతుంది.

**అథాధిజ్యౌతిషమ్। అగ్నిః పూర్వరూపమ్। ఆదిత్య ఉత్తరరూపమ్। ఆపస్సన్ధిః। వైద్యుతస్సన్ధానమ్। ఇత్యధిజ్యౌతిషమ్।**

అధిజ్యౌతిషఉపాసన – అగ్నిని పూర్వరూపంగా, సూర్యుని ఉత్తరరూపంగా, నీటిని సంధిగా, విద్యుల్లతను సంధానంగా ఊహించుకుని ఉపాసన చేయాలి. ఈ విధంగా ఉపాసన చేస్తే అధిజ్యౌతిష ఉపాసన అవుతుంది.

**అథాధివిద్యమ్। ఆచార్యః పూర్వరూపమ్।అంతేవాస్యుత్తర రూపమ్। విద్యా సన్ధిః। ప్రవచనగ్ం సన్ధానమ్। ఇత్యధివిద్యమ్।**

అధివిద్య ఉపాసన – ఆచార్యుని పూర్వరూపంగా, విద్యార్థిని ఉత్తరరూపంగా, విద్యను సంధిగా, ప్రవచనాన్ని సంధానంగా ఊహించుకుని ఉపాసన చేయాలి. ఈ విధంగా ఉపాసన చేస్తే అధివిద్య ఉపాసన అవుతుంది.

**అథాధిప్రజమ్। మాతా పూర్వరూపమ్। పితోత్తరరూపమ్। ప్రజా సన్ధిః। ప్రజననగ్ం సంధానమ్। ఇత్యధిప్రజమ్।**

అధిప్రజ ఉపాసన – తల్లిని పూర్వరూపంగా, తండ్రిని ఉత్తరరూపంగా, తనయుడిని సంధిగా, తల్లిదండ్రుల కలయిక సంధానంగా ఊహించుకుని ఉపాసన చేయాలి. ఈ విధంగా ఉపాసన చేస్తే అధిప్రజ ఉపాసన అవుతుంది.

**అథాధ్యాత్మమ్। అధరాహనుః పూర్వరూపమ్। ఉత్తరాహనురుత్తరరూపమ్। వాక్సన్ధిః। జిహ్వా సన్ధానమ్। ఇత్యధ్యాత్మమ్।**

అధ్యాత్మ ఉపాసన – క్రింది దవడని పూర్వరూపంగా, పై దవడని ఉత్తరరూపంగా, వాక్కుని సంధిగా, నాలుకని సంధానంగా ఊహించుకుని ఉపాసన చేయాలి.

ఈ విధంగా ఉపాసన చేస్తే అధ్యాత్మ ఉపాసన అవుతుంది.

**ఇతీమా మహాసగ్ంహితాః।**

ఇవి గొప్ప సంహితలుగా, చక్కటి ఉపాసనలుగా కొనియాడ బడ్డాయి.

**య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద। సంధీయతే ప్రజయా పశుభిః। బ్రహ్మవర్చసేనాన్నాద్యేన సువర్గ్యేణ లోకేన॥**

ఈ మహా సంహితలను వేదం చెప్పిన పద్ధతిలో, చెప్పిన క్రమంలో, శ్రద్ధతో, కోరికతో ఉపాసన చేసిన ఉపాసకునికి, మంచి సంతతి కలుగుతుంది. పశుసంపద, అన్నవృద్ధి ఏర్పడుతుంది. అతను బ్రహ్మవర్చస్సుతో లోక ప్రసిద్ధుడౌతాడు. నిష్కామంగా ఉపాసన చేసిన వానికి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత కలుగుతుంది. ఇది సంహితోపాసన.

| **ఉపాసన** | **పూర్వరూపం** | **ఉత్తర రూపం** | **సంధి** | **సంధానం** |
|---|---|---|---|---|
| అధిలోక | భూమి | స్వర్గం | అంతరిక్షం | వాయువు |
| అధిజ్యౌతిష | అగ్ని | సూర్యుడు | నీరు | విద్యుల్లత |
| అధివిద్య | ఆచార్యుడు | విద్యార్థి | విద్య | ప్రవచనం |
| అధిప్రజ | తల్లి | తండ్రి | సంతతి | కలయిక |
| అధ్యాత్మ | క్రింది దవడ | పై దవడ | వాక్కు | నాలుక |

## అనువాకం 4

**యశ్ఛందసామృషభో విశ్వరూపః। ఛందోభ్యోఽధ్యమృతాసంబభూవ। స మేంద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవధారణో భూయాసమ్। శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః। శ్రుతం మే గోపాయ।**

**ఆవహన్తీ వితన్వానా। కుర్వాణాచీరమాత్మనః। వాసాగ్ంసి మమ గావశ్చ। అన్నపానే చ సర్వదా। తతో మే శ్రియమావహ। లోమశాం పశుభిః సహ స్వాహా।**

**ఆమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। విమాఽఽయన్తు బ్రహ్మచారిణః స్వాహా। ప్రమాఽఽయన్తు బ్రహ్మచారిణః స్వాహా। దమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

**శమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

**యశోజనేఽసాని స్వాహా। శ్రేయాన్ వస్యసోఽసాని స్వాహా।**

**తం త్వా భగ ప్రవిశాని స్వాహా। స మా భగ ప్రవిశ స్వాహా।తస్మిన్ సహస్రశాఖే।**

**నిభగాఽహం త్వయి మృజే స్వాహా। యథాఽఽపః ప్రవతాఽఽయంతి। యథా**

**మాసా అహర్జరమ్। ఏవం మాం బ్రహ్మచారిణః। ధాతరాయంతు సర్వతః స్వాహా।**

**ప్రతివేశోఽఽసి ప్రమా భాహి ప్ర మా పద్యస్వ।**

ఈ అనువాకంలో జపసాధన, హోమసాధన చెప్పబడ్డాయి. ఓంకార రూప పరమాత్మ జపసాధనగా చెప్పబడింది.

చతుర్ముఖబ్రహ్మ వేదాలను మధించగా గాయత్రి లోని మూడు వాక్యాలు జనించాయి. వాటిని కూడా మధించగా మూడు వ్యాహృతులు పుట్టాయి. అవి భూః,భువః,సువః. మళ్ళీ వాటిని మధించగా అ, ఉ, మ అనే మూడు మాత్రలు వచ్చాయి. వాటి సంహితే అ+ఉ+మ్ లతో కూడిన ఓంకారం. ఓంకారమే వేదసారం.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః। ఛందోభ్యోఽధ్యమృతాసంబభూవ।**

ఓంకారం ఛందస్సులలో వృషభము లాంటిది అంటే చాలా శ్రేష్ఠమైనది. వేదముల సారమైన అమృతం వంటిది.

**స మేంద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవధారణో భూయాసమ్।**

ఓంకారరూప ఇంద్రుడు మాకు మేధాశక్తినొసగు గాక! ఇంద్రుడు అంటే దేవేంద్రుడు కాదు. పరమాత్మ, ఓంకారరూప పరమాత్మ. ఆ పరమాత్మ మాకు గ్రహణ ధారణశక్తులనొసగు గాక.

**శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్।**

శరీరం శాస్త్రాధ్యయనానికి సమర్థమగు గాక! నాలుక తీయగా పలుకుగాక! చెవులు మంగళకరమైన మాటలే ఎక్కువగా వినుగాక! నాలుక తీయగా పలుకు గాక! అంటే ఏమిటి?

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్।**

**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే॥** గీత – 17-15

భగవద్గీతలో కృష్ణ భగవానుడు తీయగా మాట్లాడటానికి నాలుగు లక్షణాలు పేర్కొన్నాడు. అవి అనుద్వేగకరం, సత్యం, ప్రియం, హితం. అనుద్వేగకరం అంటే మన మాటలు ఎదుటి వ్యక్తిని ఉద్వేగానికి, బాధకి లోనుచేయకూడదు. సత్యం పలకాలి. అబద్ధం చెప్పకూడదు. ప్రియంగా, ఇంపుగా మాట్లాడాలి. మన మాటలు ఎదుటి వ్యక్తికి ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగించాలి. హితంగా మాట్లాడాలి. ఎదుటి వ్యక్తి బాగుకోరే విధంగా మాట్లాడాలి. ఇవి తీయగా మాట్లాడం అంటే. చెవులు మంగళకరమైన మాటలే ఎక్కువగా వినుగాక! అంటే శాస్త్రాన్ని శ్రవణం చేయడం, శాస్త్రాన్ని పదిమందికి చెప్పడం.

**బ్రహ్మణః కోశోసి మేధయా పిహితః॥ శృతం మే గోపాయ॥**

పరబ్రహ్మమునకు ఆవరణయై ఉన్న లౌకిక మందబుద్ధి గల వారికి అగమ్యమైన ఓంకారమా నేను చేయు వేదాంత శ్రవణమును మరపులేనిదిగా చేయుము. నాకు ఆత్మ సాక్షాత్కారము కలుగ చేయుము. ఓంకారం ఆ పరమేశ్వరునికి ఆవరణగా ఉంది అంటే ఓంకార విశ్లేషణద్వారా బ్రహ్మమును తెలుసుకోవచ్చు అని అర్థం. ఈ విశ్లేషణ మాండూక్య కారికల్లో వస్తుంది. ఈ మంత్రం జపం చేయటం వల్ల మేథాశక్తి పెరుగుతుంది. ఈ మంత్రాన్ని నిష్కామంగా జపం చేసిన వానికి చిత్తశుద్ధి కలుగుతుంది.

ఇక హోమసాధన మొదలౌతోంది. **ప్రయోజనమనుద్దిశ్య మందోపి న ప్రవర్తతే॥** ప్రయోజనం లేని పని మూర్ఖుడు కూడా చేపట్టడు అంటారు. హోమసాధనలో నాలుగు ప్రయోజనాలున్నాయి. అవి మొదటిది ధనప్రాప్తి, రెండు చిత్తశుద్ధి, మూడు జ్ఞానప్రాప్తి, నాలుగు శిష్యప్రాప్తి. మన శాస్త్రాలు ధనాన్ని తృణీకార దృష్టితో చూడలేదు. గృహస్తులను సమృద్ధిగా ధనం సంపాదించమని చెపుతుంది. సంపాదించి ఏం చెయ్యాలో కూడా చెపుతుంది. ధనాన్ని ధర్మకార్యాలకు ఖర్చు చేయమంటుంది. ధనం ధర్మార్థం – ధర్మం మోక్షార్థం. దీన్ని ఆవహన్తీ హోమం అంటారు. ధనం కోసం, విద్యార్థుల కోసం దీనిని చేస్తారు.

స్వామి దయానంద ఆశ్రమంలో నిత్యం ఆవహన్తీ హోమ మంత్రం పఠిస్తూ ఉంటారు. అందుకే వేల సంఖ్యలో విద్యార్థులు దేశదేశాలనుంచి

దయానంద ఆశ్రమం వచ్చి వేదవిద్య నేర్చుకుంటూ ఉంటారు.

**ఆవహన్తీ వితన్వానా। కుర్వాణాచీరమాత్మనః। వాసాగ్ంసి మమ గావశ్చ। అన్నపానే చ సర్వదా। తతో మే శ్రియమావహ। లోమశాం పశుభిః సహ స్వాహా।**

స్వాహాకారాలతో హోమం మొదలౌతోంది.

**స్వాహా** అంటే సు **ఆహా! తథాస్తు** అన్నట్టుగా.

**ఆవహన్తీ వితన్వానా। కుర్వాణాచీరమాత్మనః।**

లక్ష్మీదేవికి ఆహ్వానం! మా దగ్గరే చిరకాలం ఉండు! అమ్మా శీఘ్రంగా వచ్చి సంపదలనొసగు తల్లీ!

**వాసాగ్ంసి మమ గావశ్చ। అన్నపానే చ సర్వదా। తతో మే శ్రియమావహ। లోమశాం పశుభిః సహ స్వాహా।**

మాకు వస్త్రాలు, పశుసంపద, రోమాలుకల పశువులు అంటే ఉన్ని నిచ్చే గొర్రెలు, అన్నపానాలు అన్నీ సమకూర్చు. వేదాభ్యాసం చేసిన శిష్యుడు తను అభ్యసించిన విద్యను నలుగురుకు చెప్పాలనే ఉత్సుకతతో విద్యార్థులు కావాలని హోమం చేస్తున్నాడు.

**ఆమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। విమాఽఽయన్తు బ్రహ్మచారిణః స్వాహా। ప్రమాఽఽయన్తు బ్రహ్మచారిణః స్వాహా। దమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। శమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

**ఆమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

వేదవిద్యకు అధికారత్వం కలిగిన శిష్యులు నా వద్దకు రాగాక!

**విమాఽఽయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

రకరకాల అభిలాషలు కలిగిన శిష్యులు నా వద్దకు రాగాక! గురుకులంలో వేదవిద్య మాత్రమే కాకుండా రాజులకు పనికి వచ్చే అనేక విద్యలు నేర్పుతూ ఉండే వారు. విలువిద్య, కత్తిసాము, రాచరికపుమర్యాదలు, రాజనీతి, ఆర్థికశాస్త్రం వంటివి గురుకులంలో నేర్చుకునే వారు. అందుకని అన్ని విద్యలకు గురుకులమే నెలవు. అందుకే రకరకాల అభిలాషలు కలిగిన శిష్యులు నా వద్దకు రాగాక! అని కోరడం జరిగింది.

**ప్రమా౽ ౽ యన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

ప్రజ్ఞావంతులైన శిష్యులు రాగాక! ప్రజ్ఞావంతులైన వారికి బోధ చేయడం గురువుకు ఒక పరీక్ష, సవాలు. ప్రజ్ఞావంతులైన శిష్యులు నా వద్దకు రాగాక!

**దమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

దమాగుణం కలిగిన శిష్యులు రాగాక! రాజులు తమ రాచరికపు సౌకర్యాలు వదులుకుని సామాన్య జీవనం అంటే గురువుతోపాటు సహజీవనం చేస్తూ విద్య నేర్చుకోవాలి. దీనికి ఇంద్రియ నిగ్రహం (దమాగుణం)ఎంతో అవసరం. అందుకే దమాగుణం కలిగిన శిష్యులు రాగాక!

**శమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**

అలాగే రాజులతో పాటు మామూలు పౌరులు కూడా విద్య నేర్చుకుంటూ ఉంటారు.రాజులు, ఇతర శిష్యులు తమ మానసిక సమతుల్యత (శమా గుణం) పోగొట్టుకోకూడదు. శమాగుణం కలిగిన శిష్యులు రాగాక!

**యశోజనే౽సాని స్వాహా। శ్రేయాన్ వస్యసో౽సాని స్వాహా।**

నేను ఈ ప్రాంతంలో మంచి గురువుగా పేరు ప్రఖ్యాతుతో తులతూగాలి! ఇక్కడ ఉన్న ధనికులలో అగ్రగణ్యుడనవ్వాలి. గురువు గురుకులం నడపాలంటే ఎంతో ధనవ్యయమౌతుంది. తన పేరు ప్రఖ్యాతులతో ఆర్జించిన ధనంతో గురుకులం నడపాలి. గురుకులం సజావుగా నడవాలంటే ధనలోపం ఉండకూడదు.

**తం త్వా భగ ప్రవిశాని స్వాహా। స మా భగ ప్రవిశ స్వాహా।తస్మిన్ సహస్రశాఖే। నిభగా౽హం త్వయి మృజే స్వాహా। యథా౽ ౽పః ప్రవతా౽ ౽యంతి। యథా మాసా అహర్జరమ్। ఏవం మాం బ్రహ్మచారిణః। ధాతరాయంతు సర్వతః స్వాహా। ప్రతివేశో౽ ౽సి ప్రమా భాహి ప్ర మా పద్యస్వ।**

**తం త్వా భగ ప్రవిశాని స్వాహా। సమాభగప్రవిశస్వాహా।తస్మిన్ సహస్రశాఖే। నిభగా౽హం త్వయి మృజే స్వాహా।**

బ్రహ్మవిద్యను అభ్యసించిన నేను అనేక రూపాలతో భాసిల్లుతున్న నీలో ఏకమౌదును గాక. నువ్వు నాలో ఏకమౌదువు గాక! నేను నా స్వరూపమైన బ్రహ్మ నిష్ఠలో ఉందును గాక!

**యథాఽ ఽ పః ప్రవతాఽ ఽ యంతి। యథా మాసా అహర్జరమ్।**

ఎలా నీరు క్రిందకి ప్రవహిస్తుందో, ఎలా మాసాలు వేగంగా సంవత్సరంలో విలీనమౌతాయో, అలా నేను సదా నీ ధ్యాసలోనే నీ ధారణలోనే ఉంటాను. నీవు అలసి సొలసిన వారికి సేదతీర్చే విశ్రాంతి గృహం వంటి వాడవు.

**ఏవం మాం బ్రహ్మచారిణః। ధారాయంతు సర్వతః స్వాహా॥**

అన్ని ప్రాంతాలనుంచి, దేశవిదేశాలనుంచి నాకు శిష్యులు రాగాక!

**ప్రతివేశోఽ ఽ సి ప్రమా భాహి ప్ర మా పద్యస్వ॥**

నన్ను నీలో ఏకం చేసుకో. నాలోని ద్వైతభావన దూరం చేయి!

**అనువాకం 5**

**భూర్భువస్సువరితి వా ఏతా స్తిస్రో వ్యాహృతయః। తాసాముహస్మై తాం చతుర్థీమ్। మాహాచమస్యః ప్రవేదయతే। మహ ఇతి। తద్బ్రహ్మ। స ఆత్మా। అంగాన్యన్యా దేవతాః।**

**భూరితి వా అయం లోకః। భువ ఇత్యంతరిక్షమ్। సువ రిత్యసౌ లోకః। మహ ఇత్యాదిత్యః। ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయన్తే।**

**భూరితి వా అగ్నిః। భువ ఇతి వాయుః। సువరిత్యాదిత్యః। మహ ఇతి చంద్రమాః। చంద్రమసా వావ సర్వాణి జ్యోతీగ్ంషి మహీయన్తే।**

**భూరితి వా ఋచః। భువ ఇతి సామాని। సువరితి యజూగ్ంషి। మహ ఇతి బ్రహ్మ। బ్రహ్మణా వావ సర్వేవేదా మహీయన్తే।**

**భూరితి వై ప్రాణః। భువ ఇత్యపానః। సువరితి వ్యానః। మహ ఇత్యన్నమ్। అన్నేన వావ సర్వే ప్రాణా మహీయన్తే।**

**తా వా ఏతాశ్చతస్రశ్చతుర్ధా। చతస్రశ్చతస్రో వ్యాహృతయః। తా యో వేద। స వేద బ్రహ్మ। సర్వేఽ స్మై దేవా బలిమావహన్తి॥**

**భూర్భువస్సువరితి వా ఏతా స్తిస్రో వ్యాహృతయః।**

ఇంతకు ముందు చెప్పుకున్నట్టు చతుర్ముఖ బ్రహ్మ వేదాలను కుంచించగా గాయత్రి మంత్రం వచ్చింది. గాయత్రి మంత్రం కుంచించగా దాని నుంచి మూడు **భూః, భువః, సువః** అనే మూడు వ్యాహృతులు బ్రహ్మ నోటి నుండి వచ్చాయి. బ్రహ్మ నోటి నుంచి వెలువడ్డాయి కనుక వ్యాహృతులు అన్నారు. అంతే కాదు **వ్యాహరతి పాపాని ఇతి వ్యాహృతి.** ఇవి వేదసారం కనుక చాలా పవిత్రమైనవి. వీటిని ఉచ్ఛరిరించడం వల్ల పాపాలు నశిస్తాయి. **భూః, భువః, సువః** అనేవి మొదటి వ్యాహృతులు.

**తాసాముహస్మై తాం చతుర్థీమ్। మాహాచమస్యః ప్రవేదయతే। మహ ఇతి।**

నాలుగవ వ్యాహృతి మహాచమస్ కుమారుడు మాహాచమస్య అనే ఋషి ప్రవేశపెట్టాడు. ఆ నాలుగవ వ్యాహృతే **మహః.** మహాచమస్ అంటే పెద్దగరిట అని అర్థం. ఈయన తను చేసే బృహత్ యజ్ఞాలకు మహాచమస్ వాడుతుండడంచేత వీరికి ఆ పేరు స్థిరపడింది. ఈ మహ వ్యాహృతి మీద హిరణ్యగర్భుని ఉపాసన చేయాలి.

**తద్బ్రహ్మ। స ఆత్మా। అంగాన్యన్యా దేవతాః।**

అతనే ఆత్మ. మిగత దేవతలందరు అతని అంగాలు. మహః వ్యాహృతి అంగీ మిగతా వ్యాహృతులు అంగాలు. అంగీ ముఖ్యమైనది. అంగీ భాగాలే అంగాలు.

ఇప్పుడు మనకు నాలుగు వ్యాహృతులున్నాయి. అవి భూః, భువః, సువః, మహః. వీటిలో మహః అనే వ్యాహృతి గొప్పది. ఈ వ్యాహృతి మీద ముఖ్యమైన దేవతను ఉపాసన చేసి మిగత దేవతలను భూః, భువః,సువః అనే వ్యాహృతుల మీద ఉపాసన చేస్తాము. ఇవికాక మరో మూడు జనః, తపః, సత్యః వ్యాహృతులను అంటే ఏడు వ్యాహృతులను సంధ్యావందనంలో, ప్రాణాయామ మంత్రంలో స్మరిస్తారు.

**భూరితి వా అయం లోకః। భువ ఇత్యంతరిక్షమ్। సువ రిత్యసౌ లోకః। మహ ఇత్యాదిత్యః ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయన్తే।**

భూలోకాన్ని భూః అనే వ్యాహృతి మీద, అంతరిక్షాన్ని భువః అనే వ్యాహృతి మీద, స్వర్గలోకాన్ని సువః అనే వ్యాహృతి మీద సూర్యభగవానుడిని

మహః అనే వ్యాహృతి మీద ఊహించుకుని ఉపాసన చేయాలి. నిజంగా సూర్యభగవానుడే ఈ లోకాలకు వెలుగునిస్తున్నాడు. ఆయనే గొప్పవాడు.

**భూరితి వా అగ్నిః। భువ ఇతి వాయుః। సువరిత్యాదిత్యః। మహ ఇతి చంద్రమాః। చంద్రమసా వావ సర్వాణి జోతీగ్ంషి మహీయన్తే।**

అగ్నిని భూః అనే వ్యాహృతి మీద, వాయువుని భువః అనే వ్యాహృతి మీద, ఆదిత్యుడిని సువః అనే వ్యాహృతి మీద, చంద్రుడిని మహః అనే వ్యాహృతి మీద ఊహించుకుని ఉపాసన చేయాలి. నిజంగా చంద్రుడే ఈ లోకాలకు చల్లదనం, వెలుగు నిస్తున్నాడు. ఆయనే గొప్పవాడు.

చంద్రుడు కేవలం ఒక ఉపగ్రహం మాత్రమే. ఆయన సూర్యుడు కన్నా గొప్పవాడెలా అవుతాడు. ఇక్కడ మనం దేవతా పరంగా ఉపాసన చేస్తున్నాం. చంద్రుడు మనస్సుకు అధిష్టాన దేవత. మనస్సు బట్టే మనిషి తెలిసేది, మంచివాడో కాదో తెలిసేది. ఆ విధంగా ఈ ఉపాసనలో చంద్రుడుకి పెద్ద పీట వేసారు.

**భూరితి వా ఋచః। భువ ఇతి సామాని। సువరితి యజూగ్ంషి। మహ ఇతి బ్రహ్మ। బ్రహ్మణా వావ సర్వేవేదా మహీయన్తే।**

ఋగ్వేదాన్ని భూః అనే వ్యాహృతి మీద, సామవేదాన్ని భువః అనే వ్యాహృతి మీద, యజుర్వేదాన్ని సువః అనే వ్యాహృతి మీద ఓంకారాన్ని మహః అనే వ్యాహృతి మీద ఊహించుకుని ఉపాసన చేయాలి. నిజంగా ఓంకారమే ఈ వేదాల సారం. అదే ఏకాక్షరమైన బ్రహ్మ. ఓంకారమే గొప్పది.

**భూరితి వై ప్రాణః। భువ ఇత్యపానః। సువ - రితి వ్యానః। మహ ఇత్యన్నమ్। అన్నేన వావ సర్వే ప్రాణా మహీయన్తే।**

ప్రాణాన్ని భూః అనే వ్యాహృతి మీద, అపానాన్ని భువః అనే వ్యాహృతి మీద, వ్యానాన్ని సువః అనే వ్యాహృతి మీద అన్నాన్ని మహః అనే వ్యాహృతి మీద ఊహించుకుని ఉపాసన చేయాలి. నిజంగా అన్నమే ప్రాణానికి ముఖ్యం. అన్నమే ముఖ్యమైనది.

**తా వా ఏతాశ్చతస్రశ్చతుర్ధా। చతస్రశ్చతస్రో వ్యాహృతయః। తా యో వేద। స వేద బ్రహ్మ। సర్వేఽస్మై దేవా బలిమావహన్తి॥**

ఈ విధంగా నాలుగు వ్యాహృతులతో నాలుగు ఉపాసనా దేవతలతో మొత్తంగా పదహారు దేవతలతో పైన చెప్పిన రీతిలో అదే క్రమంలో ఉపాసన చేసినట్టయితే దేవతలు అతనికి కోరినవి ఇస్తారు. ఇది వ్యాహృతి ఉపాసన. దీనినే పట్టికలో చూద్దాం.

| **వ్యాహృతులు** | **భూః** | **భువః** | **సువః** | **మహః** |
|---|---|---|---|---|
| లోక ఉపాసన | భూమి | అంతరిక్షం | స్వర్గం | ఆదిత్యలోకం |
| దేవ ఉపాసన | అగ్ని | వాయువు | ఆదిత్యుడు | చంద్రుడు |
| వేద ఉపాసన | ఋగ్వేదం | సామవేదం | యజుర్వేదం | ఓంకారం |
| ప్రాణ ఉపాసన | ప్రాణం | అపానం | వ్యానం | అన్నం |

తరువాత అనువాకంలో హిరణ్యగర్భ ఉపాసన చెప్పబడింది. హిరణ్యగర్భ ఉపాసనను వ్యాహృతి ఉపాసనతో కలిపి చేయ్యాలి. అలా చేసిన సాధకునకు బ్రహ్మలోక ప్రాప్తి లభిస్తుంది.

**అనువాకం 6**

**స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః। అమృతో హిరణ్మయః।**

**అన్తరేణ తాలుకే। య ఏషస్తన ఇవావలమ్బతే। సేంద్రయోనిః। యత్రాసౌ కేశాన్తో వివర్తతే। వ్యపోహ్య శీర్షకపాలే।**

**భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి। భువ ఇతి వాయౌ। సువరిత్యాదిత్యే। మహ ఇతి బ్రహ్మణి। ఆప్నోతి స్వారాజ్యమ్। ఆప్నోతి మనసస్పతిమ్। వాక్పతిశ్చక్షుష్పతిః। శ్రోత్రపతి విజ్ఞానపతిః। ఏతతతో భవతి। ఆకాశ శరీరం బ్రహ్మ। సత్యాత్మ ప్రాణారామమ్ మన ఆనందమ్। శాంతి సమృద్ధమమృతమ్। ఇతి ప్రాచీన యోగ్యోపాస్స్వ।**

**స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః। అమృతో హిరణ్మయః। అన్తరేణ తాలుకే। య ఏషస్తన ఇవావలమ్బతే। సేంద్రయోనిః। యత్రాసౌ కేశాన్తో వివర్తతే। వ్యపోహ్య శీర్షకపాలే।**

శాశ్వతమైన, కాంతివంతమైన హిరణ్యగర్భుడు మనసును ఆలోచింప

చేసేవాడు. హిరణ్యగర్భుడు ఆ మనసు స్థానమైన హృదయ ఆకాశంలో ఉన్నాడు. ఆయనను ఉపాసన చేయాలి. ఈ ఉపాసన వ్యాహృతి ఉపాసనతో జోడించి చేయాలి. హృదయంలో నూట ఒక్క నాడులుంటాయి. అందులో సుషుమ్నా నాడి ముఖ్యమైనది.

మరణానంతరం జీవి నూట ఒక్కనాడుల్లో ఏదో ఒకనాడి ద్వారా బయటకు వెళతాడు. వ్యాహృతి + హిరణ్యగర్భ ఉపాసన చేసిన వారు హిరణ్యగర్భలోకం వెళ్ళి హిరణ్యగర్భలో ఐక్యం అవుతారు. దహరాకాశం నుంచి దవడల మధ్య ఆవుపొదిలా, స్థనంలా వ్రేలాడుతున్న కొండ నాలుక ద్వారా సుషుమ్నా నాడి పోతుంది. ఈ సుషుమ్నా నాడి బ్రహ్మరంధ్రం వరకు ఉంటుంది. కేశాలు మొదలయ్యే ప్రాంతంలో బ్రహ్మరంధ్రం చీల్చుకుని శుక్ల మార్గంలో జీవి ప్రవేశిస్తాడు. ఈ మార్గం ఇంద్రయోని. ఇక్కడ ఇంద్రుడు అంటే హిరణ్యగర్భుడు. శుక్లమార్గం ద్వారా హిరణ్యగర్భలోకానికి పోయే మార్గాన్ని ఉపనిషత్తు ఇంద్రయోని అంటోంది.

**భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి। భువ ఇతి వాయౌ। సువరిత్యాదిత్యే। మహ ఇతి బ్రహ్మణి।**

వ్యాహృతి ఉపాసనతో పాటు హిరణ్యగర్భ ఉపాసన చేసిన సాధకుడు మరణాంతరము అగ్నిదేవతతో ఏకమౌవుతాడు. అదే భూః వ్యాహృతి రూపంలో ఉంది. వాయుదేవతతో కలిసిపోతాడు అదే భువః వ్యాహృతి రూపంలో ఉంది. మహ వ్యాహృతి రూపం లో ఉన్న ఆదిత్యలోకం ద్వారా బ్రహ్మలోకం చేరుకుని హిరణ్యగర్భునిలో కలిసిపోతాడు.

**ఆప్నోతి స్వారాజ్యమ్। ఆప్నోతి మనసస్పతిమ్। వాక్పతిశ్చక్షుష్పతిః। శ్రోత్రపతివిజ్ఞానపతిః। ఏతతత్తో భవతి। ఆకాశ శరీరం బ్రహ్మ। సత్యాత్మ ప్రాణారామమ్ మన ఆనందమ్। శాంతి సమృద్ధమమృతమ్। ఇతి ప్రాచీన యోగ్యోపాస్స్వ।**

అతను సర్వలోకాలపై ఆధిపత్యం సాధిస్తాడు. సమష్టి మనసైన అతను అన్ని మనసుల మీద ఆధిపత్యం వహిస్తాడు. సమష్టి వాక్కైన అతను అన్ని వాక్కుల (వ్యష్టి కర్మేంద్రియాల) మీద ఆధిపత్యం వహిస్తాడు. సమష్టి కళ్ళు, చెవులైన అతను అన్ని కళ్ళు, చెవుల (వ్యష్టి జ్ఞానేంద్రియాల) మీద ఆధిపత్యం వహిస్తాడు. అంతటా తానే అవుతాడు. రూపాలతో రూపం లేకుండా అంతటా తానే

ఉన్నాడు. అతనే ప్రాణం, ఆనందము. ఈ విధముగా ఉపాసన చేయి. వ్యష్టి అంటే వ్యక్తి పరంగా అని, సమష్టి అంటే వ్యష్టి సమూహం లేదా జగత్ పరంగా అని అర్థం.

**అనువాకం 7**

**పృథివ్యంతరిక్షం ద్యౌర్దిశోవాన్తరదిశాః। అగ్నిర్వాయురాదిత్య శ్చన్ద్రమా నక్షత్రాణి। ఆప ఓషధయో వనస్పతయ ఆకాశ ఆత్మా। ఇత్యధిభూతమ్। అథాధ్యాత్మమ్। ప్రాణో వ్యానోఽపాన ఉదానస్సమానః। చక్షుశ్శ్రోత్రం మనో వాక్ త్వక్। చర్మమాగ్ంసగ్ం స్నావాస్థి మజ్జా। ఏతదధివిధాయ ఋషిరవోచత్। పాఙ్క్తం వా ఇదగ్ం సర్వమ్। పాఙ్క్తేనైవ పాఙ్క్తగ్గ్ స్పృణోతీతి॥**

ఈ అనువాకంలో పాంక్తబ్రహ్మ ఉపాసన చెప్పబడుతోంది. పాంక్తం అంటే ఐదు.

**పృథివ్యంతరిక్షం ద్యౌర్దిశోవాన్తరదిశాః।**

భూమి, అంతక్షం, స్వర్గలోకం, దిశలు, అంతర్దిశలు. ఈ ఐదు సమష్టి లోక పాంక్తం.

**అగ్నిర్వాయురాదిత్య శ్చన్ద్రమా నక్షత్రాణి।**

అగ్ని, వాయువు, సూర్యుడు,చంద్రుడు, నక్షత్రాలు ఇవి సమష్టి దేవతా పాంక్తం.

**ఆప ఓషధయో వనస్పతయ ఆకాశ ఆత్మా। ఇత్యధిభూతమ్।**

నీరు, ఓషదులు,చెట్లు, ఆకాశం, విరాట్ ఇవి ఈ ఐదు సమష్టి భూత పాంక్తం.

**అథాధ్యాత్మమ్।ప్రాణో వ్యానోఽపాన ఉదానస్సమానః।**

ఇక ఐదు వ్యష్టి వాయు పాంక్తం. మన శరీరపరంగా ప్రాణం, వ్యానం, ఆపానం, ఉదానం, సమానం ఈ ఐదు వాయు పాంక్త వాయువుల్లో ఐదు లోక పాంక్తం లోని ఒకొక్క లోకాన్ని ఊహించుకుని ఉపాసన చేయాలి.

**చక్షుశ్శ్రోత్రం మనో వాక్ త్వక్।**

ఐదు వ్యష్టి ఇంద్రియ పాంక్తం – చక్షుః, శ్రోత్రమ్, మనః, వాక్, త్వక్

– కళ్ళు, చెవులు, మనసు, వాక్కు, స్పర్శేంద్రియం. ఈ ఇంద్రియాలలో సమష్టి దేవతా పాంక్తంలోని ఒకొక్క దేవతను ఊహించుకుని ఉపాసన చేయాలి.

**చర్మమాగ్ంసగ్గ్ం స్నావాస్థి మజ్జా।**

అలాగే ఐదు వ్యష్టి ధాతు పాంక్తం చర్మం, మాంసమ్, మజ్జా, అస్థి, స్నావా – చర్మం, మాంసం, కండ, ఎముక, ఎముకలో ఉండే ద్రవం. వీటిలో సమష్టి భూత పాంక్తమైన నీరు, ఓషదులు, చెట్లు, ఆకాశం, విరాట్‌లను ఊహించుకుని ఉపాసన చేయాలి.

**ఏతదదివిధాయ ఋషిరవోచత్। పాఙ్క్తం వా ఇదగ్ం సర్వమ్।పాఙ్క్తేనైవ పాఙ్క్తగ్గ్ం స్పృణోతీతి॥**

ఈ విధంగా వ్యష్టి పాంక్తంలో సమష్టి పాంక్తంను ఉపాసన చేయాలి. దీనిని పాంక్త బ్రహ్మ ఉపాసన అంటారు. అలా నిష్కామంగా చేసిన వారికి అంతఃకరణశుద్ధి, చిత్తశుద్ధి, చిత్తవైశాల్యం లభిస్తుంది.

**పాంక్త బ్రహ్మ – ఊపాసన**

**సమష్టి పాంక్తాలు**

| **లోక పాంక్తం** | **దేవ పాంక్తం** | **భూత పాంక్తం** |
|---|---|---|
| భూమి | అగ్ని | నీరు |
| అంతరీక్షం | వాయువు | ఓషదులు |
| స్వర్గం | సూర్యుడు | చెట్లు |
| దిశలు | చంద్రుడు | ఆకాశం |
| అంతర్దిశలు | నక్షత్రాలు | విరాట్ |

**వ్యష్టి పాంక్తాలు**

| **వాయు పాంక్తం** | **ఇంద్రియ పాంక్తం** | **ధాతు పాంక్తం** |
|---|---|---|
| ప్రాణం | కళ్ళు | చర్మం |
| వ్యానం | చెవులు | మాంసం |
| అపానం | మనస్సు | కండలు |
| ఉదానం | వాక్కు | ఎముక |
| సమానం | త్వక్కు | స్నావా |

## అనువాకం 8

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్। ఓమిత్యేతదనుకృతిః హస్మ వా అప్యోశ్రావ యేత్యాశ్రావయన్తి। ఓమితి సామాని గాయన్తి। ఓగ్ం శో మితి శస్త్రాణి శగ్ంసన్తి। ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి। ఓమితి బ్రహ్మ ప్రసౌతి। ఓమిత్యగ్నిహోత్రమనుజానాతి। ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ బ్రహ్మోపాప్నవానీతి। బ్రహ్మైవోపాప్నోతి॥**

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్।**

ఓంకారమే బ్రహ్మ అని ఉపాసన చేయాలి. బ్రహ్మ అంటే సగుణ బ్రహ్మ – స్థూలంగా విరాట్ కావచ్చు, సూక్ష్మంగా హిరణ్యగర్భ కావచ్చు, కారణంగా ఈశ్వరుడు కావచ్చు.సగుణ బ్రహ్మను ఓంకారంలో ఉపాసన చేయాలి. అనేక అక్షరాలుండగా ఉపనిషత్తు ఓంకారమే ఎందుకు ఎన్నుకుంది? ఓమితి ఏకాక్షరం బ్రహ్మ అని కృష్ణ భగవానుడు భగవద్గీతలో చెప్పాడు. ఓంకారమే సర్వం. ఓంకారం చాలా ముఖ్యమైనది. జ్ఞానకాండలో ఓంకార విశ్లేషణ ఉంటుంది. సన్యాసులు ఓంకారమే ఉచ్ఛరిస్తూంటారు.

భక్తి, ఉపాసనలలో కూడా ఓంకారం చాలా ముఖ్యమైనది. ఓంకారం తోనే ఏ మంత్రమైనా మొదలౌతుంది.

ఒక యజ్ఞం చేయటానికి పద్దెనిమిది మంది కావాలి. ఋగ్వేదం ప్రధాన ఋత్విక్కు, అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురు. ప్రధాన ఋత్విక్కును హోత అంటారు. అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురిని హోతృగణం అంటారు. ఈ విధంగా ఋగ్వేదం తరుఫున నలుగురు కావాలి.

సామవేదం ప్రధాన ఋత్విక్కు , అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురు. ప్రధాన ఋత్విక్కును ఉద్గాత అంటారు. అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురిని ఉద్గాతృగణం అంటారు. ఈ విధంగా సామవేదం తరుఫున నలుగురు కావాలి. సామవేదంలో దేవతలను స్తుతిచేస్తూ గానం ఉంటుంది.

యజుర్వేదం ప్రధాన ఋత్విక్కు, అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురు. ప్రధాన ఋత్విక్కును అధ్వర్యు అంటారు. అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురిని అధ్వర్యుగణం అంటారు. ఈ విధంగా యజుర్వేదం

తరుపున నలుగురు కావాలి.

అథర్వణ వేదం ప్రధాన ఋత్విక్కు, అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురు. ప్రధాన ఋత్విక్కును బ్రహ్మ అంటారు. అతనికి సహాయపడే ఋత్విక్కులు ముగ్గురిని బ్రహ్మగణం అంటారు. ఈ విధంగా అథర్వణ వేదం తరుపున నలుగురు కావాలి.

అథర్వణవేదం వారు మొత్తం యజ్ఞం సక్రమంగా జరిగేలా నిర్వహణ చేయాలి. వీరికి అథర్వణ వేదమే కాక ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం కూడా తెలిసి ఉండాలి. ఎక్కడైనా పొరపాటు జరిగితే దానికి తగిన ప్రాయశ్చిత్త కర్మ వీరే చేయించాలి. యజ్ఞంలో వీరి పాత్ర చాలా గురుతరమైనది. వీరు కాక యజమాని, యజమాని భార్య. మొత్తం పద్దెనిమిది మందితో యజ్ఞం జరుగుతుంది.

**ఓమిత్యేతదనుకృతిః హస్మ వా అప్యోశ్రావయేత్యాశ్రావయన్తి।**

ఇక కర్మకాండలో కూడా ఓం చాలా కీలకమైనది. యజ్ఞం మొదలు పెట్టేటప్పుడు. అంతా సంసిద్ధంగా  ఉంది ఇక యజ్ఞం మొదలు పెట్టవచ్చు అని చెప్పటానికి బ్రహ్మగారు ఓం అని చెపుతారు.

**ఓమితి సామాని గాయన్తి।**

అంతేకాదు యజ్ఞంలో దేవతలను ఆహ్వానం చేయటానికి ప్రత్యేకమైన సామ మంత్రాలుంటాయి. ఆ మంత్రాలు చదవమని చెప్పటానికి హోత హోతృగణంతో ఓ శ్రావయ అంటారు. ఓ అంటే ఓం అని.

**ఓగ్ం శో మితి శస్త్రాణి శగ్ంసన్తి।**

యజ్ఞంలో కొన్ని సందర్భాల్లో ఋక్కులు స్వరం లేకుండా చదువుతారు. అలాంటి సందర్భాల్లో ఆ మంత్రాలను శస్త్రాలంటారు. ఇప్పుడు శస్త్రాలు చదవండి అని చెప్పటానికి ఉద్గాత ఉద్గాతృగణంతో ఓం అంటారు.

**ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి।**

బ్రహ్మ గారి ఆధ్వర్యంలో యజ్ఞం జరుగుతోంది. అధ్వర్యు తన మంత్రాలు చదవటానికి సమయమొచ్చినప్పుడు బ్రహ్మకేసి చూస్తూ అనుమతికోరుతూ ఓం అంటారు.

**ఓమితి బ్రహ్మా ప్రసౌతి।**

బ్రహ్మగారు అనుమతి ఇవ్వటానికి కూడా ఓం అనే అంటారు.

**ఓమిత్యగ్ని హోత్రమనుజానాతి।**

ఇంతేకాదు నిత్య శ్రౌత విధి, అగ్నిహోత్ర విధి కూడా ఓంకారంతోనే మొదలౌతుంది.

**ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ బ్రహ్మోపాప్నవానీతి। బ్రహ్మైవోపాప్నోతి॥**

వేదవిద్యని అభ్యసించే విద్యార్థి కూడా ఓం గణానాం త్వా గణపతిగ్ం హవా మహే అని ఓంకారం తోనే తన విద్యమొదలు పెట్టాలి. అలా చేస్తేనే వేదవిద్య అలవడుతుంది. ఈ విధంగా ఓంకారం అన్నిటిలోను ప్రధానమైనది.

**అనువాకం 9**

**ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ। తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ। దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ। అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యమితి సత్యవచా రాథీ తరః। తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః। స్వాధాయ ప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః తద్ధి తపస్తద్ధి తపః॥**

**ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ।**

ఈ అనువాకం బ్రహ్మచారి మరువకుండా ఏమేమి చేయ్యాలో ముఖ్యమైన విధులు చెబుతోంది. మొదటగా ఋతం అంటే సరియైన శాస్త్ర అవగాహన ఉండాలి. సత్యం అంటే శాస్త్ర అవగాహనను ఆచరణలో పెట్టాలి. కాబట్టి ఋతం, సత్యం రెండూ అవసరమే.

**స్వాధ్యాయప్రవచనే చ** అంటే స్వాధ్యాయం శాస్త్రపఠనం, ప్రవచనం అంటే శాస్త్రపాఠనం – నేర్చుకున్న విద్యను పదిమందికి తిరిగి అందించడం.

స్వామి పరమార్థానందగారు స్వాధ్యాయంగా రోజూ తైత్తిరీయం (కనీసం ఒక వల్లి), భగవద్గీత(కనీసం ఒక అధ్యాయం), విష్ణుసహస్రనామం, పురుషసూక్తం, శ్రీరుద్రం పారాయణం చేయమంటారు. ఇవి నిత్యం నిష్కాముకంగా చేయడం

వల్ల అంతఃకరణ శుద్ధి జరుగుతుంది. తద్వారా శాస్త్ర అధ్యయనానికి అధికారం సంపాదిస్తారు.

**తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ ।**

తపస్సు మరియు స్వాధ్యాయ, ప్రవచనాలు చేయాలి. తపస్సు – **కష్టసహిష్ణుత్వం తపః.** కష్టాన్ని సహించడమే తపస్సు. ఉదాహరణకు దైవచింతనతో మౌనవ్రతం చేయడం, ఏడు కొండలు కాలి నడకను వెళ్ళడం లేదా ఉపవాసం వంటి నియమాలు తపస్సు అనబడతాయి. స్వాధ్యాయ ప్రవచనాలు మళ్ళీ మళ్ళీ చెప్పడం జరిగింది. దీని ఉద్దేశ్యం స్వాధ్యాయప్రవచనాలు చాలా ముఖ్యమైనవి.

**దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ।**

ఇంద్రియ నిగ్రహం ఉండాలి మరియు స్వాధ్యాయప్రవచనాలు వదలకుండా చేయాలి.

**శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ।**

మనోనిగ్రహం ఉండాలి మరియు స్వాధ్యాయప్రవచనాలు శ్రద్ధగా చేయాలి.

**అగ్నయశ్చ స్వాధ్యాయప్రవచనే చ।**

నిత్య అగ్నికార్యం చేయాలి. శ్రౌతకర్మలు చేయాలి మరియు స్వాధ్యాయ, ప్రవచనాలు నిత్యం చేయాలి. ఈ నిత్యకర్మలు **దైవయజ్ఞాన్ని** సూచిస్తున్నాయి.

**అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ ।**

హోమాలు అంటే వైదిక కర్మలు చేయాలి. మరియు స్వాధ్యాయ, ప్రవచనాలు మరువకుండా చేయాలి. ఇవి **ఋషియజ్ఞాన్ని** సూచిస్తున్నాయి.

**అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ ।**

అతిథి అభ్యాగతులను సేవించాలి వారికి తగిన సాయం చేయాలి మరియు స్వాధ్యాయప్రవచనాలు సాధనగా చేయాలి.

**మానుషం చ స్వాధ్యాయ ప్రవచనే చ ।**

ఒక మనిషి సాయంకోరే మరో మనిషికి చేతనైనంత సాయం చేయాలి. పేదవిదార్థిని చదివించడం. అన్నార్తులకు భోజనం పెట్టడం వంటి సంఘ సేవలు చేపట్టడం చేయాలి మరియు స్వాధ్యాయ ప్రవచనాలు విధిగా చేయాలి. ఇవి **మనుష్యయజ్ఞాన్ని** సూచిస్తున్నాయి.

**ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ ।**

సంతతిని వృద్ధి చేసుకోవాలి మరియు స్వాధ్యాయప్రవచనాలు తప్పని సరిగా చేయాలి .

**ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ ।**

బార్యా భర్తల కలియకతో సంతానాభివృద్ధి కలగాలి. తద్వారా వంశాభి వృద్ధి అవాలి. మరియు స్వాధ్యాయప్రవచనాలు సాంప్రదాయంగా చేయాలి.

**ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ ।**

మనవలు మనిమనవలతో వంశం తులతూగాలి. మరియు స్వాధ్యాయప్రవచనాలు ఉత్సాహంగా చేయాలి. ఇవన్నీ **పితృయజ్ఞాన్ని** సూచిస్తున్నాయి.

**భూతయజ్ఞం** చెప్పబడలేదు ఉపలక్షణంగా మనం దానిని కూడా కలుపుకోవాలి. ఒక విషయంలో కొన్ని లక్షణాలు చెప్పి, కొన్ని చెప్పకపోతే వాటిని కూడా కలుపుకోడం ఉపలక్షణం అంటారు. ఈ విధంగా పంచమహాయజ్ఞాలు ప్రతి గృహస్థు చేయాలి.

ఇందులో అనేకమైన విలువలు చెప్పబడ్డాయి. ఋతం, సత్యం, శమం, దమం, పంచమహాయజ్ఞాలు, సాధ్యాయప్రవచనాలు చెప్పబడ్డాయి. వీటిలో ఏది అతిముఖ్యమైనది అని మీమాంస వచ్చింది.

**సత్యమితి సత్యవచా రాథీ తరః। తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః। స్వాధాయ ప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః తద్ధి తపస్తద్ధి తపః॥**

సత్యమే పలికే రాథీతర అనే ఋషి సత్యమే ముఖ్యమైనది అని నిర్ధారించాడు. తపోనిత్యుడైన పౌరుశిష్ఠి అనే ఋషి తపస్సే ముఖ్యమైనదని తేల్చాడు. నాకుడనే ఋషి, ఆయనకే మద్గల్యుడనే పేరు కూడా ఉంది, సాధ్యాయ ప్రవచనాలే ముఖ్యమన్నాడు. శ్రుతి కూడా అవును సాధ్యాయప్రవచనాలే ముఖ్యం, సాధ్యాయప్రవచనాలే అతిముఖ్యం అన్ని నొక్కి వక్కాణిస్తోంది.

## అనువాకం 10

**అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరే రివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోఽక్షితః। ఇతి త్రిశంకోర్వేదానువచనమ్॥**

ఇది ఒక జప మంత్రం - జ్ఞాని మానసిక స్థితిని వర్ణించే జపం. నేనే బ్రహ్మను అని చాటే మంత్రం.

నేను ఈ సంసార వృక్షమునకు అంతర్యామి రూపములో స్థితికారకుడను. నా కీర్తి ఉన్నత పర్వత శిఖరమువలె జ్ఞానముచే ప్రకాశించుచు అన్నిటిని అధిగమించి ఉంది. సూర్యుని ప్రకాశమువలె నేను మంగళకారుడను, శాశ్వతమైన వాడను.నేను ప్రకాశవంతుడను. ఆత్మస్వరూపమనే ధనముతో సర్వజ్ఞుడనై అమృతముచే అభిషిక్తుడనై ఉన్నానని త్రిశంకుడనే ఋషి బ్రహ్మైకత్వ జ్ఞానము తరువాత తన కృతకృత్యతను చాటి చెప్పాడు. ఈ మంత్రంలో వచ్చిన వాజిని అనే పదం వాజస్ - అన్నం - నుంచి వచ్చింది. సూర్యుడు ఆకులలో పిండిపదార్థాన్ని తయారుచేసి అన్న ఉత్పత్తికి కారణమౌతున్నాడు కనుక ఆయనను వాజిని అన్నారు.

## అనువాకం 11

**వేదమనూచార్యోఽన్తేవాసిన మనుశాస్తి। సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయాన్మా ప్రమదః। ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః। సత్యాన్న ప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదితవ్యమ్। కుశలాన్న ప్రమదితవ్యమ్। భూత్యై న ప్రమదితవ్యమ్। స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్। దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్।**

**మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ। అతిథిదేవో భవ।**

**యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇతరాణి। యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపాస్యాని నో ఇతరాణి।**

**యే కే చాస్మచ్ఛ్రేయాగ్ంసో బ్రాహ్మణాః। తేషాం త్వయాఽఽసనే న ప్రశ్వసితవ్యమ్। శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।**

**అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర బ్రాహ్మణా**

**స్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః। అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర బ్రహ్మాణా-స్సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః।**

**ఏష ఆదేశః। ఏష ఉపదేశః। ఏషా వేదోపనిషత్। ఏతదనుశాసనమ్। ఏవముపాసితవ్యమ్। ఏవముచైతదుపాస్యమ్॥**

**వేదమనూచార్యో౽న్తేవాసిన మనుశాస్తి।**

వేదవిద్య బోధించిన పిదుప ఆచార్యుడు తన శిష్యులకు సంఘంలో పాటించాల్సిన విధులు, బాధ్యతలు గుర్తుచేస్తున్నాడు.

**సత్యం వద। ధర్మం చర।**

అబద్ధం పలుకవద్దు. ధర్మాచరణ చేయి.

**స్వాధ్యాయాన్మా ప్రమదః।**

స్వాధ్యాయం విషయంలో అలసత్వం, అలక్ష్యం వద్దు.

**ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః।**

విద్యానంతరం ధార్మికుడైన ధనికుని వద్దకో, రాజు వద్దకో, వెళ్ళి తను నేర్చుకున్న విద్యను ప్రదర్శించి వారిచ్చిన ధనమును గురువుగారు తృప్తిపడేంతగా తేవాలి. పూర్వం విద్యను అమ్మేవారు కారు. గురుకులవాసంలో విద్య, దుస్తులు, వసతి, భోజనం అంతా ఉచితంగా గురువు సమకూర్చేవాడు. గురువు విద్య నేర్పేసమయంలో ఉచితంగా ఇవన్నీ అమర్చేవాడు. విద్యానంతరం శిష్యుడు పొరుగు ప్రాంతానికి పోయి తన విద్యను ప్రదర్శించి వచ్చిన ధనాన్ని ఆచార్యునకు ఇవ్వాలి. ఈ ధనంతో మళ్ళీ వచ్చే శిష్యులకు ఉచిత విద్యను, సదుపాయాలను గురువు అందించగలుగుతాడు. ఇది ఒక పద్ధతి.

విద్య రెండు రకాలుగా ఉంటుంది. మొదటి భాగంలో అంటే వేదపూర్వభాగంలో వేదపఠనం, కంఠోపాఠము చేయడం. కర్మకాండ, ధర్మశాస్త్రం నేర్చుకోడం ఉంటుంది.

ఆ తరువాత శిష్యుడికి ఇంకా ఆసక్తి ఉంటే వేదాంతం నేర్చుకోవడం. ఈ విధంగా ఉంటుంది. వేదాంతం మీద ఆసక్తిలేనివారు గురువు అనుమతితో

గురుకులవాసం వదిలి గృహస్థాశ్రమం ప్రవేశిస్తారు.

అలా గృహస్థులై వంశాభివృద్ధి చేసుకోవాలి. గృహస్థులు ధనం బాగా సంపాదించి సన్యాసులను, బ్రహ్మచారులను, వానప్రస్థులను పోషించాలి.

**సత్యాన్న ప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదితవ్యమ్। కుశలాన్న ప్రమదితవ్యమ్। భూత్యై న ప్రమదితవ్యమ్। స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్। దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్।**

**సత్యాన్న ప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదితవ్యమ్।**

ఆచార్యుడు మళ్ళీ మళ్ళీ సత్యం, ధర్మం విస్మరించ వద్దని చెబుతున్నాడు.

**కుశలాన్న ప్రమదితవ్యమ్।**

**కుశలాత్ న ప్రమదితవ్యమ్** అంటే నీ ఆరోగ్యాన్ని, కుంటుబాన్ని నిర్లక్ష్యం చేయద్దు అని. ఇంటగెలిచి రచ్చ గెలవమన్నారు. ముందు నీ ఆరోగ్యం, కుటుంబ బాగోగులు చక్కబరుచు కోవాలి.

**భూత్యై న ప్రమదితవ్యమ్।**

నీ సంపదను వృద్ధి చేసుకో. దానితో ధర్మకార్యాలు చేపట్టవచ్చు.

**స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్।**

స్వాధ్యాయప్రవచనాలు – పఠనం, పాఠనం విస్మరించరాదు. చక్కగా శాస్త్ర శ్రవణం చేయాలి. శ్రవణం ద్వారా అందుకుని ఆకళింపు చేసుకున్న జ్ఞానాన్ని నలుగురుకు పంచాలి.

**దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్।**

దైవపూజ, పితృకార్యాలు (తర్పణాదులు) విస్మరించరాదు.

**మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ। అతిథిదేవో భవ।**

**మాతృదేవో భవ।**

తల్లి దైవంతో సమానం. తల్లి ప్రత్యక్షదైవం. మనం చేసే పనులు ఆమెను కష్టపెట్టకూడదు.

**పితృదేవో భవ।**

తండ్రి సంరక్షణలో మనం మనకాళ్ళ మీదనిలబడే స్థితికి రాగలుగుతాము. తండ్రి దైవం. రాముడు పితృవాక్యపరిపాలన చేసాడు. తండ్రి మాటకు గౌరవం

ఇవ్వాలి.తండ్రిని చక్కగా చూసుకోవాలి.

**ఆచార్యదేవో భవ।**

గురువు వల్లే మనకు జ్ఞానసంపద కలుగుతుంది. గురువు చేసిన మేలు మరువరాదు. గురువు దైవం. గురువును కష్టపెట్టకూడదు.

**అతిథిదేవో భవ।**

పూర్వకాలం అన్నం అమ్మేవారుకారు. బాటసారులు రాత్రివరకు కాలినడకన ప్రయాణం చేసి రాత్రికి ఎక్కడ చేరుకుంటే అక్కడ దగ్గరలో ఉన్న ఇంటిగుమ్మం తట్టి ఆశ్రయం అడిగేవారు. అతిథి అంటే మనకు తెలిసిన వాడు కాదు. తిథి వారాలు చూడకుండ ఆకస్మికంగా వచ్చేవాడు. పూర్వం హొటళ్ళు బోజన సదుపాయాలు ఉండేవి కావు కనుక తెలియని వ్యక్తిని కూడ ఆదరించి మర్యాదలు చేసేవారు. ఇప్పుడు రోజులు మారాయి. అనవసరంగా కష్టాలు కొనితెచ్చుకోవద్దు అంటారు స్వామీజీ. ఈ విలువ ప్రస్థుత కాలానుగుణంగా దిద్దుబాటు చేయబడింది.

**యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇతరాణి। యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపాస్యాని నో ఇతరాణి।**

**యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇతరాణి।**

అనిందితాలైన పనులు మాత్రమే చేయాలి. ఇతరమైనవి కావు.

**యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపాస్యాని నో ఇతరాణి।**

ఆదర్శమైన గురువులు, దైవీసంపత్తి కలిగిన వారు చేసే పనులను నీవు ఆచరించు ఇతరమైనవి కావు.

**యే కే చాస్మచ్ఛ్రేయాగ్ంసో బ్రాహ్మణాః। తేషాం త్వయాஉஉసనే న ప్రశ్వసితవ్యమ్।**

నీకన్నా విద్వాంసులు, శ్రుతినాశ్రయించిన వారు, యోగ్యులు తారసిల్లినట్లయితే వారికి చక్కటి ఆసనమిచ్చి సేద తీర్చి, వారు చెప్పే అనుగ్రహ భాషణం నీ వ్యర్థప్రశ్నలతో అడ్డుపడకుండా విని స్వీకరించు.

ఇక దానం ఎలా చేయాలో గురువుగారు చెపుతున్నారు.

**శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాஉదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।**

**శ్రద్ధయా దేయమ్।**

దానం చేసేటప్పుడు శ్రద్ధతో చేయాలి. పనికి మాలినవి కుళ్ళిపోయినవి దానం చేయకూడదు. దానం ఇవ్వడం భగవంతుడు ఇచ్చిన ఒక అవకాశంగా భావించాలి. దానం తీసుకునేది సాక్షాత్తు నారాయణుడన్న ఉద్దేశ్యంతో ఇవ్వాలి. ఈసడింపు, విసుగు చూపకూడదు. డబ్బును దానం గ్రహించే వానిపై విసరకూడదు. డబ్బు ఇచ్చాననే దర్పంతో దానం చేయకూడదు.

ఒక ఆసామి ధార్మిక సభకు ఫ్యాన్లు దానం చేసాడు. సభ మొదలైంది. ఆ దాత ఫ్యాను స్విచ్ బోర్డు దగ్గర నుంచుని ఎవ్వర్నీ ఫ్యాను స్విచ్చులు వేయనివ్వటంల్లేదు. విషయం తెలుసుకుంటే ఆయనగారు ప్రతి ఫ్యాను రెక్క మీద తన పేరు రాయించాడు. ఫ్యాను తిరిగితే ఆ పేరు కనిపించదని గొడవ చేసాడు. దానం ఈ విధమైన దర్పప్రవృత్తితో ఉండకూడదు.

**అశ్రద్ధయాఽ దేయమ్।**

అశ్రద్ధతో దానం ఇవ్వకూడదు. ఎడం చేత్తో నిర్లక్ష్యంగా దానం చేయడం వంటి పనులు చేయరాదు. కఠోపనిషత్తులో తండ్రి వాజశ్రవసుడు అశ్రద్ధతో చేసే దానానికి కొడుకు నచికేతుడు ఎంతగా కుమిలి పోతాడో చూస్తాం. వాజశ్రవసుడు వట్టిపోయిన, గడ్డిమేయలేని ఎముకలపోగులైన ఆవులను దానమిస్తూంటే, అటువంటి దానం చేసేవారు హీన లోకాలకు పోతారని నచికేతుడు వాపోతాడు.

**శ్రియా దేయమ్।**

శక్తివంచన లేకుండా దానం చేయాలి. ఒక స్వామీజీ ఇలా అన్నారు డోనేట్ అంటిల్ ఇట్ పెయిన్స్. మీరు వంద రూపాయిలు ఇవ్వగలరనుకోండి. ఐదు రూపాయల దానంతో సరిపెట్ట కూడదు.

**హ్రియా దేయమ్।**

సిగ్గుతో దానం చేయాలి. అయ్యో ఇంకా దానం చేయగలిగితే బాగుండునే అనే సిగ్గుతో, వినయంగా దానం చేయాలి.

**భియా దేయమ్।**

పాపభయంతో దానం చేయాలి. దానం చేసి పుణ్యం సంపాదించాలనే కోరికతోనైనా దానం చేయాలి. శాస్త్రం ప్రకారం మన సంపాదనలో పదవవంతు

దానం చేయాలిట.

**సంవిదా దేయమ్।**

సౌహార్థంతో దానం చేయాలి. మనస్ఫూర్తిగా, సంతోషంగా దానం చేయాలి.

ఒక స్వామీజీ దానం గురించి చాలా వివరంగా చెప్పి అక్కడ వున్న పల్లెటూరి వాడిని పరీక్షిద్దామని ఇలా అడిగారు –

నీ దగ్గర పది ఎకరాల భూమి ఉంటే ఏం చేస్తావు?

సమాధానం – ఐదు ఎకరాలు దానం చేస్తానండి.

నీ దగ్గర రెండు భవంతులు ఉంటే ఏం చేస్తావు?

సమాధానం – ఒక భవంతి దానం చేస్తానండి.

నీ దగ్గర రెండు గేదెలు ఉంటే ఏం చేస్తావు?

సమాధానం – ఒక గేదె కూడా దానం ఇవ్వనండి.

ఎందుకూ?

సమాధానం – అయ్యా! నా దగ్గర ఎకరాలూ లేవు. భవంతులూ లేవు. కాని రెండు గేదెలు నిజంగా ఉన్నాయి స్వామీజీ! అన్నాడు.

ఓ లోభి కాలువలో పడి మునిగి పోతున్నాడు. 'రక్షించండి రక్షించండి' అని బిగ్గరగా అరుస్తున్నాడు. పక్కనే ఉన్న పడవ లోంచి ఓ ఈతగాడు లోభి దగ్గరకు ఈదుకుంటూ వెళ్ళి ఒడ్డుకు లాగుకుంటూ తీసుకు వద్దామని చేయి ఈయమన్నాడు.' లోభి చేయి ఇవ్వలేదు కాని 'రక్షించండి రక్షించండి' అని బిగ్గరగా అరుస్తున్నాడు. ఒడ్డునుంచి ఇది గమనించిన ఆతని బంధువులు ఇలా అన్నారు. 'అతను తీసుకోడమే కాని ఎవ్వరికీ ఏమి ఇచ్చిన దాఖలాలు లేవు. అందుకని చేయి చాచి తీసుకో అను ' అని సలహా ఇచ్చారు. ఈతగాడు చేయి చాచి 'తీసుకో' అనగానే లోభి ఠక్కున చేయి చాచాడు.

దానం ఆచరణలో పెట్టాలి. భగవద్గీత గృహస్థులను యజ్ఞం, దానం, తపస్సు వదిలి పెట్టవద్దు అంటుంది.

మన దగ్గర ఏదైనా వస్తువు నాలుగు నెలలగా వాడకుండా మనకు ఉపయోగం లేకుండా పడి ఉంటే, అది ఉపయోగించే వ్యక్తికి దానిని ఇవ్వాలిట.

**అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర**

**బ్రహ్మణాస్సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః।**

**అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర బ్రహ్మణా-స్సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః।**

**అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర బ్రహ్మణాస్సమ్మర్శినః।**

ఒక వేళ నీకు కర్మ ఆచరణలో కాని ధర్మ ఆచరణలో కాని సంశయం కలిగితే ఏం చేయాలి? నీ ప్రాంతంలో ఉన్న గుణబ్రాహ్మణులను వినయంతో సంప్రదించాలి. వారు ఎలాంటి వారై ఉండాలి?

**యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః।**

వారు నిష్పక్షపాతులు, నిర్మోహమాటస్తులు, దయాహృదయులు, పట్టువిడుపు ఉన్నవారు, (మొండిగా సలహాలు ఇవ్వనివారు), ధర్మాచరణకు శ్రుతికి కట్టుబడిన వారు, ఆచరణ యోగ్యమైన సలహా ఇవ్వగలిగిన వారు కావాలి.

**అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర బ్రహ్మణా-స్సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః।**

వారు సూచించిన విధంగా, వారు పాటించిన రీతిగా మీరు పాటించండి. నిందితుల పట్ల మీ వ్యవహారం ఏవిధంగా ఉండాలి? పైన చెప్పిన గుణబ్రాహ్మణులు ఏ విధంగా నడుచుకుంటారో, మీరు అదే మాదిరిగా మెసులుకోవాలి.

**ఏష ఆదేశః। ఏష ఉపదేశః। ఏషా వేదోపనిషత్। ఏతదనుశాసనమ్। ఏవముపాసితవ్యమ్। ఏవముచైత దుపాస్యమ్॥**

ఇది వేదం చెప్పే ఆదేశం, ఉపదేశం, శాసనం కూడా. వీటిని చక్కగా ఆచరించు.

## అనువాకం 12

ఓం శం నో మిత్ర శ్శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః శం నో విష్ణుః రురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్। ఋతమవాదిషమ్। సత్యమవాదిషమ్। తన్మామావీత్। తద్వక్తారమావీత్। ఆవీన్మామ్ ఆవీద్వక్తారమ్।

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

**ఓం శం నో మిత్ర శ్శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః శం నో విష్ణుః రురుక్రమః।**

ప్రాణవృత్తికి, దినానికి అభిమానదేవత మిత్రుడు మాకు సుఖం కలుగజేయుగాక! అపానవృత్తికి, రాత్రికి అభిమానదేవత వరుణుడు మాకు సుఖప్రదుడగుగాక! కంటికి, సూర్యమండలానికి అభిమానదేవత సూర్యనారాయణుడు మాకు శుభప్రదుడగుగాక! బలాభిమాన దేవత ఇంద్రుడు, వాక్కుకు బుద్ధికి అభిమానదేవత బృహస్పతి మాకు సుఖశాంతులనొసగుగాక! పెద్ద పెద్ద అంగలు వేసే, పాదాలకు అభిమాన దేవత విష్ణుభగవానుడు మాకు శుభప్రదుడగుగాక.

**నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్।**

వాయురూపుడైన బ్రహ్మకు నమస్కారం. ఓ వాయుదేవా! నీకు నా నమస్కారం. నీవే ప్రత్యక్షమైన బ్రహ్మగా నేను చెపుతున్నాను.

**ఋతమవాదిషమ్। సత్యమవాదిషమ్।**

శాస్త్రముద్వారా నిశ్చితమైన సత్యస్వరూపుడవు నీవేనని చెపుతున్నాను. శరీరము, వాణి వెనుక ఉన్న సత్యము నీవేనని చెపుతున్నాను.

**తన్మామావీత్। తద్వక్తారమావీత్। ఆవీన్మామ్ ఆవీద్వక్తారమ్।**

ఆ సర్వాత్మకుడైన వాయు రూపములోనున్న బ్రహ్మ, జ్ఞానసంపాదననిచ్చి నన్ను రక్షించాడు. ఆ బ్రహ్మము ఆచార్యులకు వక్తృత్వ సామర్థ్యాన్ని ప్రసాదించి రక్షించాడు. నాకు గ్రహణ ధారణ సామర్థ్యాలనిచ్చి నన్ను రక్షించావు. నన్ను రక్షించావు. ఆచార్యులను రక్షించావు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆదిదైవిక తాపములు శమించుగాక!

# బ్రహ్మానంద వల్లీ

## శాంతి పాఠం

**ఓం సహనావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై తేజస్వినావధీతామస్తు మా విద్విషావహై।**

**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

**సహ నావవతు।**

మా గురువుగారు, నేను రక్షింప బడుదుము గాక.

**సహ నౌ భునక్తు।**

మేమిద్దరము రక్షింపబడుదుము గాక. ఇంతకు ముందు చెప్పాము మళ్ళీ ఎందుకు? మొదటి రక్షణ మా ఇరువురి శారీరక సామర్థ్యం కోసం. మా ఇరువురి ఆరోగ్యం చక్కగా ఉండి శాస్త్ర అధ్యయనానికి అనుకూలంగా ఉండాలి. రెండవ రక్షణ మాకు కావల్సిన జ్ఞానం మాకు సమకూరాలి.

**సహవీర్యం కరవావహై।**

శాస్త్ర అధ్యయనంలో మా యిరువురి ప్రయత్నమూ ఉండాలి. పై రెండు ఈశ్వర ఆనుకూల్యత గురించి, ఇది మానవ ప్రయత్నం గురించి. రెండు చేతులు కలిస్తేగాని చప్పట్లు కావు. గురువుగారు చక్కగా బోధ చేయ్యాలి. దాన్ని శిష్యుడుగా నేను సరిగ్గా అర్థం చేసుకోవాలి.

**తేజస్వినావధీతమస్తు।**

శాస్త్ర అధ్యయనానికి కావల్సిన గ్రహణ ధారణ శక్తి కావాలి.

**మా విద్విషావహై।**

మా మధ్య ఎటువంటి అపోహలు లేకుండా వుండాలి. ముఖ్యంగా శిష్యుడు నేర్చుకునేటప్పుడు అనేక ధారణలతో వుంటాడు. వాటికి వ్యతిరేకంగా బోధ ఉంటే, దానిని స్వీకరించలేడు. శాస్త్రం ఒక ప్రమాణం అని ప్రమాణబుద్ధితో అధ్యయనం చేస్తేనే శాస్త్రం బోధపడుతుంది. శంకలతో అధ్యయనం సాగదు. అందుకని గురుశిష్యుల మధ్య శాస్త్ర అధ్యాపనం – అధ్యయనం ఎటువంటి అపోహలకు తావు లేకుండా సాగిపోవాలి.

**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

మొదటి శాంతి ఆధ్యాత్మిక ఆటంకం లేకుండా అంటే మన శరీరపరంగా

ఎటువంటి ఇబ్బంది రాకుండా; రెండవ శాంతి ఆధిభౌతికమైన ఆటంకాలు అంటే మనతోటి వ్యక్తులు, లేదా జీవరాసులు వల్ల శాస్త్ర అధ్యయనానికి వచ్చే ఇబ్బందులు లేకుండా; మూడవ శాంతి ఆదిదైవిక ఆటంకం లేకుండా, వరదలు, క్షామం,తుఫానులు, గీష్మతాపం లాంటివి, ప్రకృతి వైపరీత్యాలు లేకుండా; ఈ విధంగా తాపత్రయాలు లేకుండా చేయమని ప్రార్థన. తాపత్రయం అంటే ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆదిదైవిక ఇబ్బందులు.

**అనువాకం 1**

**ఓం బ్రహ్మ విదాప్నోతి పరమ్। తదేషాఽభ్యుక్తా।సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ।**
**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ।**
**బ్రహ్మణా విపశ్చితేతి।**
**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశద్వాయుః। వాయో రగ్నిః। అగ్నేరాపః।**
**అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।**
**బ్రహ్మ విదాప్నోతి పరమ్।**

దీనిని సూత్రభూత వాక్యము అంటారు.

ఈ **సూత్రభూత వాక్యము** బ్రహ్మానంద వల్లిలో చెప్పదలుచుకున్న విషయాన్నంతటిని ఒక చిన్న వాక్యంగా లేదా సూత్రంగా పొందుపరిచింది. బ్రహ్మమును తెలుసుకున్నవారు పరమమును పొందుతారు. ఈ వాక్యం ద్వారా మూడు ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. బ్రహ్మ అంటే ఏమిటి? ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి? పరమము అంటే ఏమిటి? ఈ ప్రశ్నలకు సంక్షిప్త సమాధానమే వృత్తివాక్యము.

**వృత్తి వాక్యము** – ఋక్ మంత్రం ద్వారా పై ప్రశ్నలకు లఘు సమాధానం ఇవ్వబడుతోంది. ఈ ఋక్ మంత్రాన్ని ఇక్కడ వృత్తి వాక్యం అంటారు.

**తదేషాఽభ్యుక్తా। సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ।**

బ్రహ్మ అంటే సత్యం, జ్ఞానం, అనంతం.

**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ।**

**బ్రహ్మణా విపశ్చితేతి॥**

ఎవరు బ్రహ్మను తన హృద్గుహలో ఉన్న ఆకాశములో దాగుకొని ఉందని తెలుసుకొంటాడో, అతని కోరికలు ఒక్కసారిగా తీరుతాయి.

**బ్రహ్మ ఒక తత్త్వము,** ఒకానొక పెద్దమనిషి కాదు. **బ్రహ్మా** అంటే చతుర్ముఖ బ్రహ్మ. బ్రహ్మను కొన్ని గ్రంథాలలో **బ్రహ్మము** అని కూడా వ్యవహరిస్తారు.బ్రహ్మ అనే పదం **బృహ్** అనే ధాతువు నుంచి వచ్చింది. బృహ్ అంటే పెద్దదని అర్థం. **బృహత్తమత్వాత్** బ్రహ్మ.

పెద్దదోమ – పెద్ద అనే విశేషణానికి దోమ నామవాచకం తోడైతే, అది ఎంత పెద్దదో తెలుస్తుంది. ఈ విధంగా నామవాచకం విశేషణం పరిమితులు సూచిస్తుంది. పెద్ద భవంతి, పెద్ద పుస్తకం అన్నప్పుడు వాటి వాటి పెద్ద అనే విశేషణం ఎంత పెద్దవో తెలుపుతుంది. బ్రహ్మ అన్నప్పుడు బ్రహ్మ తరువాత మరే నామవాచకం లేదు. అంటే అదే అతి పెద్దది. మన ఊహలో అతి పెద్దది ఏది ఉందో దానికన్నా పెద్దది. ఈ విశ్వముకన్నా పెద్దది. అతి పెద్దదైన ఆకాశముకూడ దాని నుంచే వచ్చింది. తైత్తిరీయం బ్రహ్మ అంటే ఏం చెపుతుందో చూద్దాం.

**బ్రహ్మ అంటే ఏమిటి?** సమాధానము – బ్రహ్మ అంటే సత్యము,జ్ఞానము, అనంతము. ఇది బ్రహ్మ నిర్వచనము.

**ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి?** సమాధానము – దాన్ని హృద్గుహలో బుద్ధి ద్వారా తెలుసుకోవాలి. అదే నువ్వు అని నిస్సంశయంగా తెలుసుకోవాలి.

**పరమము అంటే ఏమిటి?** సమాధానము – పరమము అంటే అదే మోక్షము, జీవన్ముక్తి. ఈ జీవన్ముక్తి పొందిన జ్ఞానికి అన్ని కోరికలు ఒక్క సారిగా తీరిపోతాయి.

**బ్రహ్మ అంటే ఏమిటి? బ్రహ్మ అంటే సత్యము, జ్ఞానము, అనంతము అన్నారు కదా!**

అనంతము – ముందు అనంతము అంటే ఏమిటో చూద్దాము. అనంతమంటే దేశ, కాల, వస్తు పరంగా బ్రహ్మ అనంతమైనది. ఆది – అంతములు లేనిది అనంతము.

బ్రహ్మ దేశతః అనంతమైనది. ఏ వస్తువైనా ఒకచోట ఉంటే మరొక చోట వుండదు. నేను బయట ఉంటే, ఇంట్లో లేను. ఇంట్లో ఉంటే బయట లేను. బ్రహ్మ అంతటా వుంది.

బ్రహ్మ కాలతః అనంతమైనది. ఏ వస్తువైనా ఒక సమయములో పుట్టి, ఇంకో సమయములో మరణిస్తుంది.బహ్మ ఒక కాలములో ఉండి మరొక కాలములో లేకుండా లేదు. బ్రహ్మ మూడు కాలాల లోను ఉంది. **బ్రహ్మ త్రికాలేపి తిష్ఠతి**.

బ్రహ్మ వస్తుతః అనంతమైనది. ఒక పుస్తకము తీసుకుంటే, అది పెన్ను కన్నా భిన్నముగా వుంది. పెన్నుకు అది పెన్ను అని తెలిపే లక్షణాలన్నిటినీ పెన్ నెస్ అంటాము. అంటే పెన్నుకున్న పెన్ నెస్ పుస్తకానికి లేదు. అలాగే పుస్తకానికి వున్న బుక్ నెస్ పెన్నుకు లేదు. నెక్లెస్‌నెస్, బాంగిల్‌నెస్ వేరైనా వాటిలో అనుస్యూతముగా, అధిష్ఠానముగా వున్న బంగారము ఒకటే. అదే విధముగా వస్తువులలో వ్యత్యాసము కనిపిస్తున్నా వాటిలో అంతర్లీనంగా, అభిన్నంగా వున్న చైతన్యము (బ్రహ్మ) ఒకటే.

బ్రహ్మ దేశతః అనంతమైనది అంటే బ్రహ్మ **సర్వవ్యాపకం**. బ్రహ్మ కాలతః అనంతమైనది అంటే బ్రహ్మ **నిత్యం.** బ్రహ్మ వస్తుతః అనంతమైనది అంటే బ్రహ్మ **అద్వితీయం**. ఇప్పుడో ఇబ్బంది ఏర్పడుతోంది. బ్రహ్మ సర్వవ్యాపకం అంటే ఇక్కడ ఆ బ్రహ్మ ఉండి తీరాలి. అంతే కాదు బ్రహ్మ నిత్యం అని కూడా అంటోంది అంటే ఇప్పుడు ఈ క్షణం ఇక్కడ బ్రహ్మ ఉండి తీరాలి. ఏది కనిపించదేం? మరో బాంబ్ షెల్! బ్రహ్మ అద్వితీయం – ఇక్క దున్నదంతా ఆ బ్రహ్మమే అంటోంది తైత్తిరీయ బ్రహ్మానందవల్లి.

ఇక్కడున్న సమస్తము బ్రహ్మ. అదెలా సాధ్యం? ఇక్కడ నాకు గోడలు, కుర్చీలు, బల్లలు, పుస్తకం, పెన్ను కనిపిస్తున్నాయి. అవి బ్రహ్మ అంటే ఎలా? అవి కూడా బ్రహ్మ అంటుంది శాస్త్రము. ఆ పరబ్రహ్మ లోనే ఇదంతా వ్యక్తమౌతోంది అంటోంది. ఎలా ఆభరణాలు బంగారముకన్నా విడిగా లేవో, ఈ జగత్తుకూడా బ్రహ్మకన్నా విడిగా లేదు. ఇది అర్థమవటానికి మనకి **భాగత్యాగలక్షణం** లేదా **జహదజహల్లక్షణం** అంటే ఏమిటో తెలియాలి.

**శాస్త్రం**లో పదాలకి అర్థం చెప్పేటప్పుడు రెండు పద్ధతులు వాడతారు. ఆ పద్ధతుల్లో మొదటిది **ముఖ్య వృత్తి** రెండవది **లక్షణ వృత్తి.**

**ముఖ్యవృత్తి** అంటే పదానికున్న ప్రధానమైన అర్థం. దీనినే రూఢి అని కూడా అంటారు. ఒక పదానికి సాధారణంగా వాడే అర్థం అన్న మాట.

**లక్షణ వృత్తి–** ఒక్కొక్కప్పుడు ప్రధానమైన అర్థం ఆ సందర్భానికి పొసగదు. అప్పుడు ఆ పదం ఏ లక్ష్యంతో వాడారో చూడాలి. దీనిని లక్ష్యార్థం లేదా **లక్షణవృత్తి** అంటారు. **లక్షణవృత్తులు** మూడు రకాలు. అవి **జహల్లక్షణం, అజహల్లక్షణం, జహదజహల్లక్షణం**.

**జహల్లక్షణం–** ఒక పదానికి సాధారణంగా వాడే అర్థం సందర్భోచితంగా లేనప్పుడు, మామూలు అర్థం వదిలివేసి, ఏ లక్ష్యంతో ఆ పదం వాడబడిందో తెలుసుకుని ఆ అర్థం గ్రహిస్తారు. దీనిని **జహల్లక్షణం** అంటారు.

ఉదాహరణ: భారత్, అమెరికాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి అని వాక్యం ఉంటే ఆసేతు హిమాచలం వరకు ఉన్న భారత్ భూభాగం, అనేక రాష్ట్రాల సంయుక్త అమెరికా భూభాగం ఒప్పందం కుదుర్చుకున్నాయి అని కాదు. అయితే ఇది ప్రధాన అర్థం. దీనిని త్రోసిపుచ్చి ఆ దేశాల నేతల మధ్య ఒప్పందం అయ్యింది అని అర్థం చేసుకోవాలి.

**అజహల్లక్షణం–** సాధారణ అర్థం పూర్తి అవగాహన నివ్వనప్పుడు దానికి సంబంధించిన మరొక అర్థం కూడా కలుపుకుని, పదం అర్థం స్వీకరించడం. ఉదాహరణతో బాగా అర్థమౌతుంది.

ఉదాహరణ: ఒక కారు రేసు జరుగుతోంది. అప్పుడే వచ్చిన ఆసామి ఏది నెగ్గుతోంది? అన్నాడు. దానికి సమాధానంగా మీరు ఎర్రది నెగ్గుతోంది అన్నారు. ఎర్ర రంగు రేసులో పాల్గోలేదు కదా! దీనికి ఎర్ర = ఎర్ర + కారు అంటే ఎర్రకారు నెగ్గుతోంది అని తీసుకుంటాము. కారు అనే పదాన్ని అక్కడ ఉన్న పదానికి అదనంగా కలిపితేనే అర్థం సరిపోతుంది. ఈ పద్ధతి **అజహల్లక్షణం** అనబడుతుంది.

**జహదజహల్లక్షణం–** ఒక పదం వాడినప్పుడు అందులో ఒక భాగాన్ని వదలి మరొక భాగాన్ని మాత్రం స్వీకరించడం **జహదజహల్లక్షణం** అంటారు.

ఉదాహరణ:– మామిడి పండు కొన్నాను. మామిడి పండు తిన్నాను. ఈ రెండు వాక్యాలు పరిశీలిద్దాము. మామిడిపండు కొన్నాను.అంటే మామిడి పండు మొత్తము (మామిడి పండు = తోలు + గుజ్జు + టెంక) కొన్నాను అని అర్థం. దీనిని ముఖ్య అర్థం అంటారు. మామిడి పండు తిన్నాను. అంటే తోలు,

టెంక వదలి కేవలం గుజ్జు మాత్రమేతిన్నాను అని అర్థం. ఇది జహదజహల్లక్షణంకి ఉదాహరణ.

అలాగే గంగానది అంటే గోముఖ్ నుంచి కొల్‌కత్తా గంగాసాగర్‌వరకు గంగానదే. ఇది గంగానది ముఖ్య అర్థము. కాని గంగానదీ స్నానం చేసాను అంటే గోముఖ్ మొదలుకొని కొల్‌కత్తా గంగా సాగర్ వరకు స్నానం చేసానని కాదు. ఏదో ఒక రేవులో అదీ ఒకచోట మాత్రమే స్నానం చేసానని.అంటే ముఖ్య అర్థం తీసుకోకుండా జహదజహల్లక్షణం ద్వారా అర్థము చేసుకున్నాం. దీన్నే భాగత్యాగలక్షణం అని కూడా అంటారు. ఇది మనకు తెలియకుండానే మన దైనందిన జీవితంలో ఉపయోగిస్తాము.

ఇప్పుడొక అభ్యాసం చేద్దాం **తత్ త్వం అసి** అనే మహావాక్యాన్ని పరిశీలిద్దాం. తత్ = పరమాత్ముడు; త్వం = నువ్వు (జీవుడు) ఈ రెంటికీ చాలా వ్యత్యాసాలున్నాయి. ఈ రెండింటికీ దోమకు, ఏనుగుకు ఉన్నంత భేదం ఉంది.

పరమాత్ముడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడు.

జీవుడు సర్వజ్ఞుడు కాదు, సర్వవ్యాపి కాదు, సర్వశక్తిమంతుడు కాదు.

కాబట్టి ఇక్కడ ముఖ్య వృత్తి కుదరదు. ఇక లక్షణ వృత్తులలో ఏది సరిపోతుందో చూడాలి.

| **పరమాత్ముడు** | **జీవుడు** |
|---|---|
| **స్థూల ప్రపంచం (విరాట్)** | **స్థూల శరీరం (విశ్వ)** |
| **సూక్ష్మ ప్రపంచం (హిరణ్య గర్భ)** | **సూక్ష్మ శరీరం (తైజస)** |
| **కారణ ప్రపంచం (ఈశ్వర)** | **కారణ శరీరం (ప్రాజ్ఞ)** |
| **ప్రతిబింబ చైతన్యం (సమష్టి అహంకారం)** | **ప్రతిబింబ చైతన్యం (వ్యష్టి అహంకారం)** |
| **బింబ చైతన్యం** | **బింబ చైతన్యం** |

జహల్లక్షణంలో ముఖ్య అర్థాలు కాకుండా లక్ష్యార్థం తీసుకోవాలి. అలా పరమాత్మ 5 అంశాలు, జీవుని 5 అంశాలు తీసేస్తే చైతన్యం కూడా ఉండదు. కాబట్టి ఇక్కడ జహల్లక్షణం తీసుకోకూడదు.

అజహల్లక్షణంలో జీవుని లోనూ, పరమాత్ముని లోనూ అన్ని అంశాలూ తీసుకుని ఇంకా అదనంగా మరో అర్థం కూడా జోడించాలి. జీవుని లోనూ,

పరమాత్మని లోనూ మొదటి నాలుగు అంశాలు పరస్పర విరుద్ధమైనవి. కాబట్టి అజహల్లక్షణం కూడా కుదరదు.

ఇక **జహదజహల్లక్షణం** తీసుకుంటే విరుద్ధంగా ఉన్న మొదటి నాలుగు అంశాలు వదలి వేస్తే, పరమాత్మలోని బింబచైతన్యం, జీవుని బింబచైతన్యం ఒకటే అని తేలింది. అదే **తత్ త్వం అసి** మహావాక్యం. దీనిని **బాధాయాం సామానాధికరణం** అంటారు. విరుద్ధమైన, మిథ్యాభూతమైన నామరూపాలు త్రోసి పుచ్చితే, ఉన్నదంతా చైతన్యమే. **తత్ త్వం అసి.**

**ఇది మనకు తెలియకుండానే మన దైనందిన జీవితంలో ఉపయోగిస్తాము. ఈ జహదజహల్లక్షణం ఉపయోగించి సత్యం, జ్ఞానం అంటే ఏమిటో తెలుసుకుందాము. అలా ఇక్కడున్నదంతా బ్రహ్మ ఎలా అయిందో కూడా చూద్దాము.**

**సత్యం**– సత్యం వాచ్యార్థం ఉనికి ఉన్న ఏ వస్తువైనా– ఉదా: గడియారం, పుస్తకం, కుర్చీ, మొత్తం జాగ్రద్ ప్రపంచం. సత్యం యొక్క ఈ అర్థాన్ని బ్రహ్మకు అన్వయిస్తే, ఉనికి ఉన్న ప్రతి వస్తువూ బ్రహ్మ అవ్వాలి. కాని ఉనికి ఉన్న వస్తువు కాలత: దేశత: వస్తుత: పరిమితమైనది. ఇప్పుడే బ్రహ్మ అంటే అనంతం బ్రహ్మ అనీ, అనంతం బ్రహ్మకు దేశ, కాల, వస్తు పరిమితి లేదనీ నిరూపించాము. అందువల్ల ఇక్కడ భాగత్యాగలక్షణం ఉపయోగించి, అవసరమైన అర్థమే తీసుకోవాలి.

ఇప్పుడు వస్తువుని తీసుకుంటే ఏ వస్తువుకైనా మూడు భాగాలుంటాయి – నామం, రూపం, ఉనికి (సత్తా).

ఉనికి ఉన్న పుస్తకం – పుస్తకం నామం, పుస్తక రూపం, ఉనికి.

ఉనికి ఉన్న బల్ల – బల్ల నామం, బల్ల రూపం, ఉనికి.

పుస్తకం నామం వేరూ, బల్ల నామం వేరు. పుస్తకం రూపం వేరూ, బల్ల రూపం వేరు. రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఏది? ఉనికి లేదా సత్తా. పుస్తకం ఉనికి. కలం ఉనికి, నక్షత్రాల ఉనికి. అలా అన్నింటిలోనూ ఉనికి సమానంగా ఉంది.

టూకీగా చెప్పాలంటే – సత్యం యొక్క వాచ్యార్థం ఉనికి ఉన్న వస్తువు.
– సత్యం యొక్క లక్ష్యార్థం వస్తువు యొక్క ఉనికి.

అందువల్ల సత్యం అంటే నామ, రూప రహిత సత్ (సత్తా).

నామరూపాలను భాగత్యాగం చేశాము. సత్(సత్తా)ని చేయకూడదు. ఇది సత్యం యొక్క లక్ష్యార్థం.

**జ్ఞానం** – జ్ఞానం వాచ్యార్థం ఎఱుక. కుండ ఎఱుక, బల్ల ఎఱుక, పుస్తకం ఎఱుక వగైరా. ఈ ఎఱుక ఎక్కడ ఉంది? మన మనసులో– వృత్తి (ఆలోచన) రూపంలో. నేను ఒక బల్లను చూసినప్పుడు, దాని ఎఱుక నా కళ్ళ ద్వారా, నా మనసులోకి వెళుతుంది.

వృత్తిరూపంలో కలిగిన ఈ జ్ఞానాన్ని బ్రహ్మ అనలేము. ఎందుకంటే ఒక వస్తువుని గురించిన వృత్తి దేశతః, కాలతః, వస్తుతః పరిమితమైనది. ఇప్పుడే బ్రహ్మ అంటే అనంతం బ్రహ్మ అనీ, అనంతం బ్రహ్మకు దేశ, కాల వస్తు పరిమితి లేదనీ నిరూపించాము. అందువల్ల ఇక్కడ కూడా భాగత్యాగ లక్షణం ఉపయోగించి, అవసరమైన అర్థమే తీసుకోవాలి. ఇక్కడ దేశం అంటే మనసు. ఒక వ్యక్తి మనసు తెలుసుకుంటే, అందరూ తెలుసుకోవాలని లేదు.

సత్యంలో మూడు భాగాలున్నట్లే జ్ఞానంలో కూడా మూడు భాగాలున్నాయి – నామం, రూపం, ఎఱుక (చిత్) ఇక్కడ కూడా నామరూపాలు తీసేసి, సమానంగా ఉన్న ఎఱుక తీసుకోవాలి. వస్తువు వృత్తి వస్తుంది, చిత్ ఉంటుంది; వస్తువు వృత్తి పోతుంది. చిత్ ఉంటుంది. అనేక వృత్తులు వస్తూ, పోతూ ఉంటాయి, కాని ప్రతి ఆలోచన వెనుక చిత్ మాత్రం అనంతంగా ఉంటూనే ఉంటుంది. అందువల్ల జ్ఞానం అంటే నామరూప రహిత చిత్.

| | | |
|---|---|---|
| టూకీగా | – | అనంతం – దేశ, కాల, వస్తు పరిచ్ఛేద రహితం. |
| | | సత్యం – నామరూపరహిత సత్. |
| జ్ఞానం | – | నామ రూప రహిత చిత్ |
| బ్రహ్మ ఏమిటి? | – | సత్యం, జ్ఞానం, అనంతం – బ్రహ్మ |
| | | సత్ చిత్ ఆనందం బ్రహ్మ |

**ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి?**

**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్।**

బ్రహ్మ హృద్గుహలో ఉన్న ఆకాశంలో దాక్కొని ఉంది. హృద్గుహ అంటే బుద్ధిగుహ, ఇది మన హృదయం.హృదయంలో నాలుగు అంతఃకరణలు ఉంటాయి. బ్రహ్మ మన హృదయ ఆకాశంలోనే ఉందని (దహరాకాశము) ఈ వల్లి చెపుతోంది.మనలోనే గుడి ఉంది. ఆ గుడిలో దేవుడున్నాడు. గుడిని శుభ్రంగా ఉంచాలి. అంటే మన మనస్సు పవిత్రంగా ఉండాలి. ఈర్ష్య, అసూయ, కోపం మొదలైన మలినాలను తీసి వేయాలి.

**దేహో దేవాలయ ప్రోక్తః । జీవోదేవ స్సనాతనః।**

**త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యమ్। సోహం భావేన పూజయేత్।।**

దేహమే దేవాలయం. అందులో సనాతనంగా ఉన్న జీవుడే దేవుడు. అజ్ఞానమనే నిర్మాల్యాన్ని తీసివేసి, నేనే బ్రహ్మను అనే సంపూర్ణమైన జ్ఞానంతో ఆనందంగా జీవించండి. అదే మోక్షం. అదే జీవన్ముక్తి.

ఉపాసనా సౌలభ్యం కోసం శ్రుతి బ్రహ్మ హృద్గుహలో ఉంది అని చెప్పింది. అక్కడ మాత్రమే ఉందంటే బ్రహ్మ యొక్క అనంతత్వానికి, సర్వవ్యాపకత్వానికి భంగం కలుగుతుంది. హృద్గుహలో ఉంది అంటే ఆత్మసాక్షిగా ఉందని. శాస్త్ర అవగాహన లేనప్పుడు బ్రహ్మ ఒక ప్రాంతానికి చెందినది అనుకున్నాం. ఇప్పుడు ఉన్నదంతా అదే అని, బ్రహ్మ తప్ప మరొకటి లేదని, ఆ బ్రహ్మమే నేను అని నిశ్చయజ్ఞానం కలగాలి.

అయితే మనలో ఊపిరి పీల్చటం, రక్తప్రసారము, గుండె పనిచేయడం, జీర్ణక్రియ లాంటి అద్భుతమైన పనులు మన ప్రమేయం లేకుండానే జరిగి పోతున్నాయి. వీటి నియామకుడు ఎవరు? బ్రహ్మ మనలో ఉండి వీటి వ్యవహారమంతాచూస్తున్నాడా? వీటికి కాపలాదారుడులా వ్యవహరిస్తున్నాడా? ఊహించండి! ఒక యజమాని ఎక్కడో ఊటీలో ఉంటాడు. ఆయన పనులన్నీ సక్రమంగా జరిగి పోతాయి. ఆయనే దగ్గర ఉండి అన్ని పనులు చేయించనక్ఖర లేదు. అంతటా వున్న బ్రహ్మ సన్నిధి మాత్రం చేతనే లోక వ్యవహారం అంతా జరిగిపోతుంది.

కేవలం మనలోనే కాదు. విశ్వమంతా ఈ గెలాక్సీల గమనం, గ్రహాలు సూర్యుని చుట్టూ తిరగడం, రాత్రీ పగలూ ఏర్పడడం మొదలైన జగత్తు నియతి అంతా జరుగుతోంది. ఆయనను అంతర్యామి అనటంలో అర్థం మనలోని అంతర్నియామకం ఆయన విభూతి అని చెప్పటమే. ఆయన మనలో కూర్చుని ఇవన్నీ చేస్తున్నాడని కాదు. ఈ విషయం బృహదారణ్యక అంతర్యామి బ్రాహ్మణములో వివరంగా వస్తుంది.

**పరమము అంటే ఏమిటి?**

**సో஽ శ్నుతే సర్వాన్ కామాన్సహ।బ్రహ్మణా విపశ్చితేతి।**

సర్వజ్ఞ బ్రహ్మ (జ్ఞానిగా ఉన్న వానికి ఎటువంటి కోరికలు ఉండవు. అన్ని కోరికలు

ఒక్కసారి తీరిపోతాయి). ఇదేమిటో చూద్దాం.

ఈ జీవన్ముక్తి పొందిన జ్ఞానికి అన్ని కోరికలు ఒక్కసారిగా ఎలా తీరుతాయి? ఉదాహరణకు జ్ఞానికి శ్రీమతి సుబ్బలక్ష్మి గారి పాటలు శ్రీ మంగళంపల్లి గారి పాటలు ఇష్టం అనుకుందాం. అవి రెండు ఒక్కసారిగా వినిపిస్తాయా? అది కాకి గోల అవుతుంది గాని కచేరి అవదు కదా? జ్ఞానికి వైరాగ్య రూపంగా అన్ని కోరికలు తీరుతాయి. తను పూర్ణుడను అని గ్రహించి పూర్ణత్వదర్శనం చేస్తున్న జ్ఞానిగా ఎటువంటి వెలితిలేదు. ఏ కోరికలు ఉండవని అర్థం.

పూర్తిగా పీకలదాక తిన్నవానిని ఏదైనా తినమంటే ఏమంటాడు! అమ్మో! అని వైరాగ్యం ప్రదర్శిస్తాడు. దీనినే మనసుకు వర్తిస్తే, పూర్ణత్వస్థితిలో ఇక్కడున్నదేది నా కంటే భిన్నంగా లేదు అనే నిశ్చయాత్మక బుద్ధి కలవానిని ఏదీ ఆకర్షించదు. ఈ వైరాగ్యం పూర్ణత్వం వల్ల సిద్ధిస్తుంది. అందని ద్రాక్షపళ్ళు పుల్లన అన్న మాదిరిగా కాదు. అటువంటి జ్ఞానికి సంసారం లేదు. దుఃఖం లేదు. అంతా ఆనందమే.

**వ్యాఖ్యానం:-** మిగతా బ్రహ్మానంద వల్లి అంతా ఈ వృత్తి మీద వ్యాఖ్యానం. వృత్తిలో బ్రహ్మను సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ అన్నారు. దీనిని స్వరూప లక్షణంఅంటారు. ఇది బ్రహ్మ స్వరూపం చెపుతోంది.

ఇప్పుడు తటస్థ లక్షణం చూద్దాం.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశద్వాయుః। వాయో రగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।**

తటస్థ లక్షణము - జగత్తు కార్యము, జగత్తనే కార్యానికి బ్రహ్మ కారణం అంటే అది బ్రహ్మ తటస్థ లక్షణం అవుతుంది. జగత్తు ఒక కాలంలో ఉంటుంది. ప్రళయంలో లయమౌతుంది.

దేవదత్తుని గృహం ఏది అంటే అదిగో ఆ కాకి వాలిన గృహం అంటే అది తటస్థ లక్షణం. కాకి ఏ క్షణమైనా ఎగిరి పోవచ్చు. అటువంటి తాత్కాలికమైన గుర్తులతో బ్రహ్మను సూచిస్తే అది తటస్థ లక్షణమౌతుంది. జగత్తు సర్వం మార్పు చెందేదే. జగత్తు అంతటా అంతర్లీనంగా బ్రహ్మ ఉన్నాడు అని చెప్పడమే తటస్థ లక్షణం.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ।**

అటువంటి ఆ బ్రహ్మమైన ఆత్మనుంచి సూక్ష్మ ఆకాశం పుట్టింది. ఇక్కడ ఆ బ్రహ్మే ఆత్మ అంటోంది. ఆత్మ అంటే నువ్వే ఆ బ్రహ్మవి అని స్పష్టంగా

చెపుతోంది. ఆత్మనైన నా నుంచి ఆకాశం పుట్టింది. సాదారణంగా దేవుడు వైకుంఠం లోనో కైలాసం లోనో ఉన్నాడను కుంటాం. ఆకాశం కూడా ఆ బ్రహ్మలోంచే ఉద్భవించింది. అంటే సృష్టికి పూర్వం ఎక్కడ ఉన్నాదు?ఒకచోట ఉన్నాడంటే ఆ పరబ్రహ్మయొక్క సర్వవ్యాపకత్వాన్ని కించ పరిచినట్టే.

**ఆకాశాద్వాయుః। వాయో రగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ।**

సూక్ష్మ ఆకాశం నుండి సూక్ష్మ వాయువు, దానినుంచి సూక్ష్మ అగ్ని, దాని నుంచి సూక్ష్మ జలం, దాని నుంచి సూక్ష్మభూమి పుట్టాయి. సూక్ష్మ పంచభూతాల నుంచి పంచీకరణం వల్ల స్థూల పంచభూతాలు పుట్టాయి. సూక్ష్మాతి సూక్ష్మమైన ఆకాశం నుంచి స్థూలమైన భూమి వరకు అన్నీ పుట్టాయి. ఆకాశంలో అప్రకటంగా శబ్దం మాత్రమే వుంది. వాయువులో శబ్దం, స్పర్శ రెండూ వచ్చాయి. అగ్నిలో శబ్దం, స్పర్శ, రూపం మూడూ ఉన్నాయి. నీరుకి శబ్దం, స్పర్శ, రూపం, రసం కూడా ఉన్నాయి. భూమిలో శబ్దం, స్పర్శ, రూపం, రసంతో పాటు గంధం కూడా తోడైంది. ఈ విధంగా స్థూలభూత సృష్టి జరిగింది.

**పృథివ్యా ఓషధయః।ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।**

భూమి నుంచి చెట్టు చేమలు, చెట్టు చేమల నుంచి అన్నం, అన్నం నుంచి పురుషుడు పుట్టారు. ఇక్కడ చెట్టుచేమల నుంచి అన్నం అంటే శ్రుతి శాఖాహారమే అన్నమంటోంది.

అన్నం తిన్న పురుషుని నుంచి శుక్రం, అన్నం తిన్న స్త్రీ నుంచి శోణితం పుడతాయి. స్త్రీ పురుషుల కలయిక వల్ల శుక్ర శోణితాల సమ్మేళనం ద్వారా సంతతి కలుగుతుంది. ఈ విధముగా స్త్రీ పురుషులు అన్నం నుంచే ఏర్పడతారు. జీవుడు అన్నరసమయం. అన్నం నుంచే సమస్త జీవరాశి పుట్టింది. ఈ విధంగా ఆత్మ సాక్షిగా ఉన్న బ్రహ్మ నుంచే సమస్త విశ్వం ఏర్పడింది. బ్రహ్మ జగత్తుకు కారణం అయితే జగత్తు కార్యమైంది. ఎలా బంగారం ఆభరణాలకు కారణమో, బ్రహ్మ ఈ విశ్వానికి కారణం. బంగారం ఆభరణాలలో అంతటా ఉంది కదా! ఇదే విధంగా ఈ కనిపిస్తున్న కార్య జగత్తులో కారణమైన బ్రహ్మ అనుస్యూతంగా అంతటా ఉంది.

అనంతమైన వస్తు ప్రపంచంలో అనంతంగా అద్వితీయంగా సద్రూపంలో (సత్తాగా) బ్రహ్మ ఉంది. ప్రతివస్తువుకు దానికి సంబంధించిన వృత్తి, ఎరుక

అవసరం. వస్తువుల వృత్తిలో మార్పు ఉంటుంది గాని ఎరుకలో (జ్ఞానంలో) మార్పు లేదు. ప్రతి వస్తువుకు నామం, రూపం, ఎరుకల్లో, ఎరుక మాత్రమే తీసుకుని మిథ్యారూపమైన నామరూపాలను త్యాగం చేస్తే (జహదజహలక్షణము ద్వారా) ఇక్కడ మనకి గోచరమయ్యే జగత్తంతా చిద్రూపమైన (ఎరుకగా) బ్రహ్మ ఉంది. కాబట్టి కారణ – బ్రహ్మగా ఈ సృష్టిలో సత్యం, జ్ఞానం, అనంతంగా ఉన్నాడు. ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి అనే ప్రశ్నకు సమాధానంగా **పంచకోశ వివేకం** ముందు వస్తున్నది.

ఒక కుండ మన ముందు ఉందంటే దానిని తయారు చేసిన కుమ్మరి ఉండాలి. కుమ్మరిలో ఉండే తెలివి, నైపుణ్యమే కుండకి కారణం. దీనిని నిమిత్తకారణం అంటాం. ఈ జగత్తుకు నిమిత్తకారణం బ్రహ్మ. ఆయన సంకల్పం, ప్రణాళిక ప్రకారమే ఈ జగత్తు ఏర్పడింది. అయితే నిమిత్త కారణం ఉంటే సరిపోదు. దానికి కావలిసిన ముడిసరుకు కావాలి. దీనిని ఉపాదానకారణం అంటారు. సృష్టికి కావల్సిన ముడిసరుకు ఎక్కడి నుంచి వస్తుంది? సృష్టికి ముందు బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు. **ఏకమేవాద్వితీయం బ్రహ్మ.** ఆయనే ముడి సరుకయ్యాడు, బంగారమే ఆభరణాలుగా రూపొందినట్టుగా. ఆభరణాలనుంచి బంగారాన్ని భిన్నంగా విడదీయలేం. అందుకే అభిన్నంగా జగత్తు అంతటా ఆ బ్రహ్మ జగత్కారణంగా ఉన్నాడు. బ్రహ్మ ఈ జగత్తుకు అభిన్న నిమిత్త ఉపాదానకారణం.

నాకో కలవచ్చిందనుకోండి. ఆ కలలో నాకు దూరంగా కొండలు, పొలాలు, ఆకాశం, మనుష్యులూ కన్పించారు. వీటికి కావల్సిన ముడిసరుకెక్కడిది? నాలోంచే ఈ కల కల్పించబడింది. అంటే నేనే ఈ కలకి ముడి సరుకయ్యాను. అలాగే ఈ కలకి రచన కూడ నానుంచే వచ్చింది. అంటే కలకి నిమిత్తకారణం, ఉపాదానకారణం నేనే. స్వప్నకాలంలో నేనే కల, కలే నేనూ అన్నట్టుగా ఉంది. అక్కడ నేనూ, కల అని రెండు లేవు. స్వప్నంలో నేను స్వప్నశరీరంతో వ్యవహారం చేసాను. నేను కలనుంచి విడిగా లేను. నా కలకి ముడి సరుకు ఆలోచనలు నా మనస్సు నుంచే ఉదయించాయి. నా కలకి నేనే ముడి సరుకు, నేనే రచన. అదే విధంగా జగత్తుకు బ్రహ్మ అభిన్న నిమిత్త ఉపాదానకారణమయ్యాడు.

## పంచ కోశవివేకం రెండవ అనువాకం నుంచి అయిదవ అనువాకాం వరకు

**ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి?** సమాధానంగా పంచకోశ వ్యాఖ్యానం జరగబోతోంది. ఇక్కడొక చక్కని మనోయానం ఆరంభమౌతోంది. సీటు బెల్టుస బిగించు కుందామా?

వేదాంతం పదే పదే – నువ్వు శరీరం కాదు, మనస్సు కాదు, బుద్ధి కాదు అనడం చూశాము. ఇదెలాగో సహేతుకంగాచూద్దాము. పంచకోశవివేకం ఈ రకమైన విశ్లేషణకి పెట్టింది పేరు. ముఖ్యంగా తైత్తిరీయ ఉపనిషత్తును ఈ విషయం అవగాహన చేసుకోడానికే అధ్యయనం చేస్తారు.

ఇది తెలుసుకొనే ముందు మనకి పంచకోశాలు అంటే ఏమిటో తెలియాలి. వాటి గురించి ఇంతకు ముందే తత్త్వబోధలో తెలుసుకున్నాం. వాటిని మరొకసారి క్లుప్తంగా గుర్తు చేసుకుందాం.

వేదాంతపరంగా మనకి మూడు శరీరాలున్నాయి. స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం.

స్థూలశరీరం – స్థూలశరీరమంటే బాహ్యంగా కనిపించే ఈ శరీరం అంటే కన్ను, ముక్కు, చెవులు, నోరు, కాళ్ళు, చేతులు మొదలైన బాహ్యమైన గోళకాలతోపాటు, లోపల వున్న గుండె, కాలేయం, మూత్రపిండాలు మొదలైన లోపలి భాగాలు. మొత్తం అనాటమీ అంతా స్థూలశరీరం.

సూక్ష్మశరీరం – ఇది సూక్ష్మంగా ఉంటుంది. మనకంటికి గోచరమయ్యేది కాదు. దీనిలో పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు ఉంటాయి.

పంచజ్ఞానేంద్రియాలు – కళ్ళు, ముక్కు, చెవులు, నాలుక, చర్మం. ఈ ఇంద్రియాలు సూక్ష్మంగా ఉంటాయి. ఇవి బయట మనకు కనబడే గోళకాలు కావు. ఈ ఇంద్రియాలకు వాటి వాటి అధిష్ఠాన దేవతలుంటారు. ఆ ఇంద్రియ దేవతల వల్ల బాహ్యంగా మన గోళకాలు పనిచేస్తాయి.

పంచ కర్మేంద్రియాలు – కాళ్ళు, చేతులు, నోరు, గుదం, జననేంద్రియం. ఇవి కూడా బయటకు మనకు కనబడే గోళకాలు కావు. ఈ ఇంద్రియాలకు కూడా వాటి వాటి అధిష్ఠానదేవతలు ఉంటారు. ఆ దేవతల వల్ల బాహ్యంగా మనగోళకాలు పనిచేస్తాయి.

పంచప్రాణాలు :- ప్రాణం -శ్వాస క్రియను, వ్యానం - రక్తప్రసరణ క్రియను, అపానం - విసర్జన క్రియను, సమానం - పచనక్రియను, ఉదానం - చనిపోయాక సూక్ష్మ కారణ శరీరాలను, శరీరం బయటకు పంపే క్రియను నిర్వర్తిస్తాయి. అంతే కాకుండా వమన క్రియ కూడా ఉదానం వల్లే జరుగుతుంది. నాలుగు అంతఃకరణాలు - మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం.

కారణశరీరం - ఇది బీజరూపంలో ఉంటుంది. దీని నుంచే స్థూల, సూక్ష్మ శరీరాలు పుడతాయి. కారణశరీరం వల్ల మనకి సుషుప్తి అవస్థ కలుగుతుంది.

ఈ మూడు శరీరాలను ఐదు కోశాలుగా వాటి వాటి విధులను బట్టి విభజించింది శాస్త్రం. అవి అన్నమయకోశం, ప్రాణమయ కోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం.

స్థూలశరీరమే అన్నమయ కోశం.

కారణశరీరమే ఆనందమయ కోశం.

సూక్ష్మశరీరం మూడు కోశాలుగా విభజన జరిగింది.

ప్రాణమయకోశం = పంచప్రాణాలు + పంచకర్మేంద్రియాలు,

మనోమయకోశం = పంచజ్ఞానేంద్రియాలు + మనస్సు(చిత్తం అహంకారంతో కూడినవి),

విజ్ఞానమయకోశం = పంచ జ్ఞానేంద్రియాలు + బుద్ధి(చిత్తం, అహంకారముతో కూడినవి).

ఈ పంచకోశాలు అంటే ఐదు వరలు అనుకోండి. కత్తికి వర ఉంటుందిగా అలాగ. వంటింట్లో గిన్నెలో గిన్నె సెట్టులా ఉంటాయిగా, అటువంటి ఐదు గిన్నెల సెట్టు అనుకోండి. పంచకోశవివేకంలో ఆత్మ ఎక్కడ ఉందో అని శోధన మొదలు పెడతాం. ఆత్మ అంటే నేనే. నేనెవరిని అనేదే ఈ శోధన. ఇది ఒక అంతర్యానం. ఇది భౌతిక యానం కాదు. వివేకంతో చేసే మానసిక ప్రయాణం.

దీనికి శాస్త్రం అరుంధతి నక్షత్ర న్యాయం వాడుతుంది. పెళ్ళిలో పెళ్ళికూతురికి, పెళ్ళికొడుకు అరుంధతి నక్షత్రం చూపించాలి. అది సప్త ఋషి మండలములో ఉంటుంది. ఈ సప్త ఋషిమండలం గాలిపటం ఆకారంలో ఉంటుంది. గాలిపటం ఆకారంలో ఉన్న సప్త ఋషిమండలంలో తోకవైపు మూడు నక్షత్రాలలో మధ్యనక్షత్ర పక్కన మినుకు మినుకు మంటూ అరుంధతి నక్షత్రం తక్కువ కాంతితో ఉంటుంది. నిజానికి అవి వశిష్ఠ, అరుంధతుల జంట నక్షత్రాలు.

బాగా స్ఫుటంగా కనిపించే ఒక్కొక్క నక్షత్రాన్ని చూపిస్తూ మెల్లగా వశిష్ఠ, అరుంధతి నక్షత్రాలను చూపిస్తాడు పెళ్ళి కొడుకు. పెళ్ళికూతురుకు ఒక్కో నక్షత్రాన్ని చూపిస్తూంటే అదే అరుంధతి అనే భ్రాంతికి లోనవుతుంది. పెళ్ళికొడుకు అది కాదు, అది కాదు అంటూ అరుంధతిని చూపిస్తాడు.

ఇదే పద్ధతిలో శాస్త్రం మన ధోరణిలోకి వచ్చి అన్నమయకోశమే ఆత్మ (నేను) అని మొదలు పెడుతుంది. మరి మనం ఈ శరీరమే నేను అనుకుంటున్నాం కదా! అదే ఆత్మ అనుకునే లోపల ఇది కాదు దీనికన్నా లోపల ఉంది ఆత్మ అంటుంది. దీనికన్నా లోపల అంటూ అలా ఒక కోశం తరువాత ఒక కోశం దాటుకుంటూ ఆత్మను తెలియజేస్తుంది.

దీనిని ఐదు మెట్లు ఎక్కడంతో పోల్చవచ్చు. ఒక స్టేజి చేరుకోవాలంటే ఐదు మెట్లు ఉన్నాయి అనుకుందాం. మొదటి మెట్టు అదే స్టేజి అన్నంత శ్రద్ధగా ఎక్కాలి. తరువాత దాని నుంచి రెండవ మెట్టు అంత శ్రద్ధగానూ ఎక్కాలి. అలా అంచలంచలుగా స్టేజి చేరుకుంటాం. ఆత్మ గురించి చేసే మానసిక అంతర్యానం ఇలాగే సాగుతుంది.

చిన్నప్పుడు ఒక కథ చెప్పేవారు. ఒక కోతికి ముల్లు గుచ్చుకుందిట. అది చాలా బాధపడుతుంటే దారేపోయే దానయ్య తన దగ్గర వున్న కత్తితో ఆ ముల్లు తీసాడు. ఆ తీయడంలో ముల్లు విరిగిపోయింది. ఆ కోతి నా ముల్లు విరగ్గొటావు. నాకు నా ముల్లు తెచ్చిపెట్టు అని పేచీ పెట్టింది. పాపం అతను ఏం చేయాలో తెలియక, ఇదిగో నా కత్తిని పరిహారంగా ఇస్తాను తీసుకో అన్నాడు.

కోతి ఆ కత్తి తీసుకుని వెళుతోంటే దారిలో కట్టెలు కొట్టే అతను విచారంగా ఉన్నాడు. కోతి ఏమైంది అని అడిగింది. కట్టెలు కొట్టే అతను నా కత్తి విరిగి పోయిందని చెప్పాడు. వెంఠనే తన కత్తి అతనికిచ్చింది. దానితో అతను చాలా కట్టెలు కొట్టాడు. అకస్మాత్తుగా ఆ కత్తి కూడా విరిగి పోయింది. వెంఠనే నా కత్తి నాకు కావాలి అని కోతి పేచీ మొదలు పెట్టింది. అతను గత్యంతరం లేక తన కట్టెలలో కొన్ని కట్టెలు పరిహారంగా కోతికిచ్చాడు. ఆ కట్టెలు తీసుకొని బయలుదేరింది కోతి.

దారిలో ఒక ముసలవ్వ ఏడుస్తోంది. ఎందుకేడుస్తున్నావు అవ్వా! అంటే నా దగ్గర రొట్టె చేసే పిండి ఉంది కాని కట్టెలు లేవు అంది. వెంఠనే కోతి తన కట్టెలని ముసలి అవ్వకి ఇచ్చింది. అవ్వ గబ గబా రొట్టెలు కాల్చింది. ఏముందీ

కట్టెలన్నీ బూడిద పాలయ్యాయి. కోతి వెంఠనే నా కట్టెలు నా కిస్తావా లేదా అని పేచీ మొదలు పెట్టింది. వేరే దారి లేక అవ్వ తన దగ్గరున్న రొట్టెలు కొన్ని కోతి కిచ్చింది.

అవి పుచ్చుకుని బయదేరుతుంటే ఒకచోట దంపతులు, యుక్తవయస్సులో ఉన్న పిల్ల, దుఃఖంతో కనిపించారు. కారణం అడిగితే వారికి బాగా ఆకలిగా వుంది కాని దారిలో ఎక్కడా సత్రమనేది కనబడటం లేదు అన్నారు. వెంఠనే కోతి వాళ్ళకి తన రొట్టెలిచ్చి వారి ఆకలి తీర్చింది. వారు కోతికి ధన్యవాదాలు చెప్పి బయలుదేరబోతూంటే నా రొట్టెలు నాకు కావాలని పేచీ పెట్టుకుంది. ఆ దంపతులు కోతికి వారి అమ్మాయినిచ్చారు.

ఆ అమ్మాయి నాకు ఆభరణాలు కావాలి, సెంట్లు కావాలి, నాకిది కావాలి, అది కావాలని సతాయించడం మొదలు పెట్టింది. ఇంతలో ఒకతను డోలు వాయించుకుంటూ అటుగా వచ్చాడు. కోతి అతను ఎక్కడికి వెడుతున్నాడని వాకబు చేసింది. అతను పెళ్ళి చేసుకుందామని తగిన వధువుకోసం పట్నం వెడుతున్నాడని తెలుసుకుంది. వెంఠనే తన దగ్గర ఉన్న అమ్మాయిని పెళ్ళి చేసుకోమంది కోతి. అతను సరేనని కన్యాశుల్కంగా డోలిచ్చాడు. ఆ డోలు తీసుకుని ఇలా పాడ సాగింది.

ముల్లు పోయి కత్తి వచ్చె ఢాం ఢాం ఢాం!
కత్తి పోయి కట్టె వచ్చె ఢాం ఢాం ఢాం!
కట్టె పోయి రొట్టె వచ్చె ఢాం ఢాం ఢాం!
రొట్టె పోయి పిల్ల వచ్చె ఢాం ఢాం ఢాం!
పిల్ల పోయి డోలు వచ్చె ఢాం ఢాం ఢాం!

సరిగ్గా మన ఆత్మ శోధన ప్రయాణం అలాగే ఉంటుంది. ముందు అన్నమయం ఆత్మ అంటుంది ఉపనిషత్తు.

ఆ తరువాత ఇది ఆత్మ కాదు ప్రాణమయం ఆత్మ అంటుంది అలా ఒక్కొక్క కోశాన్ని దాటుకుంటూ ఆత్మ ఏమిటో తెలుసుకుంటాం. అలా అతి స్థూలమైన దానినుంచి అతి సూక్ష్మమైన దానికి ప్రయాణం చేస్తాం. ఇప్పుదు మంత్రంలో ఏముందో చూద్దాం.

## అనువాకం -2

స వా ఏష పురుషో౭_న్నరసమయః। తస్యేదమేవశిరః। అయం దక్షిణ పక్షః। అయముత్తరః పక్షః। అయమాత్మా। ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే। యాః కాశ్చ పృథివీగ్‌శ్రితాః। అథో అన్నేనైవ జీవంతి। అథైనదపియంత్యన్తతః। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సరౌషధముచ్యతే। సర్వం వై తే౭_న్నమాప్నువంతి। యే౭_న్నంబ్రహ్మోపాసతే। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। అన్నాద్భూతాని జాయన్తే। జాతాన్యన్నేన వర్ధంతే। అద్యతే౭_త్తిచ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి।

తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యో౭_న్తర ఆత్మా ప్రాణమయః। తేనైషపూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రాణ ఏవ శిరః। వ్యానో దక్షిణః పక్షః।అపాన ఉత్తరః పక్షః। ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

ప్రాణం దేవా అనుప్రాణన్తి। మనుష్యా పశవశ్చ యే। ప్రాణోహి భూతానా మాయుః। తస్మాత్సర్వాయుషముచ్యతే। సర్వమేవ త ఆయుర్యంతి। యే ప్రాణం బ్రహ్మోపాసతే। ప్రాణో హి భూతానా మాయుః। తస్మాత్సర్వాయుషముచ్యత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।

**1. అన్నమయమే ఆత్మ**

**స వా ఏష పురుషో౭_న్నరసమయః।**

పంచకోశవివేకాన్ని ఐదు మెట్ల స్టేజిగా వర్ణించాము. **మొదటిమెట్టు అన్నమయము.** ఇది అన్నంతో చేయబడింది. అన్నము అంటే పంచభూతాలు. లేదా భౌతికమైన రసాయనాలు. బయట కన్పించే రసాయనాలన్నీ నా లోపల కూడా ఉన్నాయి. కార్బను, ఐరను, పొటాషియము మొదలైనవి బయటా వున్నాయి, లోపలా ఉన్నాయి. శరీరంలో ఐరను తగ్గితే ఆకుకూరలు తినమంటారు.

ఆ విధంగా బయటవున్న సమస్తమూ లోపల కూడా వున్నాయి. బయట కనిపించే పంచభూతాలు నాలోనూ ఉన్నాయి.

**తస్యేదమేవశిరః। అయం దక్షిణ పక్షః। అయముత్తర పక్షః। అయమాత్మా। ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా।**

ఈ అన్నమయము పురుష ఆకారంలో ఉంది. దాని తల ఇదిగో, దక్షిణం – కుడిచేయి, ఉత్తరం – ఎడమచేయి, మధ్య ఆకాశం, ఉదర భాగం ఆత్మ. ఇక్కడ ఆత్మ అంటే సచ్చిదానంద పరమాత్మ కాదు, అన్నమయం. ఉపనిషత్తు అభినయం చేస్తూ ఆ భాగాలన్నీ చూపిస్తోంది.

**తదప్యేష శ్లోకో భవతి।**

ఈ విధమైన అన్నమయం గురించి ఋక్ మంత్రము ఇలా చెబుతోంది.

**అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే। యాః కాశ్చ పృథివీగ్ శ్రితాః। అథో అన్నేనైవ జీవంతి। అథైనదపియంత్యన్తతః। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సరౌషధముచ్యతే। సర్వం వై తేఽ న్నమాప్నువంతి। యేఽ న్నంబ్రహ్మోపాసతే। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। అన్నాద్భూతాని జాయన్తే। జాతాన్యన్న వర్ధంతే। అద్యతేఽ త్తిచ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి।**

**అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే। యాః కాశ్చ పృథివీగ్ శ్రితాః। అథో అన్నేనైవ జీవంతి। అథైనదపియంత్యన్తతః।**

ఇందులో మొదటగా అన్నమయమే ఆత్మ అని ఉపనిషత్తు మన స్థాయికి దిగి వచ్చి మాట్లాడుతోంది. ఇది మొదటి మెట్టు. అన్నమయం అనే మెట్టు మీద ఉన్నాం. ఈ భూమిలోని సమస్త జీవరాశి అన్నం నుంచే పుట్టాయి. అన్నం వల్లే పోషించబడతాయి. మళ్ళీ అన్నంలోనే లయమౌతాయి. అన్నం **కారణం,** అన్నమయం అన్నం నుంచి ఉత్పన్నమైంది. కనుక జీవరాశి అంతా అన్నం నుంచే పుడుతున్నాయి. అన్నం వల్లే వృద్ధి పొందుతున్నాయి. మరణానంతరం మట్టిలో కలిసిపోతాయి. అంటే వ్యష్టి అన్నమయం సమష్టి అన్నంలో కలిసి పోతుంది. అన్నం నుంచి పుట్టింది, అన్నంవల్ల వృద్ధి పొందింది, అన్నంలోనే లయమౌతుంది.

**అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సరౌషధముచ్యతే। సర్వం వై తేఽ_న్నమాప్నువంతి।**

**యేఽ_న్నంబ్రహ్మోపాసతే। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే।**

అన్నం కారణం కాబట్టి అన్నం మొదట పుట్టింది. అన్నమయం కన్నా ముందు పుట్టింది అన్నం. అన్నం **జ్యేష్ఠం**. అన్నం సమష్టి అంతటా వుంది. అంతటా వుంది కనుక అన్నం **బ్రహ్మ**. ఇది **ఔషధం** కూడా. ఓష అంటే అగ్ని, ధం చల్లార్చేది. ఔషధం అంటే మనలోని వైశ్వానరాగ్నిని చల్లారుస్తుంది. అందుకనే దీన్ని **సర్వ ఔషధం** అంటారు. అన్నమయంకు అన్నం కారణం, జ్యేష్ఠం, బ్రహ్మ ఇంకా ఔషధం కూడా.

**అన్నాద్భూతాని జాయన్తే। జాతాన్యన్నేన వర్ధంతే।**

ఈ విధంగా సమష్టి అన్నంను వ్యష్టి అన్నమయంలో ఉపాసన చేయ్యాలి. రెండూ ఒకటే అని ఉపాసన చేయ్యాలి. ఉపాసన చేయ్యాలంటే అన్నం మహిమ తెలియాలి. కారణత్వం, బ్రహ్మత్వం, జ్యేష్ఠత్వం, ఔషధత్వం మహిమలతో ఉన్న అన్నాన్ని అన్నమయంలో రెండూ ఒకటే అన్న భావనతో ఉపాసన చేయ్యాలి. అన్నం సముద్రమైతే అన్నమయం ఒక అలలాంటిది. నీరు రూపంలో రెండూ ఒకటే. దీని వల్ల దేహ అభిమానం తగ్గి మృత్యుభయం పోతుంది. సకాముకంగా ఉపాసన చేసిన వానికి, అన్నమే బ్రహ్మ అని ఉపాసనచేసిన వానికి, అన్నాన్ని తృణీకార భావంతో చూడని వానికి, అన్నవృద్ధి ఉంటుంది. అన్నానికి లోటు వుండదు. నిష్కామంగా ఉపాసన చేసినవానికి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యత కలుగుతాయి. అన్నమయం మీద అభిమానం తగ్గుతుంది.

**అద్యతేఽ_త్తి చ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి।**

అత్తి అంటే తింటుంది అద్యతి అంటే తినబడుతుంది అని అర్థం. అన్నం మనచే తినబడుతుంది. ఒక కాలంలో మనను తింటుంది కూడా. ఇది అన్నం నిర్వచనం. మనం అన్నాన్ని తింటాం అది మనకి తెలిసినదే అన్నం మనని తినటమేమిటి? మరణానంతరం భౌతికశరీరం పంచభూతాలలో కలిసిపోతుంది. అంటే అన్నంలో కలిసి పోతుంది. అన్నం దాన్ని తిన్నదన్నమాట. అంతేకాదు జీవించిన కాలంలో అన్నం మనని తింటుంది. డయాబిటీస్, అసిడిటీ లాంటి రోగాలు వస్తే అన్నం మనని తింటుంది. ఎక్కువ ఉపవాసాలు చేస్తే కడుపులోని

సున్నితమైనపొర కాలిపోయి అల్సర్లు వస్తాయి. ఇవన్నీ అన్నం మనని తినడం అన్నమాట. కాబట్టి అన్నాన్ని తూలనాడవద్దు. అన్నం పరబ్రహ్మ.

**తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః। తేనైషపూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః । తస్య ప్రాణ ఏవ శిరః। వ్యానో దక్షిణః పక్షః।అపాన ఉత్తరః పక్షః। ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

**2. ప్రాణమయమే ఆత్మ**

**తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః।**

ఈ అన్నమయం నుంచి భిన్నంగా ఉంది ఆత్మ. అది ఇంకా లోపల సూక్ష్మంగా ఉంది. దాని పేరు ప్రాణమయం. అన్నమయం ఆత్మ కాదని ఉపనిషత్తు తేల్చి చెప్పేసింది. అన్నమయం ఆత్మ కాదంటే అది అనాత్మ. అన్నమయం ఆత్మ అన్నంత వరకూ అన్నమయం కోశం కాదు. ఇప్పుడు అనాత్మగా చెప్పబడింది కనుక అన్నమయకోశం అయింది. ఇది జడం. దీనిని అన్నమయ **అనాత్మత్వ నిశ్చయం** అంటారు.

**ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః।** ఆత్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు. ఈ విధంగా సృష్టి అంతా వచ్చింది. ఆత్మ కారణం, అనాత్మ ప్రపంచమంతా కార్యం. ఇప్పుడు అన్నమయం అనాత్మ కనుక అది కార్యమైంది. దీనిని అన్నమయ **కార్యత్వ నిశ్చయం** అంటారు.

ఏ కార్యమైనా నామరూపాలతో ఉంటుంది. దీనిని అన్నమయ **నామరూపత్వ నిశ్చయం** అంటారు.

నామ రూపాత్మకమైనదంతా పదార్థంగా లేదు. కేవలం నామం, రూపం మాత్రమే ఉన్నాయి. నెక్లెస్ అనే పదార్థం లేదు. పదార్థం బంగారం. టీపాయ్ అనే పదార్థం లేదు. పదార్థం చెక్క. నామారూపాలకి యదార్థం లేదు. అవి మిథ్య మాత్రమే. ఒక కాలంలో ఉండి మరొక కాలంలో అంతరించేవే. దీనిని అన్నమయ **మిథ్యాత్వ నిశ్చయం** అందాం. అంటే మన శరీరం మిథ్య. భ్రాంతి జన్యమైనది.

సత్యంగా లేదు. ఇప్పుడు అన్నమయం ఆత్మ కాదు జడం. అన్నమయం ఒక కోశము. ఇది కేవలం నామమాత్రంగానే ఉంది. అన్నమయం ఉన్నా లేనట్టే.

ఒకామె అరువు సొమ్ముతో ఒక విందుకొచ్చింది. ఈ నగలతో నువ్వు చాలా అందంగా వున్నావన్నారు. అంటే అందంగా వుండడమనేది నగలు తెచ్చిన అర్హత. ఆమెది కాదు. అలాగే అన్నమయానికి దాని మహిమంతా ఆత్మ వల్లే వచ్చింది. సత్యత్వ దృష్టితో అన్నమయాన్ని తోసి పుచ్చాలి. దీనిని ప్రాణమయంలో లయం చేద్దాం. ఈ ప్రక్రియను **ప్రవిలాపనము** అంటారు.

ఇదే మాదిరిగా సత్యత్వ దృష్టితో అన్నాన్ని కూడా జడంగా తోసి పుచ్చాలి. అన్నాన్ని ప్రాణంలో లయం చేద్దాం. ఈ ప్రక్రియ కూడా ప్రవిలాపనమే. వ్యష్టి లయంతో పాటుగా సమష్టి లయం కూడా చేయాలి.

అన్నమయ ఆత్మను అన్నమయకోశంగా తేల్చడానికి ఐదు కారణాలు చూశాము. అవి అనాత్మత్వ నిశ్చయం, కార్యత్వ నిశ్చయం, నామరూపత్వనిశ్చయం, మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం. **ఇప్పుడు మనం కాలు రెండవ మెట్టుమీద పెడుతున్నాం. ప్రాణమయమే ఆత్మ అంటోంది ఉపనిషత్తు!**

**తేనైషపూర్ణః స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః**

ప్రాణమయంతో అన్నమయకోశం నిండి ఉంది. ఈ ప్రాణమయానికి స్వతహాగా ఆకారం లేదు. నీరు ఏ గిన్నెలో పోస్తే నీటికి ఆ ఆకారం వచ్చినట్టుగా, ప్రాణమయం అన్నమయంలో ఉండటం వల్ల ఇది కూడా అన్నమయం లాగే పురుష ఆకారంలో ఉంది.

**తస్య ప్రాణ ఏవ శిరః  వ్యానో దక్షిణః పక్షః అపాన ఉత్తరః పక్షః  ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా।**

ప్రాణమయం భాగాలు ఇలా ఉన్నాయి.

ఈ ప్రాణమయం పురుష ఆకారంలో ఉంది. దాని తల ప్రాణం, దక్షిణంగా ఉన్న కుడిచేయి వ్యానం, ఉత్తరంగా ఉన్న ఎడమచేయి అపానం, మధ్యగా ఉన్న ఉదర భాగం ఆకాశం. ఇక్కడ ఆకాశం అంటే ఉదర ఆకాశం, అంటే సమానం. పృథివీ దేవత దీనికి ఆధారం. నవరంధ్రాల తిత్తిలో ఈ వాయువులు బయటకి

పోకుండా సంచరిస్తూ ఉన్నాయంటే పృథివీ దేవత చలవ వల్లే.

**తదప్యేష శ్లోకో భవతి।**

ఈ విధమైన ప్రాణమయం గురించి ఋగ్ మంత్రం ఇంకా ఇలా చెబుతోంది.

**ప్రాణం దేవా అనుప్రాణన్తి। మనుష్యా పశవశ్చ యే। ప్రాణోహి భూతానా మాయుః। తస్మాత్సర్వాయుషముచ్యతే। సర్వమేవ త ఆయుర్యంతి। యే ప్రాణం బ్రహ్మోపాసతే। ప్రాణో హి భూతానా మాయుః। తస్మాత్సర్వాయుషముచ్యత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

**ప్రాణం దేవా అనుప్రాణన్తి। మనుష్యా పశవశ్చ యే। ప్రాణోహి భూతానా మాయుః। తస్మాత్సర్వాయుషముచ్యతే।**

మనుష్యులు, పశువులు ప్రాణంవల్లే జీవిస్తున్నాయి. ప్రాణమే జీవజాలానికి ఆయుష్షు. అదే జీవం. అందుకే ప్రాణాన్ని **సర్వాయుషం** అంటారు. ప్రాణం సముద్రమైతే ప్రాణమయం ఒక అలలాంటిది. రెండూ ఒకటే.

**సర్వమేవ త ఆయుర్యంతి। యే ప్రాణం బ్రహ్మోపాసతే। ప్రాణో హి భూతానా మాయుః।**

ప్రాణమే బ్రహ్మ అని, సమష్టి ప్రాణాన్ని వ్యష్టి ప్రాణంలో ఉపాసన చేసినవారికి, సంపూర్ణ ఆయుర్దాయం ఉంటుంది. సకామ ఉపాసకునకు ప్రయోజనం చెప్పబడింది. నిష్కామ ఉపాసకునకు చిత్త శుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యం కలుగుతాయి.

**తస్మాత్సర్వాయుషముచ్యత ఇతి। తస్యై ష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

కాబట్టి ప్రాణంను సర్వాయుషం అన్నారు. ఇదే ఈ ప్రాణమయం ఆత్మ. ఇది శరీరంలో ఇంతకు ముందు చెప్పిన అన్నమయకోశంలో ఉంది.

**అనువాకం – 3**

**తస్మాద్వా ఏతస్మాత్ ప్రాణమయాత్।అన్యోఽన్తర ఆత్మా మనోమయః। తేనైషపూర్ణః। స వా ఏష పురుష విధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః। తస్య**

**యజురేవ శిరః ఋగ్దక్షిణ పక్షః। సామోత్తరఃపక్షః ఆదేశ ఆత్మా। అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

**3. మనోమయమే ఆత్మ**

**తస్మాద్వా ఏతస్మాత్ ప్రాణమయాత్।అన్యోఽన్తర ఆత్మా మనోమయః**

ఈ ప్రాణమయం నుంచి భిన్నంగా ఉంది ఆత్మ. అది ఇంకా లోపల సూక్ష్మంగా ఉంది. దాని పేరు మనోమయం. ప్రాణమయం ఆత్మ కాదని ఉపనిషత్తు తేల్చి చెప్పేసింది. ప్రాణమయం ఆత్మ కాదంటే అది అనాత్మ. ప్రాణమయం ఆత్మ అన్నంత వరకూ ప్రాణమయం కోశం కాదు. ఇప్పుడు అనాత్మగా చెప్పబడింది కనుక ప్రాణమయకోశం అయింది. ఇది జడం. దీనిని ప్రాణమయ **అనాత్మత్వ నిశ్చయం** అంటారు.

**ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్య పృథివీ। పృథివ్యా ఓషధయః।**

ఆత్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు. ఈ విధంగా సృష్టి అంతా వచ్చింది. ఆత్మ కారణం, అనాత్మ ప్రపంచమంతా కార్యం. ఇప్పుడు ప్రాణమయం అనాత్మ కనుక అది కార్యమైంది. దీనిని ప్రాణమయ **కార్యత్వ నిశ్చయం** అంటారు.

ఏ కార్యమైనా నామరూపాలతో ఉంటుంది. దీనిని ప్రాణమయ **నామరూపత్వ నిశ్చయం** అంటారు. నామరూపాత్మక మైనదంతా పదార్థంగా లేదు. కేవలం నామం రూపం మాత్రమే ఉన్నాయి.

నెక్లెస్ అనే పదార్థం లేదు. పదార్థం బంగారం. టీపాయ్ అనే పదార్థం లేదు. పదార్థం చెక్క. నామారూపాలకి యదార్థం లేదు. అవి మిథ్య మాత్రమే. ఒక కాలంలో ఉండి మరొక కాలంలో అంతరించేవే. దీనిని ప్రాణమయ **మిథ్యాత్వ నిశ్చయం** అంటారు. అంటే మన శరీరం మిథ్య. భ్రాంతి జన్యమైనది. సత్యంగా లేదు.

ఇప్పుడు ప్రాణమయం ఆత్మ కాదు జడం. ప్రాణమయం ఒక కోశము. ఇది కేవలం నామమాత్రం గానే ఉంది. ఉన్నా లేనట్టే. ఇంతకు ముందు చెప్పినట్టుగా అరువు సొమ్ముతో ఒక విందుకొచ్చినామెను, ఈ నగలతో నువ్వు చాలా అందంగా

ఉన్నావన్నారు. అంటే అందంగా వుండడమనేది నగలు తెచ్చిన అర్హత. ఆమెది కాదు. అలాగే ప్రాణమయానికి దాని మహిమంతా ఆత్మ వల్లే వచ్చింది. సత్యత్వ దృష్టితో ప్రాణమయాన్ని తోసి పుచ్చాలి. దీనిని మనోమయములో లయం చేద్దాం. ఈ ప్రక్రియను **ప్రవిలాపనము** అంటారు.

ప్రాణమయ ఆత్మను ప్రాణమయకోశంగా తేల్చడానికి ఐదు కారణాలు చూశాం. అవి అనాత్మత్వ నిశ్చయం, కార్యత్వ నిశ్చయం, నామరూపత్వ నిశ్చయం, మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం. **ఇప్పుడు మనం కాలు మూడవ మెట్టుమీద పెడుతున్నాం. మనోమయమే ఆత్మ అంటోంది ఉపనిషత్తు!**

**తేనైషపూర్ణః। స వా ఏష పురుష విధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః ।**

ఈ మనోమయం కూడా ప్రాణమయం లాగే పురుష ఆకారంలో ఉంది.

**తస్య యజురేవ శిరః। ఋగ్దక్షిణ పక్షః। సామోత్తరఃపక్షః। ఆదేశ ఆత్మా। అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా।**

మనోమయం భాగాలు ఇలావున్నాయి. ఈ మనోమయము పురుష ఆకారములో ఉంది. మనోమయంకు కూడా ఆకారం లేదు. ప్రాణమయ పురుషాకారమే దీనికి కూడా వస్తుంది. దాని తల యజుర్వేదం దక్షిణంగా ఉన్న కుడిచేయి ఋగ్వేదం ఉత్తరంగా ఉన్న ఎడమచేయి సామవేదం, మధ్యగా ఉన్న ఉదర భాగం విధి, నిషేధాలతో కూడిన వేదపూర్వక ఆదేశాలు, అథర్వవేదం దీనికి ఆధారం. యజ్ఞంలో అథర్వ వేదం ఋత్విక్కులను బ్రహ్మ అంటారు. వీరి పర్యవేక్షణలో యజ్ఞం నిర్వర్తించ బడుతుంది. వీరే దీనికి ఆధారం.

**తద ప్యేష శ్లోకో భవతి।**

ఈ విధమైన మనోమయం గురించి ఋక్ మంత్రం ఇంకా ఇలా చెబుతోంది.

### అనువాకం - 4

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కదాచనేతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ।**

సమష్టి మనస్సు అంటే హిరణ్యగర్భుని దగ్గరకు మాటలు, మనసు చేరుకోలేక తిరిగి వస్తాయి. వ్యష్టి మనస్సు తెలుసుకోవడమే కష్టం అంటే సమష్టి మనస్సు విషయం చెప్పేదేముంది.

**ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కదాచనేతి।**

సమష్టి మనస్సు సముద్రమైతే మనోమయం ఒక అలలాంటిది. నీరుగా రెండూ ఒకటే. మనస్సే బ్రహ్మ అని, సమష్టి మనస్సును (హిరణ్యగర్భను) వ్యష్టి మనస్సులో ఉపాసనచేసినవారికి, మరణానంతరం బ్రహ్మలోక ప్రాప్తి లభించి బ్రహ్మానందాన్ని పొందుతారు. ఏకాలంలోను భయం, అభద్రత ఉండవు. సకామ ఉపాసకునకు ఈ ప్రయోజనం చెప్పబడింది. నిష్కామ ఉపాసకునకు చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యం కలుగుతాయి.

**తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

ఇదే ఈ మనోమయమే ఆత్మ. ఇది శరీరంలో ఇంతకు ముందు చెప్పిన ప్రాణమయ కోశంలో ఉంది.

**అనువాకం - 5**

**తస్మాద్వా ఏతస్మాన్మనోమయాత్। అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః। తేనైషపూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య శ్రద్ధైవ శిరః। ఋతం దక్షిణః పక్షః। సత్యముత్తరః పక్షః। యోగ ఆత్మా। మహః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

**విజ్ఞానం యజ్ఞం తనుతే। కర్మాణి తనుతేఽపి చ। విజ్ఞానం దేవాస్సర్వే। బ్రహ్మ జ్యేష్ఠముపాసతే। విజ్ఞానం బ్రహ్మచేద్వేద। తస్మాచ్చేన్న ప్రమాద్యతి। శరీరే పాప్మనో హిత్వా। సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా।యః పూర్వస్య।**

**తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్। అన్యోఽన్తర ఆత్మాఽఽనన్దమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః। తస్య**

**ప్రియ మేవ శిరః। మోదో దక్షిణః పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

**4. విజ్ఞానమయమే ఆత్మ**

**తస్మాద్వా ఏతస్మాన్మనోమయాత్। అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః।**

ఈ మనోమయం నుంచి భిన్నంగా ఉంది ఆత్మ. అది ఇంకా లోపల సూక్ష్మంగా ఉంది. దాని పేరు విజ్ఞానమయం. మనోమయం ఆత్మ కాదని ఉపనిషత్తు తేల్చి చెప్పేసింది.

మనోమయం ఆత్మ కాదంటే అది అనాత్మ. మనోమయం ఆత్మ అన్నంత వరకూ మనోమయం కోశం కాదు. ఇప్పుడు అనాత్మగా చెప్పబడింది కనుక మనోమయకోశం అయింది. ఇది జడం. దీనిని మనోమయ **అనాత్మత్వ నిశ్చయం** అంటారు. దాని తరువాత ఇంతకు ముందు మాదిరే **కార్యత్వ నిశ్చయం, నామరూపత్వ నిశ్చయం,మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం చేయాలి.** సత్యత్వ దృష్టితో ప్రాణమయాన్ని తోసి పుచ్చాలి. దీనిని మనోమయంలో లయం చేసాం. మనోమయ ఆత్మను మనోమయకోశంగా తేల్చడానికి ఐదు కారణాలు చూశాం. అవి అనాత్మత్వ నిశ్చయం, కార్యత్వ నిశ్చయం, నామరూపత్వ నిశ్చయం, మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం. **ఇప్పుడు మనం కాలు నాల్గవ మెట్టుమీద పెడుతున్నాం. విజ్ఞానమయమే ఆత్మ అంటోంది ఉపనిషత్తు!**

**తేనైషపూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః।**

ఈ విజ్ఞానమయం పురుష ఆకారంలో ఉంది.

**తస్య శ్రద్ధైవ శిరః।ఋతం దక్షిణః పక్షః। సత్యముత్తరః పక్షః। యోగ ఆత్మా। మహః పుచ్ఛం ప్రతిష్ఠా।**

దాని తల శ్రద్ధ ఇదిగో దక్షిణంగా ఉన్న కుడిచేయి ఋతం, ఉత్తరంగా ఉన్న ఎడమ చేయి సత్యం, మధ్యగా ఉన్న ఉదర భాగం యోగం లేదా చిత్త ఏకాగ్రత. హిరణ్యగర్భ దీనికి ఆధారం.

**తదప్యేష శ్లోకో భవతి।**

ఈ విధమైన విజ్ఞానమయం గురించి ఋక్ మంత్రం ఇంకా ఇలా చెబుతోంది.

**విజ్ఞానం యజ్ఞం తనుతే। కర్మాణి తనుతేఽపి చ। విజ్ఞానం దేవాస్సర్వే। బ్రహ్మ జ్యేష్ఠముపాసతే। విజ్ఞానం బ్రహ్మచేద్వేద। తస్మాచ్చేన్న ప్రమాద్యతి। శరీరే పాప్మనో హిత్వా। సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య। విజ్ఞానం యజ్ఞం తనుతే। కర్మాణి తనుతేఽపి చ। విజ్ఞానం దేవాస్సర్వే। బ్రహ్మ జ్యేష్ఠముపాసతే।** మనస్సు కన్న సూక్ష్మమైనది బుద్ధి. నిర్ణయం చేసేది బుద్ధి. విజ్ఞానమయం బుద్ధితోకూడినది. యజ్ఞం చెయ్యాలన్నా, కర్మలు చెయ్యాలన్నా విజ్ఞానం కావాలి. సమష్టి విజ్ఞానం వ్యష్టి కన్నా మొదటిది, జ్యేష్ఠమైనది.

**విజ్ఞానం బ్రహ్మచేద్వేద। తస్మాచ్చేన్న ప్రమాద్యతి। శరీరే పాప్మనో హిత్వా। సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతి।** ఈ సమష్టి విజ్ఞానమే బ్రహ్మ. దీనిని ఏకాగ్రతతో వదలకుండా ఉపాసన చేసిన వానికి ఈ దేహంలోని పాపాలు పోయి, అతని కోరికలన్నీ తీరుతాయి. ఇది సకామ ఉపాసకుడికి చెప్పిన ఫలము. నిష్కామ ఉపాసకునకు చిత్త శుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త వైశాల్యం కలుగుతాయి.

**తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।** ఈ విజ్ఞానమయ ఆత్మ శరీరంలో ఉంది. ఇది శరీరి.

**తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్। అన్యోఽన్తర ఆత్మాఽఽనన్దమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః। తస్య ప్రియ మేవ శిరః। మోదో దక్షిణః పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

**5. ఆనందమయమే ఆత్మ**

**తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్। అన్యోఽన్తర ఆత్మాఽఽనన్దమయః।**

**ఆనందమయమే ఆత్మ. అదే నేను.** ఈ విజ్ఞానమయం నుంచి భిన్నంగా ఉంది ఆత్మ. అది ఇంకా లోపల సూక్ష్మంగా ఉంది. దాని పేరు ఆనందమయం. విజ్ఞానమయం ఆత్మ కాదని ఉపనిషత్తు తేల్చి చెప్పేసింది.

విజ్ఞానమయం ఆత్మ కాదంటే అది అనాత్మ. విజ్ఞానమయం ఆత్మ అన్నంత వరకూ విజ్ఞానమయం కోశం కాదు. ఇప్పుడు అనాత్మగా చెప్పబడింది కనుక విజ్ఞానమయము కోశం అయింది. ఇది జడం. దీనిని విజ్ఞానమయ **అనాత్మత్వ నిశ్చయం** అంటారు.

దాని తరువాత ఇంతకు ముందు మాదిరే **కార్యత్వ నిశ్చయం, నామరూపత్వ నిశ్చయం, మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం.** సత్యత్వ దృష్టితో విజ్ఞానమయాన్ని తోసి పుచ్చాలి. దీనిని ఆనందమయంలో లయము చేసాం. విజ్ఞానమయ ఆత్మను విజ్ఞానమయకోశంగా తేల్చడానికి ఐదు కారణాలు చూశాం. అవి అనాత్మత్వ నిశ్చయం, కార్యత్వ నిశ్చయం, నామరూపత్వ నిశ్చయం, మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం. **ఇప్పుడు మనం కాలు ఐదవ మెట్టు, ఆఖరి మెట్టుమీద పెడుతున్నాం. ఆనందమయమే ఆత్మ అంటోంది ఉపనిషత్తు!**

**తేనైష పూర్ణః స వా ఏష పురుషవిధఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః** ఈ ఆనందమయం పురుష ఆకారంలో ఉంది.

**తస్య ప్రియ మేవ శిరః। మోదో దక్షిణ పక్షః। ప్రమోద ఉత్తర పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా।**

దాని తల ప్రియం, దక్షిణంగా ఉన్న కుడిచేయి మోదం, ఉత్తరంగా ప్రమోదం.

**తదప్యేష శ్లోకో భవతి।**

ఈ విధమైన ఆనందమయం గురించి ఋక్ మంత్రము ఇంకా ఇలా చెబుతోంది.

ప్రియ, మోద, ప్రమోదాలు – ఏదైనా మనం బాగా ఇష్టపడే వస్తువు మనకి కనపడితేనే ఆనందం, దీనిని ప్రియం అంటారు. ఆ వస్తువును మనం తెచ్చుకుంటే కలిగే ఆనందం మోదం. అది అనుభవించేటప్పుడు కలిగే ఆనందం

ప్రమోదం. ఉదాహరణకు నాకు మామిడి పండు అంటే ఇష్టం అనుకుందాం. మార్కెట్లో మామిడి పండును చూడగానే కలిగే ఆనందం ప్రియం. మామిడి పండు కొనుక్కుని ఇంటికి తెచ్చుకుంటే కలిగే ఆనందం మోదం. దానిని తిని అనుభవిస్తే కలిగే ఆనందం ప్రమోదం. ప్రియ, మోద ప్రమోదాలు కోశ ఆనందాలు.

ఆనందమయంలో మూడు భాగాలే తీసుకోవాలి. అవి ప్రియ, మోద, ప్రమోదాలు.

మనకి వ్యవహారంలో లభించే ఆనందం – కోశానందం. ఇది ఒక కాలంలో వచ్చి మరొక కాలంలో సమసి పోతుంది. కోశానందంలో స్థాయీ భేదముంది. అవి ప్రియ, మోద, ప్రమోదాలు. కోశానందం ప్రతిబింబానందం. అసలు ఆనందం కాదు. పరిమితి కలది. కోశానందం తప్ప మరే ఆత్మానందం అనుభవములోకి రాదు.

**ఆనందమే ఆత్మ**

ఆనంద ఆత్మ – ఆనందం ఆత్మ. ఆనందానికి–మయ కలపలేదు. మయట్ అంటే వికారాలు (మార్పు చెందేది)ఉన్నది అని అర్థం. ఆనందమయంలో స్థాయీ భేదాన్నాయి. అనుభవంలోకి వస్తుంది కాని ఆత్మలో స్థాయీ భేదాలు లేవు. రాకపోకలు లేవు. స్థాయీ బేధాలు లేని, రాకపోకలు లేని ఆనందం నేను.

ఎప్పుడైతే ఆనందం ఆత్మ అని తెలిసిందో, ఆనందమయం కోశం అయి పోతుంది. దాని తర్వాత ఇంతకు ముందు మాదిరే అనాత్మత్వ నిశ్చయం, కారత్వ నిశ్చయం, మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం చేసి ఆనందమయాన్ని తోసిపుచ్చాలి.

**బ్రహ్మాపుచ్ఛమ్ ప్రతిష్ఠా**

కోశానందానికి ఆధారం బ్రహ్మ. దీన్ని అక్షరాలా తీసుకోకూడదు. బ్రహ్మానందం ఆత్మానందానికి ఆధారం అని కాదు అర్థం. ఆత్మ = బ్రహ్మ అని అర్థం.

ఈ అధ్యాయం మొదట్లో **సత్యం జ్ఞానం అనంతం – బ్రహ్మ** అని చెప్పి **తస్మాత్ ఆత్మానః ఆకాశ సంభూతః** అంది. దీని ద్వారా బ్రహ్మ, ఆత్మ ఒకటే అని చెప్పింది.

ఆత్మానందాన్ని అనుభవించటం ఎలా? ఆత్మానందం అనుభవంలోకి రాదు. ఎందుకంటే **ఆత్మానందం ఎప్పటికీ అనుభవించే నువ్వే కాని, అనుభవించే వస్తువు ఎన్నటికీ కాదు.**

**ఆత్మానందమే నీ స్వరూపం.** అది ఆత్యంతిక ఆనందం. అది అనుభవం లోనికి వచ్చేదికాదు. ఆత్మ అంటే నేనే కనుక దానిని నేను ఒక వస్తువుగా దర్శించలేను. ఆత్మ అనుభవానికి రాదు. మన ముఖం మనం చూసుకోలేం కదా అలాగే. అద్దంలో చూడగలం కదా అంటే అద్దంలో కనిపించేది మన ముఖ ప్రతిబింబమే. ఆనందమయంలో అజ్ఞానావస్థలో శుద్ధ చైతన్యం మాత్రమే ఉంది. ఆ శుద్ధచైతన్యమే ఆనందం. ఆదే బ్రహ్మ. అది మన శరీరానికి పరిమితం కాదు. అంతటా ఉంది.

మనం బ్రహ్మను ఎలా తెలుసు కోవాలి అని మొదలు పెట్టాం. అన్ని అవస్థల లోను సాక్షిగా వున్నది ఆత్మ. పంచకోశాలకు విలక్షణమైనది. అదే ఆనందం. అదే నేను. ఈ ఆత్మే బ్రహ్మ. ఆత్మే సత్యం, జ్ఞానం, అనంతం. ఆనందమయంకి వచ్చి కోశానందానికీ, ఆత్మానందానికీ మధ్య తేడా తెలుసుకోవడంతో మన అన్వేషణ ఆగిపోయింది. బ్రహ్మను ఆత్మ సాక్షిగా తెలుసుకున్నాం. బ్రహ్మను ఆత్మగా తెలుసుకున్నాం. బ్రహ్మ మన స్వరూపంగా తెలుసుకున్నాం.

**తదప్యేష శ్లోకో భవతి।**

దీని గురించి ఋక్ మంత్రము ఇంకా ఇలా చెబుతోంది.

### అనువాకం - 6

**అసన్నేవ స భవతి। అసద్బ్రహ్మేతి వేద చేత్। అస్తి బ్రహ్మేతి చేద్వేద। సంత మేనం తతో విదురితి। తస్యైష ఏవ  శారీర ఆత్మా। యః పూర్వస్య।**

**అథాతోఽనుప్రశ్నాః। ఉతా విద్వానముంలోకం ప్రేత్య। కశ్చన గచ్ఛతీ3। ఆహో విద్వానముంల్లోకం ప్రేత్య। కశ్చిత్సమశ్నుతా3 ఉ।**

**సోఽకామయత। బహుస్యాం ప్రజాయేయేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా। ఇదగ్ంం సర్వ మసృజత। యదిదం కిఞ్చ। తత్ సృష్ట్వా। తదేవాను ప్రావిశత్। తదనుప్రవిశ్య।**

**సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ। నిలయనం చానిలయనం చ। విజ్ఞానం చావిజ్ఞానం చ। సత్యం చానృతం చ సత్యమభవత్।యదిదం కించ। తత్సత్యమిత్యాచక్షతే। తదప్యేష శ్లోకో భవతి।**

**అసద్బ్రహ్మేతి వేద చేత్।అసన్నేవ స భవతి।**

బ్రహ్మానందం అనుభవం లోనికి వచ్చేది కాదు. బ్రహ్మానందం ఇంద్రియ అగోచరం అని పదే పదే శ్రుతి చెబితే, అటువంటి బ్రహ్మ లేనే లేదు అని ఎవరైనా అంటే ఆ అన్నవాడు తనను తాను నిరాకరించుకున్నవాడు అవుతున్నాడు. ఎందుకూ? శ్రుతి నువ్వే బ్రహ్మ అంటోంది. అంతే కాదు బ్రహ్మ లేనేలేదు అన్నవాడు అధార్మికుడు కూడా.

**అస్తి బ్రహ్మేతి చేద్వేద। సంతమేనం తతో విదురితి।**

బ్రహ్మ అస్తి అంటే ధార్మికుడు అవుతాడు.

**తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

ఈ బ్రహ్మ – ఆనంద స్వరూపంగా ఇంతకు ముందు మాదిరే విజ్ఞానమయకోశంలో ఉన్న ఆనందమయకోశంలో ఉంది. కోశంలో ఉంది అనగానే కోశానికి పరిమితం కాలేదు. ఘటాకాశం, మఠాకాశంలాగ అంతటా చైతన్యంగా ఉంది.

**అథాతోఽ నుప్రశ్నాః ఉతా విద్వానములోకం ప్రేత్య। కశ్చన గచ్ఛతీ3।ఆహో విద్వానముంలోకం ప్రేత్య। కశ్చిత్సమశ్నుతా(3)ఉ।**

శ్రవణం చేస్తున్న శిష్యునికి అనుప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అనుప్రశ్నలు అంటే శాస్త్రశ్రవణంలో ఉత్పన్నమయ్యే సంశయాలు. అన్నమయకోశం అన్నం నుంచి పుట్టింది, అన్నంవల్ల వృద్ధి పొందుతుంది, ఆఖరికి అన్నంలో లయమవుతోంది. అన్నం కారణం – అన్నమయం కార్యం. కార్యం అంత్యకాలంలో కారణంలో లయమవుతుంది. ఇది ప్రాథమిక సూత్రం.

అలాగే ఈ ప్రపంచంలో సమస్తం బ్రహ్మ నుంచి పుట్టి, బ్రహ్మ వల్ల పోషింపబడి, ప్రళయంలో బ్రహ్మలో లయమవుతాయి. ఇదే సూత్రాన్ని బట్టి అజ్ఞాని కూడ బ్రహ్మ నుంచి పుట్టాడు కనుక మరణానంతరం బ్రహ్మలో లయమవ్వాలి. అవునా? కాదా? జ్ఞానికూడా బ్రహ్మ నుంచి పుట్టాడు కనుక

మరణానంతరం బ్రహ్మలో లయమవ్వాలి. అవునా? కాదా? ఈ రెండూ శిష్యునికి కల్గిన అనుప్రశ్నలు. గురువుకు ఈ అనుప్రశ్నలతో ముందరికాళ్ళ బంధం పడుతుంది.

మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో లయమవుతాడు అంటే శాస్త్ర ప్రయోజనానికి భంగం కలుతుంది. బ్రహ్మలో లయమవటం అంటే మోక్షమే కదా. శాస్త్ర అవగాహన ఉన్నా లేకపోయినా మోక్షమొస్తూంటే శాస్త్రం అవసరం లేదు.

పోనీ అజ్ఞాని బ్రహ్మలో లయం కాదు అంటే కార్యం అంత్యంలో కారణంలో విలీనమౌతుందనే ప్రాథమిక సూత్రానికి భంగమేర్పడుతోంది. ముందు గొయ్యి వెనుక నుయ్యి. ఇదీ పరిస్థితి. ఈ చిక్కు సమస్యను ఎలా విడదీయాలి? గురువు గారేం సమాధానమివ్వాలి?

అయితే చిన్న డైవర్షన్, శ్రుతి ప్రశ్నాః అని బహువచనం వాడింది. సంస్కృతంలో ఏకవచనం, ద్వివచనం, బహువచనం అని వచనాలు మూడు విధాలు. బహువచనం అంటే మూడు అంతకన్నా ఎక్కువ సంఖ్యకు వాడాలి. కాని అనుప్రశ్నలు రెండే వచ్చాయి. మూడో ప్రశ్న చెప్పకనే చెప్పినట్టయింది. అది **బ్రహ్మ అస్తి వా నవా?** అసలు బ్రహ్మ ఉన్నాడా? లేడా? బ్రహ్మ ఉన్నాడంటేనే చర్చ ముందుకు సాగుతుంది.

**బ్రహ్మ అస్తి** అని ఏడు చక్కటి కారణాలతో శ్రుతి ఋజువు చేస్తోంది. ఆ తర్వాతే పై రెండు కీలకమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం జరుగుతుంది. అంతవరకూ వేచి ఉండాల్సిందే మరి!

**1.నిమిత్త కారణం**

**సోऽకామయత। బహుస్యాం ప్రజాయేయేతి।**

అతను (బ్రహ్మ) ఇలా సంకల్పించాడు. నేనే అనేకంగా అవుదును గాక అని. అతను అంటే బ్రహ్మ మగవాడా? బ్రహ్మ అనేది ఒక తత్వం, ఒక వ్యక్తి కాదు. దీనిని వ్యక్తం చేయడానికి సరైన పదం లేదు. అవగాహనా సౌలభ్యం కోసం శ్రుతి అతను అంది అంతే. కొంతమంది అందుకే బ్రహ్మ అనవలసిన చోట బ్రహ్మము అంటారు.

బ్రహ్మ సంకల్పించడమేమిటి? మన కంటే మనస్సుంది సంకల్పించడానికి. ఆ బ్రహ్మ ఒక తత్త్వం అంటున్నారు కదా? బ్రహ్మ తన మాయతో సంకల్పము

చేశాడు. సృష్టి చేయాలనే సంకల్పం, సృష్టి రచన, సృష్టి చేయటం అంతా బ్రహ్మ మాయద్వారా చేశాడు.

బ్రహ్మ పూర్ణుడు కదా ఆయనకు సంకల్పమేమిటి? అవును ఆయన అసంగుడు, పూర్ణుడు. ఆయన సంకల్పములో బంధకత్వము లేదు. ఆయన సంకల్పము ఆయన స్వార్థం కోసం కాదు. లోక శ్రేయస్సు కోసం.

బ్రహ్మ సృష్టి చేయడం ఎందుకు? సృష్టి చేసి మనను సంసారంలో తోయటం ఎందుకు? ఊరికినే ఉండవచ్చు కదా? బ్రహ్మ జీవుల మీద అపారమైన కరుణతో వారి కర్మలు క్షయం కావాలని సృష్టి చేశాడు. మరి జీవులకు కర్మలు ఎక్కడనుంచి వచ్చాయి? జీవులకు ఇప్పటి కర్మలు వారి ముందు సృష్టి నుంచి వచ్చాయి. ముందు సృష్టిలో కర్మలు అంతకు ముందు సృష్టి నుంచి వచ్చాయి. బాగానే ఉంది, మరి మొట్టమొదటి సృష్టిలో కర్మలు ఎలా వచ్చాయి? అసలు సృష్టికి మొదలు లేదు. అది అనాది. ఆది లేనిది. సృష్టి – ప్రళయం ఒక చక్రం లాంటివి. ఏది ముందు, ఏది వెనుక చెప్పలేము. విత్తు ముందా? చెట్టు ముందా? అన్నట్టు అవుతుంది. సృష్టికి మొదలు ఉంది అంటే అనవస్థా దోషమేర్పడుతుంది. మొదట సృష్టిలో జీవుల కర్మల గురించి, మరొక సృష్టి కావాలి. దీనిని వేదాంతంలో అనవస్థా దోషం అంటారు.

భగవంతుడు లోకసంగ్రహం కోసం సృష్టి చేశాడు. ప్రపంచం కోసం ఏర్పడిన కోరికను శుద్ధ కామః అంటారు.

**సోஉకామయత। బహుస్యాం ప్రజాయేయేతి। స తపోஉతప్యత। స తపస్తప్త్వా।**

**ఇదగ్ం సర్వ మసృజత। యదిదం కిఞ్చ। తత్ సృష్ట్వా। తదేవాను ప్రావిశత్।**

**తదనుప్రవిశ్య। సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ। నిలయనం**

**చానిలయనం చ। విజ్ఞానం చావిజ్ఞానం చ। సత్యం చానృతం చ**

**సత్యమభవత్।యదిదం కించ। తత్సత్యమిత్యాచక్షతే। తదప్యేష శ్లోకో భవతి।**

**సో உకామయతః।**

బ్రహ్మ శుద్ధ కామాన్ని చూపించాడు. ఏమిటా కోరిక?

**బహుస్యాం ప్రజాయేయ।**

నేను అనేకంగా అవుదును గాక. ఎలా? మామూలుగా మనుషి మనిషికే జన్మనివ్వగలడు. కాని బ్రహ్మ అన్ని జీవాలకు జన్మనిచ్చాడు.

కోరిక తర్వాత ప్రణాళిక. దానికి లక్షల జీవరాశుల పుణ్య, పాపాల వివరాలు తెలియాలి. అంటే సర్వజ్ఞుడైన బ్రహ్మ మాత్రమే అలా అందరి కర్మలకు తగ్గ పుట్టుకనివ్వగలడు. ఈ ప్రణాళికను తపః అంటారు.

**సః తపః అతప్యత** – వాచ్యార్థం తీసుకుంటే బ్రహ్మ తపస్సు చేశాడు. బ్రహ్మ తపస్సు జ్ఞానం. ఆ తపస్సు కూడా మాయ ద్వారా చేశాడు.

బ్రహ్మ తపస్సు చేయడమేమిటి? ఇంకా ఆకాశమే సృష్టించబడలేదే? ఆయన ఎక్కడ కూర్చుని తపస్సు చేశాడు? ఆయనకు సృష్టికి కావల్సిన ముడి సరుకేది? ఇంత సృష్టికి సమయం ఎంత పట్టింది? మనిషికి మనిషి పుడతాడుకాని బ్రహ్మ సృష్టిలో వివిధంగా జగత్తు పుట్టింది ఇది ఎలా సాధ్యం? ఇలా ఎన్నో ప్రశ్నలు మనను వేధిస్తాయి.

మాయలో ఈ మూడు అంశలూ ఉన్నాయి – ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. బ్రహ్మ మాయ ద్వారా ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి ఉపయోగించి సృష్టి చేయడమే తపస్సు చేయడం. మనలాగ ఒకచోట కూర్చుని తపస్సు చేశాడని కాదు. కుమ్మరి కుండ చేశాడంటే, దానికి కావల్సిన నేర్పరితనం – తెలివి, ముడి సరుకు మట్టి కావాలి. సృష్టికి కావల్సిన తెలివి నేర్పరితనం నిమిత్తకారణం అంటారు. ఆయనకు సృష్టికి కావల్సినముడి సరుకును ఉపాదానకారణం అంటారు. ఇవన్నీ ఆ బ్రహ్మే అయ్యాడు. అదెలాసాధ్యం అంటే మనం మన స్వప్న సృష్టి కూడా ఇలాగే చేస్తున్నాం. మన స్వప్నానికి మనమే నిమిత్తకారణం, ఉపాదానకారణం, కరణకారణం.

**ఇదగ్ం సర్వం అసృజత।** – కొన్ని యుగాలు తపస్సు చేశాక బ్రహ్మ ఈ మొత్తం జగత్తును సృష్టించాడు.

| | | |
|---|---|---|
| **సోఽకామయత।** | – మొదటి దశ | – కోరిక |
| **తపోతప్యత।** | – రెండవ దశ | – ప్రణాళిక |
| **ఇదగ్ం సర్వం అసృజత।** | – మూడవ దశ– ఆచరణలో పెట్టాడు. | |

**యదిదం కించ।**

మన కళ్ళ ముందు కనిపించేదంతా ఈశ్వరుడు సృష్టించాడు. అందువల్ల

ఈశ్వరుడు జగత్కారణం. ఏదైనా ఒక పని చేయాలంటే, ఎంతో శ్రమించాలి. ఎంతో సమయం పడుతుంది. కాని బ్రహ్మ సంకల్పమాత్రం చేతనే సృష్టి చేశాడు.

ఎలా సాధ్యం? శాస్త్రం నువ్వు కూడా సంకల్ప మాత్రేన రోజూ సృష్టి చేస్తున్నావు అంటోంది. మనశ్శక్తి వల్ల, వాసనల వల్ల రోజూ స్వప్నాన్ని సృష్టి చేస్తున్నాం మనం.

స్వప్నం మిథ్యాప్రపంచం కాబట్టి దాన్ని సంకల్పమాత్రేన సృష్టించవచ్చు. కాని జగత్తునెలా సృష్టించగలడు? ఈ జగత్తు సత్యం అని ఎవరన్నారు అంటుంది శాస్త్రం. మన స్వప్నం మన సంకల్పం వల్ల సృష్టించబడితే ఈ జగత్తనే స్వప్నం ఈశ్వర సంకల్పం వల్ల సృష్టించబడింది.

కాని ఈ జగత్తు నాకు స్వప్నంగా అనిపించటం లేదే? శాస్త్రం అంటుంది, స్వప్నంలో ఉండగా అది నిజమనే అంటున్నావు కదా. నిద్ర నుంచి లేచాక మిథ్య అని తెలుస్తోంది. అలాగే, ఇప్పుడు కూడా పారార్థిక సత్యానికి లేస్తే ఈ జగత్తు కూడా మిథ్య అని తెలుస్తుంది.

ఆ బ్రహ్మ తపస్సు చేశాడు. తపస్సు చేసి, ఇక్కడున్నదంతా సృష్టించాడు. ఒక ఇల్లు కట్టాలంటే – కట్టాలనే కోరిక, ఎలా కట్టాలో తగిన ప్రణాళిక, ఆ ప్రణాళికను ఆచరణలో పెట్టడం ఉంటుంది. ఒక ఇల్లు కట్టడానికే ఇంత హంగామా ఉంటే, ఈ విశ్వం, లోకాలు, జీవులు ఇన్ని సృష్టించడానికి ఎంత రచన, విజ్ఞానం కావాలి? దీనినే నిమిత్త కారణము అంటారు. జగత్తుకు బ్రహ్మే నిమిత్తమయ్యాడు. కాబట్టి **నిమిత్త కారణంగా బ్రహ్మ ఉన్నాడు.**

**బ్రహ్మ అస్తి నిమిత్త కారణత్వాత్‌॥**

**2. జీవాత్మ**

**తత్ సృష్ట్వా। తదేవాను ప్రావిశత్।** ఇక్కడున్నదంతా సృష్టించి దానిలో ప్రవేశించాడు. ఇక్కడున్నదంతా బ్రహ్మమే. బ్రహ్మ వినా మరేది లేదు. నా స్వప్నంలో కొండలు, మనుషులు, సెలయేరులు అన్నీ నేనే అన్నట్టు. నేను స్వప్నాన్ని సృష్టించి దాన్ని అనుభవించటానికి నేనే అందులో ప్రవేశిస్తాను. నేనే ప్రవేశించానని ఎలా తెలుసు? నేనే ప్రవేశించకపోతే నాకు భయంకరమైన కల వచ్చిందని ఎలా చెప్పగలను? నేను స్వప్నంలో ఉంటే కార్యాన్ని, లేస్తే కారణాన్ని.

అలాగే పరమాత్మే ప్రతి జీవిలోనూ ప్రవేశించాడు. అంటే జీవాత్మ ఎవరో కాదు, పరమాత్మే!

**తదను ప్రవిశ్య**- ఈ వాక్యాన్ని మనం పూర్తి చేయాలి. బ్రహ్మైవ జీవాత్మ రూపేణ వ్యవహరతి – శరీరంలో ప్రవేశించాక, బ్రహ్మే జీవాత్మ రూపంలో వ్యవహారం నడుపుతున్నాడు. దీనిని అనుప్రవేశ శృతి అంటారు.

**బ్రహ్మ అస్తి జీవాత్మ రూపేణ వర్థమానత్వాత్**

**3. ఉపాదాన కారణం**

ఇంతకుముందు బ్రహ్మ నిమిత్తకారణం అని చూశాము. మరి అయితే ఉపాదాన కారణం ఏది? సృష్టికి కావాల్సిన ముడిసరుకుని ఉపాదాన కారణం అంటారు. మామూలుగా కూడా ఈ విషయం తీసుకుంటే కుమ్మరి నిమిత్త కారణం, మట్టి ఉపాదాన కారణం. కాని సృష్టికి బ్రహ్మే నిమిత్త కారణం, ఉపాదాన కారణం కూడా.

**సచ్ఛ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ। నిలయనం చానిలయనం చ। విజ్ఞానం చావిజ్ఞానం చ।**

సృష్టికి అధిష్ఠానంగా ఉంటూ, **సత్ త్యత్ అభవత్।** మూర్త – అమూర్త ప్రపంచాన్ని, **నిరుక్తం చ అనిరుక్తం చ-** నిర్వచనీయమైన, అనిర్వచనీయమైన ప్రపంచాన్ని, **నిలయనం చ అనిలయనం చ-** ఆధార – ఆధేయాలైన ప్రపంచాన్ని **విజ్ఞానం చ అవిజ్ఞానం చ।** జీవ – జడ ప్రపంచాన్ని సృష్టించాడు.

కారణ ప్రపంచం మాయలో అంతర్భాగం. సమష్టి కారణప్రపంచమే మాయ. కారణశరీరం సృష్టించనవసరం లేదు. అది ఎప్పుడూ అవ్యక్త రూపంలో ఉంటుంది. సూక్ష్మ, స్థూల శరీరాలు రెండూ సృష్టించబడ్డాయి.

శ్రుతి స్థూల ప్రపంచాన్ని సత్, నిరుక్తం, నిలయనంగా, జడంగా వర్ణించింది. అంటే స్థూలశరీరం మూర్తమైనది, నిర్వచనీయమైనదిగా, సూక్ష్మశరీరానికి ఆధారమైనదిగా వర్ణించబడింది.

శ్రుతి సూక్ష్మ ప్రపంచాన్ని త్యత్, అనిరుక్తం, అనిలయనం, చేతనంగా వర్ణించింది. అంటే సూక్ష్మశరీరం అమూర్తమైనది, అనిర్వచనీయమైనది, స్థూలశరీరంపై ఆధారపడినదిగా, చేతనమైనదిగా వర్ణించబడింది.

**అభవత్** – బ్రహ్మ సూక్ష్మ స్థూల ప్రపంచం అయ్యాడు. నిమిత్తకారణం అయితే సృష్టించాడు అంటాము, ఉపాదాన కారణం అయితే అయ్యాడు అంటాము.

విజ్ఞానంచ, అవిజ్ఞానంచ- బ్రహ్మ చేతన ప్రపంచం (విజ్ఞానాంచ), అచేతన ప్రపంచం (అవిజ్ఞానం) అయ్యాడు. అచేతన ప్రపంచం జడం. చేతన ప్రపంచం

కూడా జడమే. జడం రెండు రకాలు. ఉదా: బల్ల, రాయి లాంటివి. రెండో రకం మన మనసు. మనసు కూడా జడమే కాని దానికొక ప్రత్యేకత ఉంది. ఏమిటి? దాని సూక్ష్మత్వం వల్ల చేతనత్వాన్ని ప్రతిబింబించే లక్షణం ఉంది. మనసుకున్న చేతనత్వం ప్రతిబింబ చైతన్యం. బ్రహ్మ చిదాభాసరహిత వస్తువు. చిదాభాస సహిత వస్తువు అయ్యాడు.

**సత్యం చానృతం చ సత్యమభవత్।యదిదం కించ। తత్సత్యమిత్యాచక్షతే।**

మనకు మూడు విధాలైన సత్యాలున్నాయి. ప్రాతిభాసిక సత్యం, వ్యావహారిక సత్యం, పారమార్థిక సత్యం. **ప్రాతిభాసిక సత్యం** – స్వప్నంలో ఉన్న సత్యం. కలలో ఉన్నంత సేపూ ఇదే నిజమా అన్నట్టు ఉంటుంది.

**వ్యావహారిక సత్యం** – జాగ్రదావస్థలో ఉన్న సత్యం. మెలుకువగా ఉన్నప్పుడు మనం దర్శించేదంతా వ్యావహారిక సత్యం. ఇవి రెండూ ఒక కాలంలో ఉండి మరో కాలంలో ఉండవు. కాబట్టి ఈ రెండు సత్యాలు మిథ్య.

**పారమార్థిక సత్యం** – అన్ని కాలాల్లోను ఉన్న సత్యం ఒకటే. అదే బ్రహ్మ. అదే ఆత్మ. అదే నీ స్వరూపం. దీనినే పారమార్థిక సత్యం అంటారు.

**సత్యం** – మంత్రంలో మొదట వచ్చిన సత్యం అంటే వ్యావహారిక సత్యం. **అనృతం** అంటే ప్రాతిభాసిక సత్యం. మళ్ళీ **సత్యం** అని వచ్చింది. ఇది పారమార్థిక సత్యం. **యదిదం కించ।** ఇక్కడ ఉన్న మూడు రకాలైన సత్యాలు ఆ బ్రహ్మ వ్యక్త, అవ్యక్త రూపాలే. **తత్ సత్యం ఇతి ఆచక్షతే** అందుకని బ్రహ్మను 'సత్యం' అనే కొత్తపేరుతో వ్యవహరిస్తోంది ఇక్కడ.

**బ్రహ్మ అస్తి జగతః ఉపాదాన కారణత్వాత్**

దీన్నే ఇంకోవిధంగా చూద్దాము.

ఆభరణాలు ఉన్నాయంటేనే బంగారం ఉన్నట్టు. ఎలా? బంగారం ఆభరణాల రూపంలో ఉంది. అదే విధంగా జగత్తు రూపంలో బ్రహ్మ ఉన్నాడు. అందువల్ల జగత్తు ఉంటే బ్రహ్మ ఉన్నట్టే.

**కారణం ఏవ కార్యరూపేణ అస్తి. కార్య అస్తిత్వం ఏవ కారణ అస్తిత్వహేతుః బ్రహ్మ అస్తి జగత్ రూపేణ వర్తమానత్వాత్.**

**తదప్యేష శ్లోకో భవతి।** ఈ విషయాన్నే ఋక్ మంత్రం ఇలా చెపుతోంది.

### అనువాకం - 7

**అసద్వా ఇదమగ్ర ఆసీత్। తతో వై సదజాయత। తదాత్మానగ్గ్ స్వయమకురుత। తస్మాత్తత్సుకృతముచ్యత ఇతి।**

**యద్వైతత్సుకృతమ్। రసో వై సః। రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి। కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్। ఏష హ్యేవానందయాతి। యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మేనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే। అథ సోఽభయం గతో భవతి। యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే। అథ తస్య భయం భవతి। తత్త్వేవ భయం విదుషోఽమన్వానస్య। తదప్యేష శ్లోకో భవతి।**

**4. సుకృతం**

**అసద్వా ఇదమగ్ర ఆసీత్। తతో వై సదజాయత।**

సృష్టి ఆదిలో బ్రహ్మ అవ్యక్తంగా ఉన్నాడు. అవ్యక్తంగా ఉన్నాడు కనుక వ్యవహరించడం కష్టం. పాలలో వెన్న ఉంది కాని ఉన్నా లేనట్టే. పాలగా ఉన్నప్పుడు ఉపయోగంలోకి రాదు. మన ఇంట్లో పాలున్నాయి. పక్కింటి వాళ్ళు వచ్చి మీ ఇంట్లో వెన్న ఉందా? అని అడిగారు. మా యింట్లో వెన్న లేదండీ అని చెబుతాం. అవ్యక్తంగా పాలలో ఉంది అని చెప్పం కదా! అందుకని అవ్యక్త బ్రహ్మను మంత్రం అసత్ అంటోంది. అసత్ అంటే పూర్తిగా లేదని అర్థం చేసుకోకూడదు. అవ్యవహారంగా ఉంది.

**తతో వై సదజాయత।**

ఆ అవ్యక్త బ్రహ్మ నుంచి వ్యక్త ప్రపంచం ఉద్భవించింది.

**తదాత్మానగ్ం స్వయమకురుత।**

ఆ బ్రహ్మ తనకు తానే జగత్తుగా ప్రకటమయ్యాడు. అందుకని ఆయనను మంత్రం **సుకృతం** అంటోంది.

**తస్మాత్తత్సుకృతముచ్యత ఇతి।**

అందువల్ల స్వయంగా తానే జగత్తు అయ్యాడు. వేరే ముడిపదార్థం వాడలేదు, వేరే కారణం కూడా వాడలేదు. ఈశ్వరుడే కర్త, ముడిపదార్థం, కారణం

అయ్యాడు.

**యద్వైతత్సుకృతమ్।**

నిజంగా ఆయనే సుకృతం. **సుకృత ప్రసిద్ధిగా బ్రహ్మ ఉన్నాడు.**

**బ్రహ్మ అస్తి సుకృత ప్రసిద్ధేః।**

**5. ఆనంద హేతువు**

**రసో వై సః। రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వా ఽఽ నందీ భవతి। కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్। ఏష హ్యేవానందయాతి। రసో వై సః। రసగ్గ్ం హ్యేవాయం లబ్ధ్వా ఽఽ నందీ భవతి।**

ఈ జీవుడు లౌకికంగా పొందే ఆనందం అల్పమైనది. అది కాలానికి పరిమితమైనది. ఒకరికి ఆనందాన్నిచ్చేది మరొకరికి దుఃఖాన్నిస్తుంది. ఉదా:– నాకు శాస్త్రీయ సంగీతమంటే ఇష్టమనుకోండి. చెవులు బ్రద్దలయ్యేలా ఉండే పాప్ మ్యూజిక్ అంటే ఇష్టం లేదు. కాని ఆ పాప్ మ్యూజిక్‌కు చెవులు అప్పచెప్పే వాళ్ళుంటారు. ఇప్పుడు ఆనందం మ్యూజిక్‌లో ఉందా? నాలో ఉందా? మ్యూజిక్‌లో వుంటే ఒకే రకమైన మ్యూజిక్‌కు అందరూ ఒకేలా స్పందించటం లేదు. కాబట్టి ఆనందం నాలోనే ఉంది. నాలో ఉండటమేమిటి? **నేనే ఆనందస్వరూపుడను.** ఆ ఆనందమే వస్తువుల్లోనూ, మనుష్యుల్లోనూ, విషయాల్లోనూ, సంఘటనల్లోనూ, దేశాల్లోనూ ప్రతిబింబించి కోశానందంలాగ నాకు అనుభవంలోకి వస్తోంది. ఈ ఆత్మే మన ఆనందానికి, అసలు కారణం.**ఆనంద హేతువుగా బ్రహ్మ ఉన్నాడు.**

**బ్రహ్మ అస్తి రస ప్రసిద్ధేః।**

ఆనందం రెండు రకాలు – ఆత్మానందం, కోశానందం.

కోశానందం – మనస్సు శాంత వృత్తిలో ఉన్న సందర్భాలలో ఆత్మానందం మనస్సులో ప్రతిబింబించి తాత్కాలిక ఆనందాన్నిస్తుంది. దీనినే కోశానందం అంటారు.

కోశానందం –

1. ప్రతిబింబ ఆనందం. మనస్సు ద్వారా మనకు అనుభవం లోకి వస్తుంది.
2. దీనిలో ప్రియ,మోద,ప్రమోద అని స్థాయీ భేదాలుంటాయి.
3. మనుష్యులద్వారా, సంఘటనలవల్ల, వస్తువులవల్ల మనస్సు శాంతవృత్తిని పొందుతుంది. దీనిని సత్వ అంతఃకరణం

అంటారు. ఈ అంతఃకరణంలో ఆత్మానందం ప్రతిబింబించి మనకు ఆనందం అనుభూతిలోకి వస్తుంది.

4. ఈ ఆనందం తాత్కాలికమైనది. ఒక కాలంలో ఉండి, మరొక కాలంలో ఉండదు.

ఆత్మానందం –
1. బింబ ఆనందం. ఇది మనకు అనుభవం లోకి రాదు. ఇది ఇంద్రియ అగోచరం.
2. దీనికి స్థాయీ భేదాలు లేవు. ఇది అనంతమైనది, సత్యమైనది.
3. ఇది అన్ని కాలాల్లోను ఉంది. ఇది పారమార్థికం. అదే ఆత్మ. అదే నేను.
4. ఈ ఆనందం నా స్వరూపం. నాకు కలిగే లౌకికానందం దీనినుంచే వస్తోంది.

**6. జడ శరీరే చేష్టా దర్శనం –**

**కో హేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్। ఏష హ్యేవానందయాతి।**

హృదయాకాశంలో ఉన్న ఈ ఆనందమనే ఆత్మ వల్లే మానవుడు శ్వాస పీల్చడం, వదలడం వంటి క్రియలు చేయగలుగుతున్నాడు. జడశరీరంలో చేష్టలన్నీ ఆత్మ వల్లే అంటే బ్రహ్మ వల్లే సంభవం అవుతున్నాయి. **జడశరీరం చేష్టలు ప్రదర్శించడం వల్ల హృదయాకాశంలో ఆత్మగా బ్రహ్మ ఉన్నాడు.**

**బ్రహ్మ అస్తి జడ శరీరే చేష్టా దర్శనత్వాత్॥**

**7. భయ–అభయ ప్రదాత**

**యదా హేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే। అథ సోఽభయం గతో భవతి। యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే। అథ తస్య భయం భవతి। తత్త్వేవ భయం విదుషోఽమన్వానస్య। తదప్యేష శ్లోకో భవతి।**

**యదా హేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే। అథసోఽభయం గతో భవతి।**

అనిర్వచనీయం, ఇంద్రియ అగోచరం, అశరీరం, స్వాతంత్ర్యమైన ఆత్మను ఎవరు తన స్వరూపంగా దర్శిస్తారో, వారు అభయం పొందుతున్నారు. వారికి ఎటువంటి జంకు లేదు.

**యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే। అథ తస్య భయం భవతి। తత్త్వేవ భయం విదుషోఽ మన్వానస్య॥**

**ఉదరం** అంటే ఇక్కడ పొట్ట కాదు. ఉత్ + అరం. అరం – స్వల్పమైన, ఉత్ – భేద బుద్ధి. నిజంగా ఎవరు ఆ బ్రహ్మలో అల్పమైన భేద బుద్ధిని దర్శిస్తారో అతనికి భయం తప్పదు. బ్రహ్మలో భేద బుద్ధిని దర్శించడం అంటే నేను వేరు, బ్రహ్మ వేరు అనే భావన కలిగి ఉండడం. ఈ భేద బుద్ధి మూడు విధాలు. జీవ – జీవ భేదం, జీవ – జగత్ భేదం, జీవ – ఈశ్వర భేదం.

ఉన్నదంతా బ్రహ్మమే. భేదబుద్ధితో ఉన్న పండితుడికి కూడా భయం తప్పటం లేదు. పండితుడు అంటే అన్ని విద్యలూ నేర్చినా బ్రహ్మవిద్య మాత్రం నేర్వనివాడు లేదా బ్రహ్మవిద్య శ్రవణం చేసి, మనన నిధిధ్యాసలు చేయనివాడు.

**తదప్యేష శ్లోకో భవతి**

ఈ విషయమై ఋగ్ మంత్రం ఇలా చెపుతోంది.

**అనువాకం – 8**

**భీషాఽ స్మాద్వాత పవతే। భీషోదేతి సూర్యః। భీషాఽ స్మాదగ్నిశ్చేంద్రశ్చ। మృత్యుర్ధావతి పంచమ ఇతి॥**

బ్రహ్మ భయంతోనే వాయువు వీస్తోంది. బ్రహ్మ భయంతోనే సూర్యుడు ఉదయిస్తున్నాడు; బ్రహ్మ భయంతోనే ఇంద్ర, అగ్ని దేవతలు తమ తమ పనులు క్రమం తప్పకుండా చేస్తున్నారు. ఐదవ దేవతైన మృత్యువు కూడా బ్రహ్మభయంతోనే తన పని నిర్వర్తిస్తున్నాడు. **భయ – అభయ ప్రదాతగా బ్రహ్మ ఉన్నాడు.**

**భయ – అభయ హేతుత్వాత్ బ్రహ్మ అస్తి।**

ఉన్నదంతా బ్రహ్మమే అని దర్శిస్తే అభయం. బ్రహ్మ వేరు, నేను వేరు అని దర్శిస్తే భయం తప్పదు. దర్శించడం అంటే ఉన్నదంతా బ్రహ్మమే అనే సత్యనిష్ఠలో ఉండాలి. ఆ సత్యంలో జీవించాలి.

బ్రహ్మ అస్తిత్వాన్ని యుక్తితో శ్రుతి నిరూపించింది. ఏడు కారణాలు చూపి బ్రహ్మ ఉనికిని గుర్తు చేసింది. అంటే తర్కం ఉపయోగించి బ్రహ్మ ఉన్నాడని తెలియజెప్పింది.

బ్రహ్మ అస్తిత్వానికి చెప్పిన ఏడు కారణాలు టూకీగా–

1. బ్రహ్మ అస్తి నిమిత్తకారణత్వాత్
2. బ్రహ్మ అస్తి జీవరూపేణ వర్తమానత్వాత్
3. బ్రహ్మ అస్తి ఉపాదాన కారణత్వాత్
4. బ్రహ్మ అస్తి సుకృత ప్రసిద్ధే
5. బ్రహ్మ అస్తి రస ప్రసిద్ధే
6. బ్రహ్మ అస్తి జడ శరీరే చేష్టా దర్శనత్వాత్
7. బ్రహ్మ అస్తి భయ అభయ హేతుత్వాత్

కాని కఠోపనిషత్తులో **నైషా తర్కేణ మతి రాపనేయా** అంటుంది. తర్కం వల్ల బ్రహ్మ అస్తిత్వాన్ని చెప్పలేం అంటుంది. పైగా నైయ్యాయికులు తర్కం ద్వారా బ్రహ్మను నిరూపిస్తే అది సరి కాదని ఆ నిరూపణలో దోషాలు ఎంచుతాడు సిద్ధాంతి. ఇప్పుడు శ్రుతి కూడా అదే చేసింది కదా! దీనిని ఎలా సమన్వయ పరచడం?

తర్కం రెండు రకాలు – కేవల తర్కం, శ్రుతి సమ్మత తర్కం. కేవల తర్కం లేదా శుష్క తర్కంలో దోషాలుంటాయి. శ్రుతి సమ్మత తర్కం ప్రమాణ సిద్ధంగా ఉంటుంది. దీనినే శ్రుతి యుక్తి అంటుంది. ఉపనిషత్తు వాడే తర్కం – శ్రుతి సమ్మతమైన తర్కం. దీనితో బ్రహ్మ అస్తిత్వం నిరూపణ ముగిసింది.

అసలు ప్రశ్నలకు ఇంకా మంత్రం సమాధానం ఇవ్వలేదు. అవి మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో లయమవుతాడా? మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో లయమవుతాడా? దీనికి సమాధానం ఇవ్వకుండానే **ఆనంద మీమాంస** అనే అంశంతో ఉపనిషత్తు వేరే అనువాకంలోకి వెళుతోంది. అంటే కప్పదాటు వ్యవహారమా? మొహం చాటేస్తోందా? శ్రుతి ఏం సమాధానం చెబుతుందా అని ఎదురు చూస్తున్నాం కదా?

శ్రుతి ఈ అనుప్రశ్నలను ఒక చొప్పదంటు ప్రశ్నలుగా పక్కన పెట్టేసింది. బంగారం నుంచి ఆభరణం తయారైంది. బంగారం వల్లే ఆభరణం ఉనికి, మనుగడ

సాగించింది. ఆభరణం కరిగిస్తే, ఆఖరుకు ఆభరణం బంగారంలోనే లయమౌతోంది. బాగానే ఉంది ఇవన్నీ పదాలు వాడాము సరే. అసలు ఆభరణం బంగారానికి ఎప్పుడు దూరమైంది కనుక? దూరమైతే కదా లయమవ్వడం! జ్ఞానికి ఆభరణంగా ఉన్నా లేకపోయినా అది బంగారమే అని తెలుసు. అజ్ఞాని బంగారం వేరు ఆభరణం వేరు అనుకుంటున్నాడు. అందుకని లయమయ్యింది అని చెప్పాల్సి వస్తోంది. శ్రుతి ఉద్దేశ్యంలో ఈ ప్రశ్నే తప్పు. అందుకే మౌనవ్యాఖ్యానం చేసింది.

అనుప్రశ్నలు మళ్ళీ గుర్తు చేసుకుందాం. మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో లయమవుతాడా? మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో లయమవుతాడా?

శ్రుతి ప్రకారం జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ బ్రహ్మమే. ఎప్పుడు బ్రహ్మ అయ్యారు? మరణానంతరమా? జ్ఞాని, అజ్ఞాని వీరిద్దరూ పుట్టక ముందు, పుట్టాకా, మరణించాకా అన్ని సమయాలలోనూ బ్రహ్మమే. అదే బ్రహ్మ అభిన్న కారణము అంటే. జ్ఞాని తాను ఎప్పుడూ బ్రహ్మననే స్ఫురణతో స్వేచ్ఛగా జీవన్ముక్తుడుగా నిత్య ఆనందంతో జీవిస్తున్నాడు. జ్ఞాని మరణానంతరము విదేహముక్తి పొంది సంసారచక్రాన్ని దాటుతున్నాడు. అజ్ఞాని తాను వేరు, బ్రహ్మ వేరు అనే భ్రాంతితో (బ్రహ్మకు, జీవునకు మధ్య) లేని అగాధాన్ని సృష్టించుకుని సంసార లంపటంలో పడుతున్నాడు. మృత్యువు నుండి మృత్యువుకు పయనిస్తున్నాడు.

## అనువాకం -9

**సైషాఽఽ నందస్య మీమాగ్ంసా భవతి। యువా స్యాత్సాధుయువాఽధ్యాయకః ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకో మానుష ఆనందః తే యే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్య గంధర్వాణామానందః । శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తేయే శతం మనుష్య గంధర్వాణామానందాః । స ఏకో దేవగంధర్వాణామానందాః శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతం దేవగంధర్వాణామానందాః స ఏకః పితృణాం చిరలోక లోకానా-మానందః శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతం పితృణామ్ చిరలోక లోకానామానందాః । స ఏక అజనజానాం**

దేవానామానందః । శ్రోత్రియస్య చాకామహతస్య।
తే యే శతమాజానజానాం దేవానామానందాః। స ఏకః కర్మదేవానాం దేవానామానందః।
యే కర్మణా దేవానప్రియన్తి। శ్రోత్రియస్య చాకామహతస్య।
తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః। స ఏకో దేవానా మానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।
తే యే శతం దేవానా-మానందాః। స ఏక ఇంద్రస్యానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।
తే యే శతమింద్రస్యానందాః। స ఏకో బృహస్పతే-రానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।
తే యే శతం బృహస్పతే-రానందాః। స ఏకః ప్రజాపతే-రానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।
తే యే శతం ప్రజాపతే-రానందాః। స ఏకో బ్రహ్మణ ఆనందః। శ్రోత్రియస్య చాకామహతస్య।
స యశ్చాయం పురుషే । యశ్చాసావాదిత్యే। స ఏకః స య ఏవంవిత్ । అస్మాల్లో కాత్ప్రేత్య। ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రామతి । ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రామతి । ఏతం మనోమయ మాత్మాన ముపసంక్రామతి । ఏతం విజ్ఞానమయ- మాత్మాన - ముపసంక్రామతి । ఏతమానంద మయ-మాత్మాన ముపసంక్రామతి । తదప్యేష శ్లోకో భవతి ।
యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కుతశ్చనేతి। ఏతగ్ం హ వా వ న తపతి। కి మహగ్ం సాధు నాకరవమ్।

**కిమహం పాప-మకరవ-మితి। స య ఏవం విద్వా-నేతే ఆత్మానగ్గ్ స్పృణుతే। ఉభే హ్యేవైష ఏతే ఆత్మానగ్గ్ స్పృణుతే। య ఏవం వేద। ఇత్యుపనిషత్**

**సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి।**

ఆనందం అంటే ఏమిటో శ్రుతి చక్కని మీమాంస (విచారణ) చేయబోతోంది.

ఆనంద మీమాంస అంటే ఏమిటో ఒక విహంగ వీక్షణం చేద్దాం.

ముందు అనువాకాలలో ఆనందమయకోశం, ఆనంద ఆత్మ అంటే ఏమిటో తెలుసుకున్నాం. అక్కడ ఆనందం రెండు రకాలు అని తెలుసుకున్నాం.

1. ఆత్మానందం - అదే నా స్వరూపం - అదే ఆత్మ.

2. కోశానందం - ప్రసన్న చిత్తంలో ఆత్మానందం ప్రతిబింబించినప్పుడు, కోశానందం అనుభవంలోకి వస్తుంది. ఆత్మానందం - కోశానందాల మధ్య భేదాల గురించి విస్తారంగా తెలుసుకుందాం!

**కోశానందం ప్రతిబింబానందం - ఆత్మానందం బింబానందం**

నా ముఖం అద్దంలో ప్రతిబింబిస్తోంది. అద్దంలో కనిపించేది నా ముఖమే కాని అసలు ముఖం కాదు. అసలు ముఖం నా భుజాల మీద పదిలంగా వుంది. ఆత్మానందం అసలైనది. దాని ప్రతిబింబమే కోశానందం. దీనికి ప్రసన్నమైన అంతఃకరణం కావాలి.

**కోశానందం తాత్కాలికమైనది - ఆత్మానందం శాశ్వతమైనది**

అద్దం ఉన్నంత సేపే నా ముఖం అద్దంలో కనిపిస్తుంది. అద్దం పక్కన పెట్టినా, లేదా పగిలినా నా ముఖం అందులో ప్రతిబింబించదు. అలాగే నా మనస్సు ప్రసన్నంగా, ప్రశాంతంగా ఉన్నప్పుడు కోశానందం అనుభవంలోకి వస్తుంది. ఈ అనుభవం మనస్సు ప్రసన్నంగా, ప్రశాంతంగా ఉన్నంత వరకు ఉంటుంది. ఇది తాత్కాలిక మైనది. ఆత్మానందం ఎప్పుడూ ఉంటుంది. ఎందుకు? అదే నేను కాబట్టి. నా అసలు స్వరూపమే అది.

**కోశానందంలో స్థాయీ భేదం ఉంది - ఆత్మానందంలో స్థాయీ భేదం లేదు**

కోశానందంలో ప్రియ, మోద, ప్రమోదాలనే స్థాయీ భేదాలున్నాయి. నాక్కావల్సిన వస్తువును చూడగానే నాకు కలిగే ఆనందం ప్రియం, దానిని సంపాదించుకోడం

వల్ల మోదం ఏర్పడుతుంది. దానిని అనుభవించినప్పుడు ప్రమోదం కలుగుతుంది. ఆత్మానందంలో ఇటువంటి స్థాయీ భేదాలు లేవు.

**కోశానందం అనుభవంలోకి వస్తుంది – ఆత్మానందం అనుభవంలోకి రాదు**

అద్దమున్నంత వరకు ముఖం అద్దంలో కన్పిస్తుంది. అలాగే మనస్సు ప్రసన్నంగా ఉన్నంత వరకు ఆనందం అనుభవంలోకి వస్తుంది. ఆత్మానందం అనుభవంలోకి రాదు. నా అసలు ముఖం నేనెన్నటికీ చూడలేను. ఎందుకూ? చూసే కళ్ళు వేరే వస్తువులను, తనకు భిన్నమైనవి, చూడగలవు కాని తనను తాను చూసుకోలేవు. ఆనందం నేనే కాబట్టి, ఆత్మానందం అనుభవంలోకి రాదు.

**కోశానందానికి మార్గాలు రెండు – ఆత్మానందానికి మార్గం ఒకటే**

1. కోశానందం విషయాలవల్ల, మనుష్యులవల్ల, పరిస్థితులవల్ల, ప్రదేశాలవల్ల, సంఘటనలవల్ల రావచ్చు.
2. కోశానందం వైరాగ్యం వల్ల రావచ్చు.

ఒక కుక్క ఎముక కొరుకుతూ తన పళ్ళలోంచి వచ్చే రక్తం ఎముకలోంచి వస్తోందని భ్రమించి ఎముకని వదలకుండా కొరుకుతూంటూంది. అలాగే అజ్ఞాని కూడా ఆనందం విషయాల వల్ల, మనుష్యుల వల్ల, పరిస్థితుల వల్ల, ప్రదేశాల, సంఘటనల వల్ల వస్తోందనుకుని వాటి వెంట పరుగులు తీస్తోంటాడు. ఆనందానికి కారణం తనే అని తెలుసుకోడు. తనే ఆనందం అని తెలుసుకోడు.

జ్ఞాని కోశానందాన్ని కేవల వైరాగ్యంతో విషయాల, మనుష్యుల, పరిస్థితుల, ప్రదేశాల, సంఘటనల ప్రమేయం లేకుండానే పొందుతాడు. వైరాగ్యం అంటే అందని ద్రాక్షపళ్ళు పుల్లన అనే తీరులో కాదు. నాకు ఏ వెలితి లేదు. నేను పూర్ణుడను అని నిశ్చయంగా తెలియటం వల్ల వచ్చిన వైరాగ్యం; ఇక్కడున్నదంతా మిథ్య అనే నిశ్చయభావం వల్ల వచ్చిన వైరాగ్యం.

ఈ విధంగా కోశానందం పొందటానికి రెండు పద్ధతులు. ఒకటి అజ్ఞాని పద్ధతి, రెండవది జ్ఞాని పద్ధతి. రోడ్లు మురికిగా ఉంటే వ్యక్తిగా మీకు రెండు మార్గాలున్నాయి. మురికి రోడ్లకు కార్పెట్లు వేయటం లేదా మీరే చక్కగా చెప్పులేసుకుని నడవడం. అజ్ఞాని పద్ధతి మొదటిది. జ్ఞాని పద్ధతి రెండవది.

అజ్ఞాని ఆనందం బాహ్యంగా విషయాల వల్ల, మనుష్యుల వల్ల, పరిస్థితుల వల్ల, ప్రదేశాల వల్ల, సంఘటనల వల్ల వస్తుంది అనుకుని అనంతంగా అంతులేని పోరాటంలో అశాంతంగా మరణిస్తాడు. సంసారచక్రంలో మళ్ళీ మళ్ళీ

తిరుగుతూంటాడు. జ్ఞాని ఆనందం బాహ్యంగా లేదని గ్రహించి, ఆనందమే తన స్వరూపమని తెలుసుకుని బాహ్యమైన శోధన ఆపి ప్రశాంతంగా ఉంటాడు.

**ఆత్మానందానికి ఒకటే మార్గం**. అది జ్ఞానం. ఆత్మానందం బాహ్యంగా లేదని తెలుసుకోడం. ఆత్మానందం అనుభవించేది కాదని, అది తానే అని తెలుసు కోడమే జ్ఞానం. లౌకికంగా లభించే ఆనందం కోశానందమే. సమాధిలో లభ్యమయ్యే ఆనందం కూడా కోశానందమే. ఏ ఆనందమైనా కానివ్వండి అది అనుభవమయ్యింది అంటే కోశానందమే. ఎందుకూ? ఆత్మానందం అనుభవం కాదు. ఆనందాన్ని అనుభవించే మీరే ఆత్మానందం.

**యువా స్యాత్సాధుయువాఽధ్యాయకః ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః ।తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకో మానుష ఆనన్దః**

ఆనందం స్థాయిలు తెలియచేయడానికి, మొదటగా శ్రుతి ఒక యువకుని ఎంచుకుంది.ఉదాహరణకు ఒక యువకుడు ఉన్నాడనుకుందాము. ఆ యువకుడు సాధుపుంగవుడు, సదాచార సంపన్నుడు, సంస్కారవంతుడు, శ్రుతిని చక్కగా అభ్యసించినవాడు, చురుకైనవాడు, దృఢమైన మనస్సు కలవాడు, బలిష్ఠుడు అయి ఉంటే, అతనికి భూగోళంలోని సమస్త సంపదలు–ధనం, ఖనిజ సంపద మొదలైనవి–సమకూరితే, ఎంత ఆనందంగా ఉంటాడో, ఆ ఆనందం ఒక మనుష్య ఆనందంకు సమానం అంటుంది శ్రుతి.

యువకుడే ఎందుకు? చిన్నపిల్లవాడికి మానసిక పరిణతి ఉండదు. ముసలివాడైతే ఆనందం అనుభవించటానికి శరీర సామర్థ్యం సరిపోదు. ఆధ్యాత్మిక ఆనందం, ఆదిభౌతిక ఆనందం సమస్తం ఒక యువకునికి సమకూరితే ఆ ఆనందం ఒక మనుష్య ఆనందంకి సమానం. ఇటువంటి ఆనందం వాస్తవంగా ఉండదు కాని ఒక భావనగా తీసుకుని శ్రుతి చెపుతోంది.

**తే యే శతం మానుషా ఆనందాః స ఏకో మనుష్య గంధర్వాణామానందః**

ఈ మనుష్య ఆనందానికి వందరెట్లు ఆనందం మనుష్యగంధర్వ ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।**

లేదా మనుష్య ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో ఉన్న వివేకవంతునికి మనుష్యగంధర్వ ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 మనుష్య గంధర్వ ఆనందం = 100 రెట్లు మనుష్య ఆనందం. (ఒకటి తరువాత రెండు సున్నాలు.)

**తేయే శతం మనుష్యగంధర్వాణా మానందాః స ఏకో దేవగంధర్వాణామానందః**

ఈ మనుష్యగంధర్వ ఆనందానికి వందరెట్లు ఆనందం దేవగంధర్వ ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోతియస్య చాకామహతస్య**

లేదా మనుష్యగంధర్వ ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో వున్న వివేకవంతుడుకి దేవగంధర్వ ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 దేవగంధర్వ ఆనందం = 100 రెట్లు మనుష్యగంధర్వ ఆనందం.

అంటే 1 దేవగంధర్వ ఆనందం = 10000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట. (ఒకటి తరువాత నాలుగుసున్నాలు.)

మనుష్యగంధర్వులు, దేవగంధర్వుల మధ్య తేడా ఏమిటి? మనుష్యగంధర్వులు పుణ్యఫలంతో ఆ లోకానికి చేరినవారు. దేవగంధర్వులు సృష్ట్యాది నుంచి అక్కడే ఉన్నవారు. దేవగంధర్వులు మనుష్యగంధర్వుల కన్నా హెచ్చు స్థాయికి చెందినవారు.

**తే యే శతం దేవగంధర్వాణామానందాః స ఏకః పితౄణాం చిరలోక లోకానామానందః**

ఈ దేవగంధర్వ ఆనందానికి వందరెట్లు ఆనందం పితృదేవతల ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య**

లేదా దేవగంధర్వ ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో వున్న వివేకవంతుడుకి పితృదేవతల ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 పితృదేవత ఆనందం = 100 రెట్లు దేవగంధర్వ ఆనందం.

అంటే 1 పితృదేవత ఆనందం = 1000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట. (ఒకటి తరువాత ఆరు సున్నాలు.)

**తే యే శతం పితౄణాం చిరలోక లోకానామానద్దాః । స ఏకః ఆజానజానాం దేవానామానందః**

ఈ పితృదేవతల ఆనందానికి వందరెట్లు ఆనందం ఆజానజ దేవతల ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।** లేదా పితృదేవతల ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో వున్న వివేకవంతుడుకి ఆజానజ దేవతల ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 ఆజానజ దేవత ఆనందం = 100 రెట్లు పితృదేవతల ఆనందం.

అంటే 1 ఆజానజ దేవత ఆనందం = 100000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత ఎనిమిది సున్నాలు.)

ఆజానజ దేవతలు అంటే స్మార్త కర్మలఫలంగా స్వర్గలోకం వచ్చిన దేవతలు. స్మార్త కర్మలు అంటే పూజలు. హోమకుండం లేకుండా చేసేవి.

**తే యే శతమాజానజానాం దేవానామానందాః। స ఏకః కర్మదేవానాం దేవానామానందః। యే కర్మణా దేవానప్రియన్తి।**

ఈ ఆజానజ దేవతల ఆనందానికి వందరెట్లు ఆనందం కర్మ దేవతల ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।**

లేదా ఆజానజ దేవతల ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో వున్న వివేకవంతుడుకి కర్మ దేవతల ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 కర్మ దేవతల ఆనందం = 100 రెట్లు ఆజానజ దేవతల ఆనందం.

అంటే 1 కర్మ దేవత ఆనందం = 10000000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట. (ఒకటి తరువాత పది సున్నాలు.)

కర్మ దేవతలు అంటే శ్రౌత కర్మలఫలంగా స్వర్గలోకం వచ్చిన దేవతలు. శ్రౌత కర్మలు అంటే యజ్ఞాలు, అగ్నిహోత్ర విధులు.

**తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః। స ఏకో దేవానామానందః।**

ఈ కర్మ దేవతల ఆనందానికి వందరెట్లు ఆనందం దేవతల ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।**

లేదా కర్మ దేవతల ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో వున్న వివేకవంతుడుకి దేవతల ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 దేవత ఆనందం = 100 రెట్లు కర్మ దేవతల ఆనందం.

అంటే 1 దేవత ఆనందం = 1000000000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత పన్నెండు సున్నాలు.)

దేవతలు అంటే శ్రౌత కర్మలు + ఉపాసన ఫలితంగా స్వర్గలోకం వచ్చినవారు. శ్రౌత కర్మలు అంటే యజ్ఞాలు, అగ్ని హోత్రవిధులు. ఉపాసనలు అంటే శ్రుతి సూచించిన ధ్యానాలు.

**తే యే శతం దేవానామానందాః స ఏక ఇంద్రస్యానందః।**

ఈ దేవతల ఆనందానికి వందరెట్లు ఆనందం ఇంద్ర ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।**

లేదా దేవతల ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో వున్న వివేకవంతుడుకి ఇంద్ర ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 ఇంద్ర ఆనందం = 100 రెట్లు దేవతల ఆనందం.

అంటే 1 ఇంద్ర ఆనందం = 100000000000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత పధ్నాలుగు సున్నాలు.)

దేవతల రాజు ఇంద్రుడు, అందుకని ఇంద్రుని ఆనందం దేవతల ఆనందం కన్నా మిన్నగా ఉంటుంది.

**తే యే శతమింద్రస్యానందాః స ఏకో బృహస్పతేరానందః।**

ఈ ఇంద్ర ఆనందానికి వందరెట్లు ఆనందం బృహస్పతి ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।**

లేదా ఇంద్ర ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో ఉన్న వివేకవంతుడుకి బృహస్పతి ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 బృహస్పతి ఆనందం = 100 రెట్లు ఇంద్ర ఆనందం.

అంటే 1 బృహస్పతి ఆనందం = 10000000000000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత పదహారు సున్నాలు.)
బృహస్పతి దేవగురువు కనుక ఇంద్ర ఆనందం కన్నా బృహస్పతి ఆనందం హెచ్చుగా ఉంటుంది.

**తే యే శతం బృహస్పతేరానందాః। స ఏకః ప్రజాపతేరానందః।**

ఈ బృహస్పతి ఆనందానికి వందరెట్లు ఆనందం ప్రజాపతి ఆనందానికి సమానం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।**

లేదా బృహస్పతి ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో ఉన్న వివేకవంతుడుకి ప్రజాపతి ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 ప్రజాపతి ఆనందం = 100 రెట్లు బృహస్పతి ఆనందం.

అంటే 1 ప్రజాపతి ఆనందం = 1000000000000000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత పద్దెనిమిది సున్నాలు.)
ప్రజాపతి అంటే ఇక్కడ విరాట్‌గా తీసుకోవాలి. సమష్టి స్థూల ప్రపంచం విరాట్. ఆ విరాట్ బ్రహ్మను మంత్రం ప్రజాపతి అంటోంది.

**తే యే శతం ప్రజాపతేరానందాః। స ఏకో బ్రహ్మణ ఆనందః।**

ఈ ప్రజాపతి ఆనందానికి వందరెట్లు ఆనందం బ్రాహ్మణ ఆనందానికి సమానం. బ్రాహ్మణ ఆనందం అంటే హిరణ్యగర్భ ఆనందం. అజ్ఞాని పుణ్యఫలంతో ఆ లోకానికి చేరుకుని ఈ ఆనందం అనుభవించవచ్చు.

**శ్రోత్రియస్య చాకామహతస్య।**

లేదా ప్రజాపతి ఆనందం వరకూ అంతా మిథ్య అని వైరాగ్యంతో ఉన్న వివేకవంతుడుకి హిరణ్యగర్భ ఆనందం ఇక్కడే లభిస్తుంది.

1 హిరణ్యగర్భ ఆనందం = 100 రెట్లు ప్రజాపతి ఆనందం.

అంటే 1 హిరణ్యగర్భ ఆనందం = 100000000000000000000 రెట్లు మనుష్య ఆనందం అన్నమాట.(ఒకటి తరువాత ఇరవయి సున్నాలు.)
ఇక్కడ లోకాల స్థాయి పెరుగుతూ వస్తే, అక్కడ వివేకవంతుడి వైరాగ్యం స్థాయి అంతకంతకూ పెరుగుతూ వస్తుంది.

బ్రహ్మణ అంటే ఇక్కడ హిరణ్యగర్భగా తీసుకోవాలి. సమష్టిసూక్ష్మ ప్రపంచం హిరణ్యగర్భ. ఆ హిరణ్యగర్భను బ్రహ్మను మంత్రం బ్రహ్మణ అంటోంది. **బ్రహ్మణ**

**ఆనందః** అంటే బ్రహ్మానందంగా తీసుకుంటే ఒక చిక్కుఉంది. బ్రహ్మానందం లేదా ఆత్మానందం అనుభవం లోకి రాదు.

ఒకడు చీకటిలో టార్చిలైట్ వేసాడు. టార్చిలోంచి బాగానే కాంతి వస్తోంది. అయితే అందులో ఉన్న బ్యాటరీలు ఏ కంపెనీకి చెందినవో చూడాలని కోరిక కలిగింది. టార్చి విప్పి బ్యాటరీలు తీసి టార్చిముందు పెట్టాడు. టార్చి వెలగడం లేదు. టార్చిలోంచి వచ్చే కాంతికి మూలం బ్యాటరీలే. ఆ కాంతితో బ్యాటరీని చూడడం సాధ్యంకాదు. అదే విధంగా కోశానందానికి మూలం ఆత్మానందం. ఆత్మానందం అనుభవం లోకి రాదు. అది నువ్వే. నీ కళ్ళతో నీ కళ్ళను చూడడం సాధ్యం కాదు. ఆత్మానందం కేవలం జ్ఞానం వల్ల తెలుసుకోగలవు. అది అనుభవం కాదని, అది నీ స్వరూపమని తెలుసుకోగలవు.

మనస్సు చక్కటి కలను సృష్టిస్తుంది. మనసు సృష్టించే కలను చూడగలం కాని మనసును చూడలేము. అలాగే ఇక్కడ ఉన్నదంతా ఆత్మ సృష్టించింది. కాని ఆత్మను మనం చూడలేం.

ఇక వైరాగ్యంలో స్థాయిలు ఎలా సంభవం? చిన్న పిల్లవాడు బొమ్మలతో ఆడుతూ అవే నిజమా అన్నట్టుగా ఉంటాడు. పెద్దవాళ్ళు చిన్నపిల్లల లాగ బొమ్మలకు లోబడరు. ఆ బొమ్మలాటలో సారం లేదని తెలియటం వల్ల, వారికి అందులో వైరాగ్యం.అలాగే వివేకవంతుడు జ్ఞానం వల్ల తన పూర్ణత్వాన్ని తెలుసుకుని జ్ఞానజన్యమైన వైరాగ్యం వల్ల ఆత్మానంద ప్రతిబింబమైన కోశానందాన్ని పొందుతాడు.

**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః స య ఏవంవిత్। అస్మాల్లో కాత్ప్రేత్య। ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రామతి । ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రామతి। ఏతం మనోమయ మాత్మాన ముపసంక్రామతి। ఏతం విజ్ఞానమయ- మాత్మాన - ముపసంక్రామతి । ఏతమానంద మయ-మాత్మాన ముపసంక్రామతి। తదప్యేష శ్లోకో భవతి।**

**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః స య ఏవంవిత్।**

ఇక్కడున్న మనిషి ఆనందం అక్కడి హిరణ్యగర్భ ఆనందం ఒకటే అంటోంది శ్రుతి. ఇదెలా సంభవం? ఆనంద మీమాంసలో పది స్థాయిల్లో ఆనందపు పరిమితులు

చెపుతూ, హిరణ్యగర్భ ఆనందం మనుష్య ఆనందానికి $10^{20}$ రెట్లు అని చెప్పింది కదా! ఇప్పుడు రెండూ ఒకటే అనటమేమిటి? దీనిని లక్ష్యార్థం అంటారు. ప్రతి పదానికి వాచ్యార్థం, లక్ష్యార్థం అని రెండు ఉంటాయి.

ఉదాహరణకు:– జంబంగుడి, లాల్‌గుడి, కారైక్కుడి అంటే తమిళనాడులో మూడు ఊర్లు. కాని వీటిని సంగీత కచేరికి వాడతారు. జంబంగుడి అంటే జంబంగుడిలో ఉన్న సంగీత విద్వాంసుడు, లాల్‌గుడి అంటే లాల్‌గుడిలో ఉన్న వయొలిన్ విద్వాంసుడు, కారైక్కుడి అంటే కారైక్కుడిలో ఉన్న మృదంగ విద్వాంసుడు. వీరి ముచ్చురి కచేరీయే జంబంగుడి, లాల్‌గుడి, కారైక్కుడిల సంగీతకచేరీ అంటే.

అలాగే ఇక్కడున్న మనిషి ఆనందం అక్కడి హిరణ్యగర్భ ఆనందం ఒకటే అంటే, మనిషి స్వరూప రీత్యా చైతన్యం. హిరణ్యగర్భ కూడ స్వరూపరీత్యా చైతన్యమే. స్వరూపంగా చూస్తే ఈ రెండూ ఒకటే. **ఇది ఒక మహావాక్యం. అహం బ్రహ్మ అస్మి.** మనిషి ఆత్మానందం, హిరణ్యగర్భ ఆత్మానందం ఒకటే, పండితుడి నిద్ర పామరుడి నిద్ర ఒకటే అన్నట్టుగా; ఘటాకాశం, మఠాకాశం ఒకటే అన్నట్టుగా!

**అస్మాల్లోకాత్ప్రేత్య। ఏత మన్నమయమాత్మానముపసంక్రామతి।**

జీవన్ముక్తుడైన జ్ఞాని తను స్థూలశరీరానికి అతీతం అని తెలుసుకుని, ఈ అన్నమయకోశాన్ని అధిగమిస్తాడు.

**ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రామతి। ఏతం మనోమయ మాత్మానముపసంక్రామతి। ఏతం విజ్ఞానమయ మాత్మానముపసంక్రామతి।**

జ్ఞాని తను సూక్ష్మశరీరానికి అతీతం అని తెలుసుకుని, ఈ ప్రాణమయ కోశాన్ని, మనోమయకోశాన్ని, విజ్ఞానమయకోశాన్ని అధిగమిస్తాడు.

**ఏతమానందమయమాత్మానముపసంక్రామతి।**

జ్ఞాని తను కారణ శరీరానికి అతీతం అని తెలుసుకుని, ఆనందమయ కోశాన్ని అధిగమిస్తాడు. జ్ఞాని తను దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతమైన ఆత్మను అని తెలుసుకుంటాడు.

**తదప్యేష శ్లోకో భవతి।**

దీనికి అనుగుణంగా ఋక్ మంత్రం ఇలా ఉంది.

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కుతశ్చనేతి। ఏతగ్ం హ వా వ న తపతి। కి మహగ్ం సాధు నాకరవమ్।**

**కిమహం పాప-మకరవ-మితి। స య ఏవం విద్వా-నేతే ఆత్మానగ్‍ం స్పృణుతే।**

**ఉభే హ్యేవైష ఏతే ఆత్మానగ్‍ం స్పృణుతే। య ఏవం వేద। ఇత్యుపనిషత్॥**

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కుతశ్చనేతి।**

సత్యం, జ్ఞానం, అనంతమైన బ్రహ్మ దగ్గరకు, మనసుతో కలసి వాక్కు చేరుకోలేక తిరుగు ముఖం పట్టింది. అంటే ఏకం, నిత్యం, సారం, సత్యం అయిన ఆత్మను వాక్కుతో వర్ణించలేం, మనసుతో ఊహించలేం. వాక్కు, మనస్సు మొదలైన ఇంద్రియాలు ఆత్మ సమక్షంలోనే పనిచేస్తాయి. **ఆనందో బ్రహ్మ** అని జ్ఞాని తెలుసుకుంటాడు. ఆనందమే బ్రహ్మ అంటే ఆనందమే ఆత్మ. ఆనందమే తన స్వరూపం. ఇదెలా? **బ్రహ్మ = ఆత్మ = స్వస్వరూపం** అని **ఏతస్మాత్ ఆత్మన ఆకాశ సంభూతః** అనే మంత్రంలో తెలిసింది. ఏ జ్ఞాని ఆనందమే నా స్వరూపం అని తెలుసుకుంటాడో అతనికి ఎటువంటి భయం లేదు.

విద్యుచ్ఛక్తి ఒక ఫ్యానును తిరిగేలా చేస్తుంది, లైటును వెలిగేలా చేస్తుంది, టీవీలో చిత్రాలు కనిపించేలా చేస్తుంది. ఒక ధార్మిక సంస్థ విద్యుచ్ఛక్తి చిత్రం గీసిన వాళ్ళకు లక్ష రూపాయల బహుమతి ప్రకటించింది. దేశదేశాలనుంచి చక్కటి చిత్రాలు వచ్చాయి. బహుమతి గ్రహీత చిత్రం గురించి అందరూ ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. కొంతమంది ఫ్యాను చిత్రం గీసి స్పార్కు లు వేసారు. కొంతమంది కేవలం స్పార్కు వేసారు, కొంతమంది స్పార్కు చుట్టూ అన్ని విద్యుత్ సాధనాలు వేసారు. వారి వారి సృజనాత్మకతను వారి వారి కుంచలతో రకరకాలుగా తెలియచేసారు.

బహుమతి గ్రహీత చిత్రం ఫోటో కట్టి ప్రదర్శనలో పెట్టారు. చిత్రం! నిజంగా ఇది చిత్రమైన చిత్రమే. అది కేవలం ఖాళీ ఫ్రేమ్. అందులో ఏ చిత్రం లేదు. మోసం మోసం అన్నారు. కాదు ఇదే నిజం అన్నారు వైజ్ఞానికులు. అవును ఇది సత్యం అన్నారు వేదాంతులు.

నిజానికి విద్యుత్ సమక్షంలో ఫ్యాను తిరుగుతుంది. లైటు వెలుగుతుంది. టీవీలోని చిత్రాలు వస్తాయి. విద్యుత్ పూచీ పడి ఫ్యానును తిప్పదు. అదే నిజమైతే లైటును తిప్పాలి. టీవీనీ తిప్పాలి. విద్యుత్ అమాయికమైనది. అది నిస్సంగమైనది కూడా. దాని సమక్షంలో అవన్నీ వాటి వాటి పనులు చేసుకుపోతున్నాయి.

సూర్యకిరణాల వల్ల ఆకుల్లో కిరణజన్య క్రియ జరిగి పిండిపదార్థం తయారౌతోంది. సూర్యుడ్ని నిలదీసి ఏమిటి ఆకుల్నుంచి పిండిపదార్థం తయారు చేస్తున్నావట అని అడిగారనుకోండి. ఆయన ఏమో నాకు తెలియదు అంటాడు. ఆయన అసంగుడు. ఆయన సన్నిధిలో ఇదంతా జరుగుతోంది. అలాగే ఆ బ్రహ్మ సమక్షంలో ఇదంతా జరుగుతోంది.

**ఏతగ్ం హ వా వ న తపతి।**

గతం గురించిన ఆవేదన జ్ఞానికి లేదు. ఏ విషయంలోనూ జ్ఞానికి పశ్చతాపం లేదూ, అవమానం లేదు. అతను పరితపించదు. జ్ఞాని నిజంగా లౌకిక విషయాలకు చలించదు.

**కిమహగ్ం సాధు నాకరవమ్।**

ఆ జ్ఞాని నేనెందుకు ఈ మంచి పని చేయలేక పోయాను అని వాపోదు.

**కిమహం పాప మకరహవమితి।**

ఆ జ్ఞాని నేనెందుకు ఈ పాపపు పని చేసాను అని కుమిలిపోదు. జ్ఞాని, అజ్ఞానిగా ఉన్నప్పుడు అనేక పనులు చేసి వుండ వచ్చు. అవి అతనిని కలవరపెట్టవు. జ్ఞాని ఇదంతా మిథ్యగా దర్శిస్తున్నాడు కనుక, అతనిని జరిగిపోయిన విషయాలు కలవర పెట్టవు.

**స య ఏవం విద్వా-నేతే ఆత్మానగ్గ్ స్పృణుతే । ఉభే హ్యైవైష ఏతే ఆత్మానగ్గ్ స్పృణుతే । య ఏవం వేద । ఇత్యుపనిషత్॥**

ఇలా తెలుసుకున్న జ్ఞాని, ఈశ్వరుడూ, జీవుడూ రెండూ ఆత్మగానే దర్శిస్తున్నాడు. ఇలా తెలుసుకున్న జ్ఞాని, ఈ రెండూ ఆత్మగానే దర్శిస్తున్నాడు. ఇంతటితో ఉపనిషత్‌లో బ్రహ్మానందవల్లీ ముగిసింది.

**ఓం సహ నా వవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**
**తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై॥**
**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

# భృగువల్లీ

**శాంతిపాఠం**

**ఓం సహ నా వవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**
**తేజస్వినా-వధీత-మస్తు మా విద్విషావహై। ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

శాంతి పాఠానికి ముఖ్య అర్థం ఇంతకుముందు చెప్పుకున్నాం కనుక ఇప్పుడు లక్ష్యార్థం చెప్పుకుందాం.

**సహనా వవతు।**

గురుశిష్యుల మధ్య చక్కటి సంబంధం ఉండాలి. గురువు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయి ఉండాలి. శ్రద్ధాభక్తులు శిష్యునికి ఉండాలి. శిష్యునికి శాస్త్రం మీద అచంచలమైన దీక్ష, ప్రమాణబుద్ధి ఉండాలి. గురువు అతనికి స్వరూప దర్శనం చేయించాలి.

**సహ నౌ భునక్తు।**

రెండు చేతులూ కలిస్తేనే కాని చప్పట్లు కావు అన్నట్టుగా శాస్త్ర అధ్యాపన – అధ్యయనాలలో ఇరువురిలోనూ ప్రయత్న లోపం ఉండకూడదు.

**సహ వీర్యం కరవావహై।**

శాస్త్ర అధ్యయనం ద్వారా శిష్యునికి జ్ఞానప్రాప్తి కలగాలి. శాస్త్ర శ్రవణం ద్వారా శిష్యునికి తన స్వరూపం తెలియాలి. **తేజస్వినా వధీత మస్తు మా విద్విషావహై॥**

జ్ఞానప్రాప్తి మాత్రమే సరిపోదు. జ్ఞానఫలప్రాప్తి కలగాలి. అంటే జ్ఞానం శిష్యునకు స్వభావికంగా మారాలి. బ్రహ్మనిష్ఠ జీవనశైలిగా మారాలి. సుప్తచేతనంలో తన స్వరూపం నిలవాలి. **ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక విఘ్నాలు కలుగకుండా ఉండాలి.

భృగువల్లీ- **భృగుర్వై వారుణిః।** అని భృగు పదంతో ఈ వల్లి మొదలౌతుంది. అందుకని దీనికి భృగువల్లీ అని పేరు. అలాగే బ్రహ్మవల్లీ **బ్రహ్మవిదాప్నోతి పరమ్** అని బ్రహ్మపదంతో మొదలైంది కనుక బ్రహ్మవల్లీ అన్నారు. ఇక శీక్షావల్లీ **శీక్షా వ్యాఖ్యాస్యామః** అని శీక్షాపదంతో మొదలైంది.

భృగుమహర్షి రెండుసార్లు జన్మించాడు. మొదట బ్రహ్మ మానస

పుత్రుడుగా జన్మించాడు.కాని దక్షయజ్ఞం ధ్వంసమైన సమయంలో ఆయన అంతరించిపోయాడు. మళ్ళీ వరుణుడు పుత్రుడు వారుణిగా జన్మించాడు. దశరథస్య పుత్రః దాశరథిః అన్నట్లుగా, వరుణస్య పుత్రః వారుణిః. భగవద్గీతలో కూడా శ్రీకృష్ణ పరమాత్ముడు **మహర్షీనాం భృగురహం** - మహర్షులలో నేను భృగువును అని చాటుకున్నాడు.

భృగువల్లీలో బ్రహ్మవిద్య సూచనాప్రాయంగా ఉంటుంది. బ్రహ్మవల్లీలో బ్రహ్మవిద్య సంపూర్ణంగా చెప్పబడింది.

అయితే ఇంతవరకూ గురుశిష్య సంవాదం రాలేదు. గురుశిష్యులను ప్రవేశపెట్టి బ్రహ్మవిద్య గురుముఖతః మాత్రమే నేర్చుకోవాలనే తప్పనిసరి నియమాన్ని ప్రతిపాదన చేస్తూ ఈ వల్లీ మొదలౌతుంది. ఉపనిషత్తుల అధ్యయనం ఎవరికి వారు స్వంతంగా పుస్తకాలు చదివి తెలుసుకునేది కాదు. నేనెవరిని? నేనెవరిని? అని పదే పదే స్మరిస్తేనూ బ్రహ్మవిద్య లభించదు. అజ్ఞాన నిర్మూలన జరిగి నిశ్చయజ్ఞానంతో తన స్వరూపనిష్ఠలో ఉండాలంటే గురువు ఎంతో అవసరం. అందుకే భృగువు, అతని తండ్రి వరుణుల మధ్య సంవాదం గురుశిష్యుల సంవాదంగా ప్రవేశపెట్టబడింది.

భృగువల్లీ తపస్సుకు పెద్దపీట వేసింది. తపస్సు అంటే ఏమిటి? తపస్సు అంటే ధ్యానం అని, తపస్సు అంటే ఒక నిర్జన ప్రదేశంలో మంత్రజపం చేయడమని ఇలా అనేకరకాలుగా చెప్తారు. నారాయణవల్లీ తపస్సును అనేకరకాలుగా వర్ణించింది. **కష్ట సహిష్ణుత్వం తపః** అని కూడా అంటారు. కష్టాన్ని ఓర్చుకోవడమే తపస్సు. మౌనవ్రతం, ఉపవాసాది కార్యాలు, ఏడుకొండలు కాలినడకన వెళ్ళడం- ఇవన్నీ తపస్సు క్రిందే వస్తాయి. శీక్షావల్లీలో స్వాధ్యయనం తపస్సు అని తద్ధి **తపః తద్ధి తపః** అంటుంది. ఇక్కడ తపస్సుకు మరో అర్థం ఉంది. తపస్సు అంటే విచారణ. స్వరూప విచారణమే తపస్సు. **యస్య జ్ఞానమయం తపః।** చక్కటి స్వరూప అవగాహనమే తపస్సు అని ముండకోపనిషత్తు కూడా అంటోంది. **తప ఆలోచనే** తపస్సు అంటే స్వరూప విశ్లేషణమే.

**తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ।। తపో బ్రహ్మేతి। స తపో తప్యత। స తప-స్తప్త్వా।**

తపస్సు అనే పదం ఇక్కడ నాలుగుసార్లు చెప్పబడింది. ఈ వాక్యాలు ఐదవ అనువాకం దాకా ప్రతి అనువాకంలోను చెప్పడం జరిగింది. దీనిని బట్టి

ఆత్మ విచారణ లేదా బ్రహ్మవిచారం ఎంత ముఖ్యమో తెలుస్తోంది.

**ఉపక్రమోపసంహారౌ, అభ్యాసో పూర్వతాఫలమ్, అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్య నిర్ణయే.**

తాత్పర్య నిర్ణయానికి ఉపక్రమం, ఉపసంహారం, అభ్యాసం, అపూర్వతా, ఫలం, అర్థవాదం, ఉపపత్తి సహకరిస్తాయి. ఈ వల్లీలో తపస్సు అనే పదము పదే పదే అభ్యాసం చేయబడింది. దీనిని బట్టి తపస్సు అనే ఆత్మ విచారము ఆధ్యాత్మిక సాధనానికి చాలా ముఖ్యమైన అంశం అని తెలుస్తోంది.

తపస్సే కాకుండా భృగువల్లీలో ఐదు వ్రతాలు కూడా చెప్పబడ్డాయి. అవి సాధన చతుష్టయ సంపత్తి, అంతఃకరణ శుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త విశాలత, జ్ఞానయోగ్యతాప్రాప్తి, గురుప్రాప్తి కోసం చెప్పబడ్డాయి.

ఆ వ్రతాలు–

1. **అన్నం న నింద్యాత్। తద్వ్రతమ్।**
2. **అన్నం న పరిచక్షీత। తద్వ్రతమ్।**
3. **అన్నం బహుకుర్వీత। తద్వ్రతమ్।**
4. **న కంచన వసతౌ ప్రత్యాచక్షీత। తద్వ్రతమ్।**
5. **తస్మాద్యయా కయా చ విధయా బహ్వన్నం ప్రాప్నుయాత్।**

ఈ వ్రతాలు ఏమిటో ముందు ముందు వివరంగా తెలుసుకుందాం.

## అనువాకం -1

**భృగుర్వై వారుణిః। వరుణం పితర–ముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తస్మా ఏతత్ ప్రోవాచ। అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి। తగ్ం హోవాచ। యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి। స తపోఽతప్యత స తపస్తప్త్వా।**

**భృగుర్వై వారుణిః। వరుణం పితర ముపససార।** వరుణపుత్రుడైన భృగువు తన తండ్రి వరుణుని సమీపించాడు.

**భృగుః** వై అని వాడింది మంత్రం. ఇది చాలా అపురూపమైన సంఘటన. చరిత్ర పుటలలో సువర్ణ అక్షరాలతో లిఖించదగినది. సాధారణంగా కొడుకు తండ్రి దగ్గరకు పోయి డబ్బులు కావాలనో, ఆస్తి కావాలనో అడుగుతాడు. అది

లోకంలో జరుగుతున్నదే. పైగా తండ్రి నా ఏటిఎమ్ అంటారు కొడుకులు గర్వంగా. ఇక్కడ ఈ లోకవ్యవహారానికి విరుద్ధంగా కొడుకు బ్రహ్మవిద్యను అడగబోతున్నాడు. అందుకే శ్రుతి ఆశ్చర్యపడుతూ వై – నిజంగా – అనే పదం వాడింది. ఇక్కడ తండ్రి కొడుకులిద్దరూ సమర్థులే. తండ్రి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు. కొడుకు శాస్త్రం మీద ప్రమాణబుద్ధి కలిగినవాడు. శాస్త్ర అధ్యయనానికి చక్కటి అనుకూల వాతావరణం.భృగువు తండ్రిని శాస్త్రం చెప్పిన పద్ధతిలో సమీపించాడు.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్। సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**
**అధీహి భగవో బ్రహ్మేతి।**

భృగువు తండ్రిని సమీపించి హే భగవాన్। నాకు బ్రహ్మ గురించి చెప్పండి అన్నాడు. గురువే దైవం. అందుకే ఆ సంబోధన!

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।**

అని శ్రీకృష్ణపరమాత్మ కూడా చెప్పాడు. మరొక విషయం భృగువు అంతటి మహాత్ముడే గురువును సమీపించి శాస్త్ర శ్రవణం చేసాడు. అంటే ఆత్మ విద్య స్వంతంగా పుస్తకాలు చదవడం ద్వారా రాదు. గురువు సన్నిధిలో శాస్త్ర శ్రవణం చేయడం వల్లనే వస్తుంది అని పునః పునః చెబుతోంది.

**తస్మా ఏతత్ ప్రోవాచ।**

**తస్మై భృగవే ఏతత్ ప్రోవాచ।** ఉపనిషత్తు ఇలా అంటోంది. శిష్యుడుగా మారిన భృగువుతో (కొడుకుతో) గురువుగా మారిన వరుణుడు (తండ్రి) ఇలా అన్నాడు.

తండ్రి, గురువు అయిన వరుణునికి భృగువు యొక్క శక్తి సామర్థ్యాలు బాగా తెలుసు. అందుకని బ్రహ్మ గురించి కొన్ని ఆచూకీలు (క్లూస్) చెప్పి విచారణ ద్వారా బ్రహ్మను తెలుసుకోమని చెప్పాడు. అవి –

**బ్రహ్మ ఉపలబ్ధి ద్వారాణి –** బ్రహ్మ ఉపలబ్ధి ద్వారాణి అంటే బ్రహ్మను తెలుసుకోవడానికి కొన్ని స్థానాలు.

**బ్రహ్మ లక్షణం** – బ్రహ్మ లక్షణం అంటే బ్రహ్మ నిర్వచనం.

**బ్రహ్మ ఉపలబ్ధి ద్వారాణి – అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి।**

**అన్నం** = అన్నమయకోశం **ప్రాణం, వాక్** = ప్రాణమయ కోశం. ప్రాణం అంటే పంచప్రాణాలు. వాక్, పాణి, పాదం, పాయు, ఉపస్థ కలిపి పంచ కర్మేంద్రియాలు. వాక్ అని ఒక్కటే చెప్పినా ఐదు కర్మేంద్రియాలనూ సూచనప్రాయంగా

గ్రహించవచ్చు. పంచ ప్రాణాలు + పంచ కర్మేంద్రియాలు ప్రాణమయ కోశాన్ని సూచిస్తున్నాయి.

**చక్షుః శ్రోత్రం మనః =** మనోమయ కోశం. చక్షుః శ్రోత్రం అంటే కన్ను, చెవి. వీటి ద్వారా సూచనాత్మకంగా పంచజ్ఞానేంద్రియాలను గ్రహించవచ్చు. ఇది మనస్సు అంటే మనస్సు, చిత్తం, అహంకారం. పంచజ్ఞానేంద్రియాలు + మనస్సు+చిత్తం+అహంకారం మనోమయ కోశాన్ని సూచిస్తున్నాయి.

**మనశ్చ జ్ఞానేంద్రియ పంచకం మిలిత్వా మనోమయ కోశః।। – తత్వబోధ.**

వరుణుడు ఈ విధంగా అన్నమయము, ప్రాణమయము, మనోమయము సూచించాడు. ఉపలక్షణం ద్వారా అన్ని కోశాలు (అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు) వస్తాయి.బ్రహ్మను వెదకవలసిన ద్వారాలు పంచకోశాలు అని వరుణడు భృగువుకు చెప్పాడు.

**బ్రహ్మ లక్షణం – యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయస్త్యభిసంవిశన్తి।**

దేని నుంచి సర్వభూతాలు పుడుతున్నాయో, దేని వల్ల భూతరాశి జీవిస్తుందో, అంతంలో దేనిలో లయమౌతోందో అదే బ్రహ్మ. దీనిని బ్రహ్మ తటస్థ లక్షణం అంటారు. భూతాని అంటే పంచభూతాలు లేదా జీవరాశి. బ్రహ్మవల్లీలో బ్రహ్మ స్వరూప లక్షణం (**సత్యం జ్ఞానం అనంతం – బ్రహ్మ**) చెప్పబడింది. ఈ నిర్వచనాల వల్ల తైత్తిరీయ ఉపనిషత్తుకు ప్రాధాన్యత చేకూరింది. బ్రహ్మసూత్రాలలో రెండవ సూత్రం **జన్మాద్యస్య యతః** అనే సూత్రానికి ఈ మంత్రమే ఆధారం.

**ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై**
**యెవ్వనియందు డిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం**
**బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము దానయైనవా**
**డెవ్వండు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్**

బమ్మెర పోతనామాత్యుల గజేంద్రమోక్షంలోని ఈ పై పద్యానికి కూడా ఈ భృగువల్లీ మంత్రమే స్ఫూర్తి.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే** సృష్టి కారణం, **యేన జాతానిజీవన్తి** స్థితి కారణం, **యత్ప్రయస్త్యభి సంవిశన్తి** లయ కారణం.

పరబ్రహ్మ యొక్క ఈ మూడు విధులను ముగ్గురు దేవుళ్ళుగా పురాణాలు చెబుతాయి. నిజానికి ఇక్కడున్నదంతా చైతన్యరూపంలో ఒకే పరమాత్మ.

కుమ్మరి కుండ చేయడానికి రెండు కారణాలు. ఒకటి కుమ్మరి నైపుణ్యం. దీనిని నిమిత్త కారణం అంటారు. రెండు కుండకు కావలసిన మట్టి. ఇది ఉపాదాన కారణం. తటస్థ లక్షణం ద్వారా బ్రహ్మ నిమిత్త కారణమా? ఉపాదాన కారణమా? చూడండి! కుమ్మరి కుండ చేసాక అతని పని ముగిసింది. కుండ స్థితికి, కుండమట్టిలో లయమౌడానికి అతను అవసరం లేదు. కాబట్టి నిమిత్త కారణాన్ని స్థితిమాత్ర కారణం అంటారు. కాని కుండ సృష్టికి ముందూ, కుండగా ఉన్నప్పుడూ, మళ్ళీ కుండ మట్టిలో కలిసినప్పుడూ **మట్టి** ఉంది. ఉపాదాన కారణం సృష్టి, స్థితి, లయ మూడు కాలాల్లోనూ ఉంటుంది. తటస్థ లక్షణం ఉపాదాన కారణాన్ని చెబుతోంది.

బ్రహ్మ సృష్టి, స్థితి, లయలకు కారణమౌతూ వివిధంగా మారిపోయాడా? బ్రహ్మలో ఎటువంటి మార్పూ జరుగకుండా ఈ జగత్ ప్రకటించబడింది. కుండకి మట్టి ఉనికినిస్తోంది. మట్టి కుండగా మారిపోలేదు. కుండ తయారు కాకముందు మట్టి ఉంది. కుండగాను మట్టి ఉంది. కుండ నశించినా మట్టి ఉంటుంది. మట్టిలో ఎటువంటి మార్పు జరుగలేదు. మట్టి కుండగా మారిపోలేదు. కుండలా కన్పిసోంది. దీనిని **వివర్తం** అంటారు. కుండ మట్టికన్నా భిన్నంగా లేదు. అక్కడ కుండ, మట్టి అని రెండు లేవు. తటస్థ లక్షణం ద్వారా బ్రహ్మ అభిన్న, వివర్త, ఉపాదాన కారణం అని తెలుస్తోంది.

బ్రహ్మ తటస్థ లక్షణం, బ్రహ్మను తెలుసుకోవడానికి వీలైన కోశాలు భృగువుకు వరుణుడు చెప్పాడు. వీటి ఆధారంగా భృగువు విచారం చేసి బ్రహ్మను తెలుసుకోవాలి. **ఆత్మ విచారము = గురు, శాస్త్ర వాక్య విచారము.**

**తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి।**

ఇంకా భృగువుతో వరుణుడు ఇలా అన్నాడు. బ్రహ్మను విచారణ చేసి తెలుసుకో. తపస్సే బ్రహ్మ. విచారణ ద్వారా మాత్రమే బ్రహ్మను తెలుసుకోగలవు. డబ్బే సర్వస్వం అంటే అన్ని డబ్బే అని కాదు కదా. అదే నిజం అయితే డబ్బు తిని, డబ్బు త్రాగి బ్రతకాలి. డబ్బును బట్టలుగా ధరించాలి. డబ్బే సర్వస్వం అంటే సర్వస్వానికి డబ్బు సాధనం అని అర్థం. అలాగే తపస్సే బ్రహ్మ అంటే విచారణని

సాధనంగా చేసుకుని బ్రహ్మని తెలుసుకోవాలి. **స తపో౽ తప్యత। స తపస్తప్త్వా।**

భృగువు తండ్రి చెప్పినట్టు విచారణ చేశాడు. చేశాక–

**అనువాకం – 2**

**అన్నం బ్రహ్మేతి వ్యజానాత్। అన్నాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। అన్నేన జాతాని జీవన్తి। అన్నం ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ంం హోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపో౽ తప్యత। స తపస్తప్త్వా।**

**అన్నం బ్రహ్మేతి వ్యజానాత్। అన్నాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। అన్నేన జాతాని జీవన్తి। అన్నం ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ।**

భృగువు ఇలా ఆలోచించాడు – అన్నమయకోశం సమష్టి అన్నం నుంచి పుట్టింది. సమష్టి అన్నం వల్లే అన్నమయం పెరుగుతోంది. మరణానంతరం అన్నమయం సమష్టి అన్నంలో కలిసిపోతోంది. కాబట్టి అన్నమే బ్రహ్మ అని నిర్ణయించాడు. భృగువు ఆనందడోలికల్లో తేలిపోయాడు.

ఆంజనేయస్వామి సీత జాడ కోసం లంకలో ప్రవేశిస్తాడు. రావణుని శయన గృహంలో సుఖంగా నిద్రిస్తున్న మండోదరిని చూసి సీతమ్మే అని భ్రమపడతాడు. తోకను ఆనందాతిశయంతో ముద్దు పెట్టుకుంటాడు. దీనిని వాల్మీకి రామాయణంలో వానరచేష్ఠగా పేర్కొంటాడు. మళ్ళీ ఆలోచించి సీత రాముని విడిచి సుఖంగా నిద్రించదని తన అన్వేషణ తిరిగి కొనసాగిస్తాడు.

చిత్రంగా జిగ్‌సా పజిల్‌లో సమస్య, సమాధానం అందులోనే ఉంటాయి. ఒక ముఖ్యమైన ముక్క అన్ని ముక్కలను కలిపి చిత్రాన్ని పూర్తి చేసేలా సహకరిస్తుంది.

ఒక సమస్యను పరిష్కరించడానికి అన్ని దారులు మూసుకుపోయాయి అనుకుంటే, ఒక్క విషయం గట్టిగా గుర్తుంచుకోవాలి. అది అన్ని దారులు మూసుకుపోలేదని. ఇప్పుడు భృగువు ఏం చేస్తాడో చూద్దాం.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ స్సంభూతః। ఆకాశద్వాయుః। వాయో రగ్నిః।**

**అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోన్నమ్। అన్నాత్పురుషః।**
**స వా ఏష పురుషో న్నరసమయః।**

బ్రహ్మ వల్లీ **ఓషధీభ్యోన్నమ్।** అంటోంది. చెట్లు చేమల నుంచి అన్నం పుట్టింది. అన్నం కార్యం. అది ఓషధుల నుంచి పుట్టింది. ఏది మూల కారణమో, దేనికి మరేదీ కారణం కాదో ఆ బ్రహ్మ గురించి అన్వేషణ. కాబట్టి అన్నం పుట్టింది అంటే ఆరు వికారాల్లో ఇది ఒకటైంది. **అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే,** **వినశ్యతి.** కాని బ్రహ్మ లేదా ఆత్మ **న జాయతే మ్రియతే వా కదాచిత్.** బ్రహ్మకు పుట్టుకా లేదు, మరణమూ లేదు. కనుక అన్నం బ్రహ్మ కాదు. అన్నమయం అన్నం నుంచి పుట్టింది కనుక అన్నమయం కూడా బ్రహ్మ కాదు. **పునరేవ వరుణం పితరముపససార।** ఈ విశ్లేషణ సరైనదా కాదా తెలుసుకుందామని తిరిగి తండ్రి, గురువైన వరుణుని దగ్గరకు వెళ్ళాడు.

**అధీహి భగవో బ్రహ్మేతి।**

హే భగవాన్ నాకు బ్రహ్మ గురించి తెలపండి అని తను చేసిన విచారణ సరైనదా? కాదా? అని అడిగాడు.

**తగ్ం హెూవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపోబ్రహ్మేతి।**

భృగువుతో వరుణుడు ఇలా అన్నాడు. పోయి విచారణ చేసి బ్రహ్మ గురించి తెలుసుకో. తపస్సే బ్రహ్మ. తండ్రి బ్రహ్మను తెలుసుకునే ఆచూకీలు కొత్తగా ఇవ్వలేదు. కాని భృగువు విచారణ మాత్రం సరైన దిశలో సాగుతోందని భరోసా ఇచ్చి, ఇంకా విచారణ చేయమని చెప్పాడు.

**స తపోఽ తప్యత। స తపస్తప్త్వా।**

భృగువు తండ్రి చెప్పినట్టు విచారణ చేశాడు. చేశాక–

## అనువాకం – 3

**ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్। ప్రాణాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ప్రాణేనజాతాని జీవన్తి। ప్రాణం ప్రయన్త్యభిసం విశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితర–ముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హెూవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽ తప్యత। స తపస్తప్త్వా।**

**ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్। ప్రాణాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ప్రాణేన జాతాని జీవన్తి। ప్రాణం ప్రయన్త్యభిసం వింశన్తీతి। తద్విజ్ఞాయ।**

భృగువు ఆలోచించాడు. సమష్టి ప్రాణం నుంచి ప్రాణమయం పుట్టింది. ప్రాణం వల్లే దీని మనుగడ, మరణానంతరం వ్యష్టి ప్రాణం సమష్టి ప్రాణంలో కలిసిపోతుంది. ఇది తటస్థ లక్షణానికి సరిపోతోంది. **ప్రాణం బ్రహ్మ** అన్న నిర్ధారణకి వచ్చాడు. కాని ప్రాణం మూల కారణం కాదు.
**ఏతస్మాత్ జాయతే ప్రాణః** అంటుంది. ఆ ఆత్మ నుంచే ప్రాణం పుట్టింది అంటోంది ముండక మంత్రం.

ప్రాణం పుట్టింది అంటే కార్యం అయింది. అది మూలకారణం కాదు.
**పునరేవ వరుణం పితర ముపససార।**

ఈ విశ్లేషణ సరైనదా? కాదా? తెలుసుకుందామని తిరిగి గురువైన వరుణుని దగ్గరకు వెళ్లాడు.
**అధీహీ భగవో బ్రహ్మేతి।**

హే భగవాన్ నాకు బ్రహ్మ గురించి తెలపండి అని తను చేసిన విచారణ సరైనదా?కాదా అని అడిగాడు.
**తగ్ం హెూవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపోబ్రహ్మేతి।**

భృగువుతో వరుణుడు ఇలా అన్నాడు. పోయి విచారణ చేసి బ్రహ్మ గురించి తెలుసుకో. తపస్సే బ్రహ్మ. తండ్రి బ్రహ్మను తెలుసుకునే ఆచూకీలు కొత్తగా ఇవ్వలేదు. కాని భృగువు విచారణ మాత్రం సరైన దిశలో సాగుతోందని భరోసా ఇచ్చి, ఇంకా విచారణ చేయమని చెప్పాడు.
**స తపోఽ తప్యత। స తపస్తప్త్వా।**
భృగువు తండ్రి చెప్పినట్టు విచారణ చేశాడు. చేశాక-

**అనువాకం - 4**

**మనో బ్రహ్మేతి వ్యజానాత్। మనసోహ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। మనసా జాతాని జీవన్తి। మనః ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పున-రేవ వరుణం పితర-ముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హెూవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ।। తపో బ్రహ్మేతి। స తపోఽ తప్యత। స తపస్తప్త్వా।**

**మనో బ్రహ్మేతి వ్యజానాత్‌। మనసోహ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। మనసా జాతాని జీవన్తి। మనః ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ।**

భృగువు మళ్ళీ ఆలోచించాడు. సమష్టి మనస్సు నుంచి వ్యష్టి మనస్సు పుట్టింది. సమష్టి మనస్సు వల్లే దీని మనుగడ. మరణానంతరం వ్యష్టి మనస్సు సమష్టి మనస్సులో కలిసిపోతోంది. ఇది తటస్థ లక్షణానికి సరిపోతోంది. కాబట్టి మనస్సు బ్రహ్మ అన్న నిశ్చయానికి వచ్చాడు.

**ఏతస్మాత్ జాయతే ప్రాణః మనః సర్వేంద్రియాణి చ**

ఆ ఆత్మ నుంచే మనసు పుట్టింది అంటోంది అదే ముండక మంత్రం. మనస్సు పుట్టింది అంటే కార్యం అయింది. అది మూలకారణం కాదు.

**పునరేవ వరుణం పితర ముపససార।**

ఈ విశ్లేషణ సరైనదా కాదా తెలుసుకుందామని తిరిగి గురువైన వరుణుని దగ్గరకు వెళ్ళాడు.

**అధీహి భగవో బ్రహ్మేతి।**

హే భగవాన్ నాకు బ్రహ్మ గురించి తెలపండి అని తను చేసిన విచారణ సరైనదా? కాదా అని అడిగాడు.

**తగ్ం హెూవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపోబ్రహ్మేతి।**

భృగువుతో వరుణుడు ఇలా అన్నాడు. పోయి విచారణ చేసి బ్రహ్మ గురించి తెలుసుకో. తపస్సే బ్రహ్మ.

**స తపోఽ తప్యత। స తపస్తప్త్వా।**

భృగువు తండ్రి చెప్పినట్టు విచారణ చేశాడు. చేశాక–

**అనువాకం – 5**

**విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్‌। విజ్ఞానా–ద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। విజ్ఞానేన జాతాని జీవన్తి । విజ్ఞానం ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హెూవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ।। తపో బ్రహ్మేతి। స తపో తప్యత। స తపస్తప్త్వా।**

**విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్। విజ్ఞానా-ద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। విజ్ఞానేన జాతాని జీవన్తి । విజ్ఞానం ప్రయన్త్యభిసం విశన్తీతి। తద్విజ్ఞాయ।**

భృగువు ఆలోచించాడు. సమష్టి బుద్ధి నుంచి వ్యష్టి బుద్ధి పుట్టింది. ప్రాణం వల్లే దీని మనుగడ. మరణానంతరం వ్యష్టి బుద్ధి సమష్టి బుద్ధిలో కలిసిపోతుంది. ఇది తటస్థ లక్షణానికి సరిపోతోంది. విజ్ఞానమే బుద్ధి. విజ్ఞానమే బ్రహ్మ అని నిర్ధారణకి వచ్చాడు. కాని? కార్యం కారణం కన్నా స్థూలంగా ఉంటుంది. అన్నం కన్నా ప్రాణం సూక్ష్మమైంది. ప్రాణంకన్నా, మనస్సు, మనస్సు కన్నా విజ్ఞానం సూక్ష్మమైనవి. విజ్ఞానమయం సూక్ష్మమైనది. సమష్టి విజ్ఞానమయం అంటే హిరణ్యగర్భ (బ్రహ్మ). హిరణ్యగర్భ అంటే సమస్త విజ్ఞానం కలవాడు, సర్వజ్ఞుడు. కాబట్టి విజ్ఞానం బ్రహ్మ అనుకున్నాడు భృగువు.

**మయట్ వికారార్థే** మయశబ్దం కార్యాన్ని తెలుపుతుంది. కార్యం మార్పుకు లోనయ్యేది. విజ్ఞానమయం మూలకారణం కాదు. అలాగే విజ్ఞానం కూడా మార్పు చెందుతూ ఉంటుంది. కాబట్టి విజ్ఞానం కూడా కార్యం. ఇది కూడా మూలకారణం కాదు. ఆపేక్షిక కారణం మాత్రమే.

**బ్రహ్మ దేవానాం ప్రథమ సంభభూవ- ముండక మంత్రం**

బ్రహ్మ దేవతలలో మొదట పుట్టాడని ముండక మంత్రం చెబుతోంది. బ్రహ్మ కన్నా ముందు మరొకటి బ్రహ్మను పుట్టించినది ఉంది.

**పునరేవ వరుణం పితరముపససార।** ఈ విశ్లేషణ సరైనదా కాదా తెలుసుకుందామని తిరిగి గురువైన వరుణుని దగ్గరకు వెళ్ళాడు.

**అధీహి భగవో బ్రహ్మేతి।**

హే భగవాన్ నాకు బ్రహ్మ గురించి తెలపండి అని తను చేసిన విచారణ సరైనదా కాదా? అని అడిగాడు.

**తగ్ం హోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ।। తపో బ్రహ్మేతి।**

భృగువుతో వరుణుడు ఇలా అన్నాడు. పోయి విచారణ చేసి బ్రహ్మ గురించి తెలుసుకో. తపస్సే బ్రహ్మ.

**స తపోఽ తప్యత। స తపస్తప్త్వా।**

భృగువు తండ్రి చెప్పినట్టు విచారణ చేశాడు. చేశాక-

## అనువాకం - 6

**ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ఆనందేన జాతాని జీవన్తి। ఆనందం ప్రయన్త్యభిసంవిశన్తీతి।**

**సైషా భార్గవీ వారుణీ విద్యా। పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా। య ఏవం వేద ప్రతితిష్ఠతి। అన్నవా నన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మ వర్చసేన। మహాన్ కీర్త్యా॥**

**ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్।**

ఇక్కడ పదం ఆనందం. భృగు మహర్షి ఆనందమయ కోశాన్ని దాటి, ఆనందానికే వచ్చేశాడు. అందువల్ల ఆనందం అంటే ఆనందమయ కోశం కాదు, ఆనంద ఆత్మ.

ఇంతకు ముందు వల్లీలో ఆనంద ఆత్మ అంది. ఇప్పుడు ఆనందబ్రహ్మ అంది. ఆనంద ఆత్మని తిరగేస్తే ఆత్మ = ఆనందం; ఆనందం= బ్రహ్మ. అందువల్ల ఆత్మ = బ్రహ్మ.

ఇక్కడ ఆనందం అంటే సుఖం, హాయి, సంతోషం అని కాదు. ఆనందం అంటే అనంతం. పూర్ణత్వం. అదే చైతన్యం. ఆనందమే బ్రహ్మ కనుక, మంత్రంలో ఆనందం అని ఉన్నచోట బ్రహ్మ అని పూరిస్తే ఇలా వస్తుంది.

**ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే।**

బ్రహ్మనుంచే జీవరాశి పుడుతోంది. **ఆనందేన జాతాని జీవన్తి।** బ్రహ్మ వల్లే జీవరాశి జీవిస్తోంది.

**ఆనందం ప్రయన్త్యభిసంవింశన్తీతి।**

అంతంలో బ్రహ్మలోనే జీవరాశి లయమౌతుంది అని వస్తుంది. ఈ ఆత్మానందం ఆనందమయ కోశంలో కోశానందంగా ప్రతిబింబించి అనుభవంలోకి వస్తుంది. విద్యుత్తును అనుభవంలో తెలుసుకోవాలంటే లైటు గాని, ఫ్యాను గాని అవసరం. అలాగే ఆత్మానందం ప్రత్యక్షంగా అనుభవంలోకి రాదు. పరోక్షంగా కోశానందంగా అనుభవంలోకి వస్తుంది.

ఆనందం అంటే అనంతం. ఆనందం విశేషణం కాదు. నామవాచకం. విశేషణ ఆనందం వచ్చిపోయే ఆనందం, కోశానందం. నామవాచక ఆనందం

అనుభవంలోకి వచ్చేది కాదు. అది ఆత్మానందం. **ఆనందమే నా స్వరూపం. సత్‌చిత్ ఆనందం, అనంతం అహమస్మి.**

ఇంతటితో భృగువు శోధన ముగిసింది. మళ్ళీ విచారణ చేసినా ఆనందమే అన్నింటికీ మూలకారణం అని తెలిసింది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోన్నమ్। అన్నాత్పురుషః। వా ఏష పురుషో-న్నరసమయ।**

నిశ్చయ జ్ఞానం కలిగాక, ఇక తండ్రి దగ్గరకు సంశయంతో వెళ్ళలేదు.

**సైషా భార్గవీ వారుణీ విద్యా। పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా। స ఏవం వేద ప్రతితిష్ఠతి। అన్నవా నన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మ వర్చసేన। మహాన్ కీర్త్యా॥**

**సైషా భార్గవీ వారుణీ విద్యా।**

ఈ విద్యను **భార్గవీవిద్యా** లేదా **వారుణీవిద్యా** అంటారు. భృగువు తెలుసు కున్నాడు కనుక భార్గవీవిద్య. వరుణుడు బోధించాడు కనుక వారుణీవిద్య అని పేరు.

**పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా। స ఏవం వేద ప్రతితిష్ఠతి। అన్నవా నన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మ వర్చసేన। మహాన్ కీర్త్యా॥**

ఈ విధంగా పంచకోశ వివేకంతో బ్రహ్మను తెలుసుకున్న వారికి అన్నం సుభిక్షంగా ఉంటుంది. పశు సంపదతో తులతూగుతారు. వారి కీర్తి దేశదేశాలు వ్యాపించి బ్రహ్మ వర్చస్సుతో వెలుగుతారు.

### అనువాకం – 7

**అన్నం న నింద్యాత్। తద్వ్రతమ్। ప్రాణో వా అన్నమ్। శరీరమన్నాదమ్। ప్రాణే శరీరం ప్రతిష్ఠితమ్। శరీరే ప్రాణః ప్రతిష్ఠితః। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా।**

ఇప్పుడు ఉపనిషత్తు కొన్ని ఉపాసనలు, కొన్ని వ్రతాలు చెప్పబోతోంది. ఈ ఉపాసనలూ, వ్రతాలూ అంతఃకరణ శుద్ధికి, జ్ఞానయోగ్యతా ప్రాప్తికి ఉపకరిస్తాయి. ఈ వ్రతాలు అన్నమయకోశానికి సంబంధించి ఉంటాయి. అన్నమయకోశమే ఎందుకు తీసుకోబడింది? అన్నమయకోశం స్థూలంగా మనకి అనుభవంలోకి వచ్చే మొదటిమెట్టు. అన్నమయకోశ అభిమానంతోనే, తాదాత్మ్యంతోనే మన జీవితం గడిచిపోతుంది. అందుకని ఉపనిషత్తు అన్నమయకోశం ఎన్నుకుంది.

అన్నమయానికి ఆ పేరెందుకు వచ్చింది? అది అన్నంతో తయారయింది. అన్నం అంటే మనం తినే అన్నం మాత్రమే కాదు. పంచభూతాత్మకమైనదంతా అన్నమే. ఈ స్థూలమైన జగత్తు సర్వం అన్నమే.

ఇక్కడ ఉపాసనల ఉద్దేశ్యం ఇక్కడ ఉన్నదంతా ఒకదానికొకటి సంబంధితాలై, ఆశ్రితాలై ఉన్నాయి. జగత్తు అంతా ఈశ్వరుని శరీరమే. మన శరీరంలో భాగాలు ఏ విధంగా ఒకదానికొకటి ముడివడి ఉన్నాయో, ఆ విధంగా, ఈ జగత్తులో అన్నీ ఒకదానికొకటి ముడివడి ఉన్నాయి. కాలి గోరికి దెబ్బ తగిలితే తలనొప్పి వస్తుంది. ఎందుకు? మన శరీరంలో అన్నీ ఒకదానికొకటి ముడివడి ఉన్నాయి. ఎక్కడో చెట్లు నరికేస్తే అడవులు నశించిపోతే, మరెక్కడో పర్యావరణంలో సమతుల్యత తగ్గిపోతుంది. వర్షపాతం దెబ్బతింటుంది. క్షామం ఏర్పడుతుంది. ఇదంతా మనకి అనుభవమే.

ఇక్కడున్నదేదీ స్వతంత్రంగా లేదు. ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంది. ఎక్కడో సీతాకోకచిలుక తన రెక్కలాడించాలంటే, విశ్వాంతరాళాలలో మార్పు లేకుండా అది సంభవం కాదుట. ఇది కవిత్వం కాదు. దీనిని సైన్సులో **బటర్‌ఫ్లై ఎఫెక్టు** అంటారు.

ఈ జగత్తు అంతా ఒకదానికొకటి ఆశ్రితాలై ఉన్నాయి. ఈ జగత్తు అంతా ఈశ్వరుని శరీరం. ఈశ్వరుడెక్కడో దూరంగా లేడు. ఈ జగత్తులోనే అంతటా ఉన్నాడు. ఈ విషయం పైన రెండు రకాల ఉపాసనలు చెప్పబడ్డాయి. **అన్న– అన్నాద సంబంధం.** అన్నం తినబడేది. అన్నాదం తినేది. జగత్తు అంతా తినబడేది (అన్నం), తినేది (అన్నాదం) అని రెండు వర్గాలుగా ఉంది.

ఉదాహరణకు, జీవించి ఉండగా మన శరీరం ఈ జగత్తులోని

వనరులను తిని బ్రతుకుతోంది. జగత్తు అన్నం అంటే తినబడేది అయింది. శరీరం అన్నాదం అంటే తినేది అయింది.

చనిపోయాక ఇదే శరీరం పంచభూతాల్లో కలిసిపోతోంది. అప్పుడు జగత్తు అన్నాదం అంటే తినేది, శరీరం అన్నం అంటే తినబడేది అవుతోంది. ఇదే అన్న-అన్నాద సంబంధం.

**ప్రతిష్ఠా-ప్రతిష్ఠిత సంబంధం.** ప్రతిష్ఠ- ఆధారం. ప్రతిష్ఠితం ఆధారపడినది. జగత్తులో సమస్తమూ ఒకదానిపై ఒకటి ఆధారపడడం జరుగుతోంది.

బాల్యావస్థలో పిల్లవాడు తల్లిదండ్రుల మీద ఆధారపడతాడు. ఈ దశలో తల్లిదండ్రులు ఆధారం అంటే ప్రతిష్ఠ. పిల్లలు ఆధారపడేవారు ప్రతిష్ఠితం. మళ్ళీ పిల్లలు పెద్దవారై వివాహం చేసుకుని స్వతంత్ర జీవనం గడిపే సమయంలో తల్లిదండ్రులు వృద్ధులౌతారు. అది వారి రెండవ బాల్యావస్థ। ఈ దశలో పెద్దవారైన అప్పటి పిల్లలు తల్లిదండ్రులకు ఆధారం అంటే ప్రతిష్ఠ. ఆధారపడిన తల్లిదండ్రులు ప్రతిష్ఠితం అవుతారు.

మనం ఆక్సిజన్ పీల్చి కార్బన్ డై ఆక్సైడ్ వదులుతాం. చెట్లు కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకుని ఆక్సిజన్‌ను వదులుతాయి. ఈ విధంగా పర్యావరణం రక్షించబడుతోంది. చెట్లు కొట్టివేయడంతో ఈ విధంగా భగవంతుడు నియమించిన పర్యావరణ భద్రతకి ఆటంకం ఏర్పడుతోంది.

**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః**

**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి. గీత 3-16**

గీతలో శ్రీకృష్ణ భగవానుడు, ఈ సృష్టిలో ధర్మచక్రం ప్రవర్తింపజేసాడు. ధర్మచక్రం - మనుష్యులు, కర్మలు (పంచ మహా యజ్ఞాలు), పుణ్యం, వృష్టి (వర్షం), అన్నం, మనుష్యులు. ఇది ధర్మచక్రం. పంచ మహా యజ్ఞాలు చేయని మనిషి ఇంద్రియలోలుడై, పాపజీవనం జీవిస్తున్నవాడు. అతను వ్యర్థమైన జీవితం జీవిస్తున్నాడు.

ఉపాసనా పరంగా అన్న - అన్నాద సంబంధం, ప్రతిష్ఠా, ప్రతిష్ఠిత సంబంధాలను చూపటానికి ఉదాహరణగా ఉపనిషత్తు మూడు జంటల మధ్య చెప్పింది. ఈ విధంగా జగత్తులో అంతా పరస్పరం ఆధారపడి ఉంటాయని ఇక్కడ ఏదీ స్వతంత్రంగా లేదని తెలుసుకోవాలి. ఈ మూడు జంటల మధ్య

ఉపాసన చేసిన వారు నిరాధారులవరు. వారికి ఎప్పుడు ఏదో ఒక చోట నుంచి ఆధారం దొరుకుతుంది. ఉపాసనకు తీసుకోవాల్సిన మూడు జంటలు
1. ప్రాణం – శరీరం 2. జలం – అగ్ని 3. పృథివీ – ఆకాశం.

**అన్నం న నింద్యాత్। తద్వ్రతమ్।**

అన్నాన్ని నిందించరాదు. కంచంలో పెట్టించుకున్న అన్నాన్ని ఆక్షేపణ చేయకుండా తినడం వ్రతం. చాలామంది వంకలు పెడుతూ తినే అన్నాన్ని ఏహ్యాభావంతో, తృణీకారంతో చూస్తారు. అది తగనిపని అని ఉపనిషత్తు చెబుతోంది. నేలమీద పడిన అన్నాన్ని చేత్తో తీయాలి. చీపురుతో తుడవరాదు. **అన్నం బ్రహ్మ.** అన్నాన్ని దైవంగా భావించి తినేముందు ఈశ్వరునికి అర్పించి తినాలి. అన్నం ఈశ్వర ప్రసాదంగా భావించి తినాలి. ఇది ఒక వ్రతం.

**ప్రాణం – శరీరం అన్న అన్నాద సంబంధము–**

**ప్రాణో వా అన్నమ్।**

ఒక కోణంలో, ప్రాణశక్తిని అన్నంగా భావించవచ్చు. శరీరం ప్రాణవాయువును పీల్చి జీవిస్తోంది. ప్రాణవాయువు శరీరంతో తినబడుతోంది. ప్రాణవాయువు అన్నం.

**శరీరమన్నాదమ్।**

శరీరం ప్రాణ వాయువును తినేది కనుక అన్నాదం.

**ప్రాణో వా అన్నాదః శరీరం అన్నమ్.**

దీనినే మరొక కోణంలో ఇలా కలుపుకోవాలి. మనం దేహ శ్రమ చేస్తే మనలోని ప్రాణశక్తి వల్ల క్రొవ్వు పదార్థం కరిగిపోతుంది. అంటే ప్రాణశక్తి శరీరాన్ని తినేస్తోంది. శరీరం అన్నం, ప్రాణశక్తి అన్నాదం అయ్యాయి.

**ప్రాణం – శరీరం ప్రతిష్ఠా ప్రతిష్ఠిత సంబంధం –**

**ప్రాణే శరీరం ప్రతిష్ఠితమ్।** ఒక కోణంలో ప్రాణశక్తి వల్లే శరీరం పనిచేస్తోంది. ప్రాణం వల్లే శరీరానికి చేతనశక్తి, క్రియాశక్తి సమకూరుతాయి. కాబట్టి శరీరం ప్రాణశక్తికి ఆధారం – ప్రతిష్ఠా, శరీరం ప్రాణశక్తిపై ఆధారపడినది – ప్రతిష్ఠితం.

**శరీరే ప్రాణః ప్రతిష్ఠితః**

మరొక కోణంలో ప్రాణశక్తి శరీరం అనే పెట్టెలో ఉన్నప్పుడే ఈ క్రియాకలాపం అంతా జరుగుతుంది. అంటే ప్రాణానికి శరీరం ఆధారం – ప్రతిష్ఠా, ప్రాణం శరీరం మీదే ఆధారపడినది – ప్రతిష్ఠితం.

ఈ ఉపాసకుడికి సంఘం నుంచి, కుటుంబ సభ్యుల నుంచి, జగత్తు నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. **యద్భావం తద్భవతి.**

**తదేత దన్న మన్నే ప్రతిష్ఠితమ్।**

అన్నం అన్నం మీద ఆధారపడింది. మొదటి అన్నం – ప్రాణం, రెండవ అన్నం – శరీరం. ప్రతిష్ఠితం అంటే ఒకదానిపై ఒకటి ఆధారపడ్డాయి.

**స య ఏత దన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి।**

ఈ విధంగా అన్నం అన్నం మీద ఆధారపడిందని ఉపాసన చేయాలి. ఇక్కడ వేద అంటే తెలుసుకోవడం కాదు. ఉపాసన చేయడం.

**అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా।**

ఈ విధంగా అన్న వ్రతం – అన్న – అన్నాదం, ప్రతిష్ఠా – ప్రతిష్ఠిత ఉపాసనలు చేసిన వారికి, అన్నం లోటు ఉండదు. సంతానం వృద్ధి చెందుతుంది. పశుసంపద, ధనసంపదలతో తులతూగుతారు. మంచి కీర్తిమంతులౌతారు.

## అనువాకం – 8

**అన్నం న పరిచక్షీత। తద్వ్రతమ్। అపో వా అన్నమ్। జ్యోతిరన్నాదమ్। అప్సు జ్యోతిః ప్రతిష్ఠితమ్। జ్యోతిష్యాపః ప్రతిష్ఠితాః। తదేత దన్న మన్నే ప్రతిష్ఠితమ్। స య ఏత దన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మ వర్చసేన। మహాన్ కీర్త్యా।**

**అన్నం న పరిచక్షీత। తద్వ్రతమ్**

అన్నాన్ని వృథా చేయరాదు. కంచంలో పెట్టించుకున్న అన్నం వదలకుండా తినడం వ్రతం. చాలామంది అన్నం కెలికిపెడుతూ తినే అన్నాన్ని సగానికి సగం వదిలివేస్తారు. అది తగనిపని అని ఉపనిషత్తు చెబుతోంది. అన్నం మిగిలితే దానిని పంచి సద్వినియోగం చేయాలి. చెత్తకుండీలో వేయకూడదు. అన్నం బ్రహ్మ, అన్నాన్ని దైవంగా భావించి తినేముందు ఈశ్వరునికి అర్పించి తినాలి. అన్నం ఈశ్వరప్రసాదంగా భావించి తినాలి. రైతు రాత్రనక పగలనక ఎంతో శ్రమిస్తేనే మనకి అన్నం సమకూరుతోంది అన్నాన్ని పాడు చేయొద్దు. ఇది ఒక వ్రతం.

**జలం - అగ్ని అన్న అన్నాద సంబంధం -**

**ఆపో వా అన్నమ్।**

ఒక కోణంలో, అగ్నిని అన్నంగా భావించవచ్చు. దాహం వేసినప్పుడు మనలోని జఠరాగ్ని రగులుకొంటుంది. నీళ్ళు తాగితే దాహం తీరుతుంది. అంటే నీటిని అగ్ని కబళించింది. నీరు అగ్నితో తినబడుతోంది. నీరు అన్నము.

**జ్యోతిరన్నాదమ్।**

అగ్ని తినేది కనుక అన్నాదం.

**అపో వా అన్నాదః జ్యోతిః అన్నమ్.**

అని మళ్లీ కలుపుకోవాలి. బయట ఎక్కడైనా నిప్పంటుకుంటే, నీళ్ళు పోసి ఆర్పివేస్తాం. ఇక్కడ నీరు అగ్నిని తింటోంది. అగ్ని అన్నం. నీరు అన్నాదం అయ్యాయి.

**జలం - అగ్ని ప్రతిష్ఠా ప్రతిష్ఠిత సంబంధం -**

**అప్సు జ్యోతిః ప్రతిష్ఠితమ్।**

రెండు సందర్భాలలో చూడవచ్చు దీనిని. వర్షం పడే సమయంలో మేఘాలలో ఉండే జలతత్వం వల్ల విద్యుల్లతలు ఏర్పడుతాయి. అంటే జలతత్వం వల్ల అగ్ని పుట్టింది. ఈ విధంగా అగ్ని జలం మీద ఆధారపడింది. జలం ప్రతిష్ఠా, అగ్ని ప్రతిష్ఠితం.

అలాగే మన శరీర ఉష్ణోగ్రత $98.4^0$ ఫారిన్‌హీట్ ఉండాలంటే శరీరం నుంచి వచ్చే స్వేద బిందువులు సహకరిస్తాయి. ఈ విధంగా జలతత్వం మీద అగ్ని ఆధారపడింది. జలం ప్రతిష్ఠా, అగ్ని ప్రతిష్ఠితం.

**జ్యోతిష్యాపః ప్రతిష్ఠితాః।**

సృష్టి ప్రకరణంలో ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు వచ్చినట్టు తెలుస్తోంది. అగ్ని కారణం, నీరు కార్యం అయింది. అగ్ని ప్రతిష్ఠా, నీరు అగ్నిపై ఆధారపడినది- ప్రతిష్ఠితం.

**తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్।**

అన్నం, అన్నం మీద ఆధారపడింది. మొదటి అన్నం నీరు, రెండవ అన్నం అగ్ని. ప్రతిష్ఠితమ్ అంటే ఒక దానిపై ఒకటి ఆధారపడ్డాయి.

**స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి।**

ఈ విధంగా అన్నం అన్నం మీద ఆధారపడిందని ఉపాసన చేయాలి. ఇక్కడ వేద అంటే తెలుసుకోవడం కాదు. ఉపాసన చేయడం.

**అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్ బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా।**

ఈ విధంగా అన్నవ్రతం, అన్న అన్నాదము, ప్రతిష్ఠా ప్రతిష్ఠిత ఉపాసనలు చేసిన వారికి, అన్నం లోటు ఉండదు. సంతానం వృద్ధి చెందుతుంది. పశుసంపద, ధన సంపదలతో తులతూగుతారు. బ్రహ్మవర్చస్సుతో వెలిగిపోతారు. మంచి కీర్తిమంతులౌతారు.

## అనువాకం – 9

**అన్నం బహుకుర్వీత। తద్వ్రతమ్।పృథివీ వా అన్నమ్। ఆకాశోన్నాదః। పృథివ్యామాకాశః ప్రతిష్ఠితః। ఆకాశే పృథివీ ప్రతిష్ఠితా। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మ వర్చసేన మహాన్ కీర్త్యా।**

**అన్నం బహుకుర్వీత తద్వ్రతమ్।**

అన్నాన్ని ఎక్కువగా వృద్ధి చేయాలి. అన్నార్తులకు అన్నంను దానం చేయాలి. ఇది గృహస్థ ధర్మం. ఇది వ్రతం కూడా. బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు – ఈ మూడు కోవలకు చెందినవారు గృహస్థను అన్నం కోసం ఆశ్రయిస్తారు. అందుకని గృహస్థ అన్నాన్ని సమృద్ధిగా పండించాలి. సమృద్ధిగా వండాలి అని ఉపనిషత్తు చెబుతోంది. కేవలం కుటుంబ సభ్యుల మేరకు వండుకోకుండా అదనంగా వండాలి. అందరికీ లేదనకుండా పెట్టాలి. అన్నం బ్రహ్మ, అన్నాన్ని దైవంగా భావించి తినేముందు ఈశ్వరునికి అర్పించి తినాలి. అన్నం ఈశ్వర ప్రసాదంగా భావించి తినాలి. ఇది ఒక వ్రతం.

**పృథివీ – ఆకాశం అన్న అన్నాద సంబంధం –**

**పృథివీ వా అన్నమ్।** ఒక కోణంలో, ప్రళయంలో పృథివిని అన్నంగా భావించవచ్చు. ప్రళయంలో పృథివి నీరులోనూ, నీరు అగ్నిలోనూ, అగ్ని వాయువులోనూ, వాయువు ఆకాశంలోనూ విలీనం అవుతాయి. అంటే పృథివి ఆకాశంలో విలీనం అవుతుంది. పృథివిని ఆకాశం కబళించింది. పృథివి

ఆకాశంతో తినబడుతోంది. పృథివి అన్నము.

**ఆకాశోన్నాదః।**

ఆకాశం తినేది కనుక అన్నాదం అయ్యింది.

**పృథివీ వా అన్నాదమ్। ఆకాశః అన్నమ్।**

అని కలుపుకోవాలి. ఇంట్లో ఫర్నిచర్ ఇంట్లోని ఖాళీ స్థలాన్ని మ్రింగివేస్తుంది. ఇక్కడ ఫర్నిచర్ అంటే పృథివీ. అది ఆకాశాన్ని తింటోంది. ఆకాశం అన్నం, పృథివీ అన్నాదం అయ్యాయి.

**పృథివి – ఆకాశం ప్రతిష్ఠా, ప్రతిష్ఠిత సంబంధం –**

**పృథివ్యామాకాశః ప్రతిష్ఠితః।–**

అలాగే ఒక కోణంలో పృథివీ ఆకాశానికి ప్రయోజకత్వాన్ని చేకూరుస్తుంది. గదికి గోడలుండడం వల్ల గదిలోని ఆకాశం వినియోగంలోకి వచ్చింది. ఈ విధంగా ప్రయోజనాయోగ్యత కోసం ఆకాశం, పృథివి మీద ఆధారపడింది. పృథివి ప్రతిష్ఠా, ఆకాశం ప్రతిష్ఠితం.

**ఆకాశే పృథివీ ప్రతిష్ఠితా।**

సృష్టి ప్రకరణంలో ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు, నీరు నుంచి పృథివీ వచ్చినట్టు తెలుస్తోంది. ఆకాశం కారణం, పృథివీ కార్యం అయ్యాయి. ఆకాశం ప్రతిష్ఠా, పృథివీ ప్రతిష్ఠితం అయ్యాయి.మానసిక ప్రశాంతత కలుగుతుంది.

**తదేత దన్నమన్నే ప్రతిష్ఠితం।**

ఈ విధంగా అన్నం అన్నం మీద ఆధారపడింది. మొదటి అన్నం పృథివీ, రెండవ అన్నం ఆకాశం.

**స య ఏత దన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి।**

ఈ విధంగా అన్నం అన్నం మీద ఆధారపడిందని ఉపాసన చేయాలి. ఇక్కడ వేద అంటే తెలుసుకోవడం కాదు. ఉపాసన చేయడం.

**అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్ బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా।**

ఈ విధంగా అన్నవ్రతం, అన్న అన్నాదం, ప్రతిష్ఠా ప్రతిష్ఠిత ఉపాసనలు చేసిన వారికి, అన్నం లోటు ఉండదు. సంతానం వృద్ధి చెందుతుంది.

పశుసంపద, ధనసంపదలతో తులతూగుతారు. బ్రహ్మవర్చస్సుతో వెలిగిపోతారు. మంచి కీర్తిమంతులౌతారు.

ఈ విధమైన ఉపాసనల వల్ల మూడు విషయాలు తేటతెల్లమౌతున్నాయి.

1. జగత్తు అంతా ఈశ్వరుని శరీరం. కాబట్టి ఈశ్వరుడు ఎక్కడో లోకాలలో దూరంగా లేడు. అవ్యక్తంగా ఉన్న ఈశ్వరుడు జగత్తుగా ప్రకటమౌతున్నాడు.

2. ఇక్కడ ఉన్న సర్వమూ పరస్పర ఆశ్రితాలై ఉన్నాయి. ఏదీ స్వతంత్రంగా లేదు. ప్రతిదీ మరొకదాని మీద ఆధారపడినదే।

3. ఆధారపడేవన్నీ మిథ్యావస్తువులే.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నా పరః**

| **అన్నం (తినబడేది)** | **అన్నాదం (తినేది)** | **ఉదాహరణ** |
|---|---|---|
| అన్నం | శరీరం | జీవించి ఉండగా శరీరం అన్నాన్ని తింటుంది. |
| శరీరం | అన్నం | మరణించాక శరీరం పంచ భూతాలలో కలిసిపోతుంది. అంటే శరీరాన్ని పంచభూతాలు తింటాయి. |

| **ప్రతిష్ఠా (ఆధారం)** | **ప్రతిష్ఠితం (ఆధేయం)** | **ఉదాహరణ** |
|---|---|---|
| తల్లిదండ్రులు | పిల్లలు | బాల్యావస్థలో తల్లిదండ్రులు పిల్లలకు ఆధారం. |
| పిల్లలు | తల్లిదండ్రులు | పెద్దయ్యాక పిల్లలే తల్లిదండ్రులకు ఆధారం. |

**ప్రాణం – శరీరం**

| **అన్నం (తినబడేది)** | **అన్నాదం (తినేది)** | **ఉదాహరణ** |
|---|---|---|
| ప్రాణం | శరీరం | శ్వాసక్రియ ద్వారా శరీరం ప్రాణాన్ని తింటుంది. |

| | | |
|---|---|---|
| శరీరం | ప్రాణం | కసరత్తు వల్ల ప్రాణం శరీరంలోని క్రొవ్వును కరిగిస్తుంది. అంటే శరీరాన్ని ప్రాణం తింటోంది. |

| **ప్రతిష్ఠా (ఆధారం)** | **ప్రతిష్ఠితం (ఆధేయం)** | **ఉదాహరణ** |
|---|---|---|
| ప్రాణం | శరీరం | బ్రతికుండాలంటే శరీరానికి ప్రాణం ఆధారం |
| శరీరం | ప్రాణం | శరీరం ఆశ్రయమిస్తేనే ప్రాణం కార్యకలాపాలు చేయగలదు. అంటే ప్రాణానికి శరీరం ఆధారం. |

అగ్ని–జలం

| **అన్నం (తినబడేది)** | **అన్నాదం (తినేది)** | **ఉదాహరణ** |
|---|---|---|
| జలం | అగ్ని | దాహం వేసినప్పుడు మంచినీళ్ళు తాగుతాం. జఠరాగ్ని జలాన్ని స్వీకరిస్తుంది. |
| అగ్ని | జలం | బాహ్యంగా నిప్పు ఆర్పేటప్పుడు, నీళ్ళు జల్లుతాం. ఇక్కడ నీరు అగ్నిని తింటోంది. |

| **ప్రతిష్ఠా (ఆధారం)** | **ప్రతిష్ఠితం (ఆధేయం)** | **ఉదాహరణ** |
|---|---|---|
| అగ్ని | జలం | సృష్టిక్రమంలో అగ్ని నుంచి జలం పుట్టింది. అగ్ని జలానికి ఆధారం అయింది. |
| జలం | అగ్ని | ఎ) వర్షం పడే సమయంలో విద్యుల్లతలు ఏర్పడుతాయి. |

| | | |
|---|---|---|
| | | అంటే జలతత్వం అగ్నికి ఆధారం. |
| | | బి) మన శరీరంలో ఉష్ణోగ్రత $98.4^0$ ఫారిన్ హీట్ ఉండాలంటే స్వేద బిందువులు దానికి తోడ్పడుతాయి. అంటే జలతత్వం అగ్నికి ఆధారం. |

**పృథివి – ఆకాశం**

| **అన్నం (తినబడేది)** | **అన్నాదం (తినేది)** | **ఉదాహరణ** |
|---|---|---|
| ఆకాశం | పృథివి | ఇంట్లో ఫర్నిచర్ (పృథివీ) వల్ల ఖాళీ జాగా అంతా పోతుంది. |
| పృథివీ | ఆకాశం | ప్రళయంలో పృథివీ ఆకాశంలో విలీనం అవుతుంది. అంటే పృథివీని ఆకాశం తింటోంది. |

| **ప్రతిష్ఠా (ఆధారం)** | **ప్రతిష్ఠితం (అధేయం)** | **ఉదాహరణ** |
|---|---|---|
| ఆకాశం | పృథివి | సృష్టిక్రమంలో ఆకాశం నుంచి క్రమంగా పృథివీ పుడుతుంది. పృథివీకి ఆకాశమే ఆధారం. |
| పృథివి | ఆకాశం | ఒక గదిలోని ఆకాశానికి ప్రయోజనం కలగాలంటే, గది గోడలు (ఫృథివీ) అవసరం. అంటే ఆకాశానికి ఫృథివీ ఆధారం. |

## అనువాకం – 10

**న కంచన వసతౌ ప్రత్యాచక్షీత। తద్వ్రతమ్। తస్మాద్యయా కయా చ విధయా బహ్వన్నమ్ ప్రాప్నుయాత్। అరాధ్యస్మా అన్నమిత్యాచక్షతే। ఏతద్వై ముఖతో న్నగ్ం**

రాద్ధమ్। ముఖతోస్మా అన్నగ్ం రాధ్యతే। ఏతద్వై మధ్యతో న్నగ్ం రాద్ధమ్। మధ్యతోస్మా అన్నగ్ం రాధ్యతే। ఏతద్వా అంతతోన్నగ్ం రాద్ధమ్। అంతతో స్మా అన్నగ్ం రాధ్యతే। య ఏవం వేద॥

క్షేమ ఇతి వాచి। యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః। కర్మేతి హస్తయోః। గతిరితి పాదయోః। విముక్తిరితి పాయౌ। ఇతి మానుషీ స్సమాజ్ఞాః।

అథ దైవీః। తృప్తి రితి వృష్టౌ। బలమితి విద్యుతి। యశ ఇతి పశుషు। జ్యోతిరితి నక్షత్రేషు। ప్రజాతి రమృతమానంద ఇత్యుపస్థే। సర్వమిత్యాకాశే।

తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి। తన్మహ ఇత్యుపాసీత। మహాన్ భవతి। తన్మన ఇత్యుపాసీత। మానవాన్ భవతి తన్నమ ఇత్యుపాసీత నమ్యన్తేస్మై కామాః। తద్బ్రహ్మేత్యుపాసీత। బ్రహ్మవాన్ భవతి। తద్ బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత। పర్యేణం మ్రియన్తే ద్విషన్తస్సపత్నాః। పరియేఽ ప్రియాభ్రాతృవ్యాః।

స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః। స య ఏవంవిత్। అస్మాల్లోకాత్ ప్రేత్య। ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రమ్య। ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రమ్య। ఏతం మనోమయ మాత్మాన ముపసంక్రమ్య। ఏతం విజ్ఞానమయ మాత్మానముపసంక్రమ్య। ఏతమానందమయ మాత్మాన ముపసంక్రమ్య।

ఇమాన్ లోకాన్ కామాన్నీ కామ రూప్యనుసంచరన్। ఏతత్సామ గాయన్నాస్తే। హా(3)వు। హా(3)వు। హా(3)వు। అహమన్నమహమన్నమహమన్నమ్। అహమన్నాదో (2)ఽ హమన్నాదో(2)ఽ హమన్నాదః। అహగ్ శ్లోకకృ దహగ్ శ్లోకకృదహగ్ శ్లోకకృత్। అహమస్మి ప్రథమజా ఋతా(3)స్య। పూర్వం దేవేభ్యో అమృతస్య నా(3) భాఇ యోమా దదాతి స ఇదేవ మా(3)వాః। అహమన్నమన్న మదన్తమా(3)ద్మి। అహం విశ్వం భువనమభ్యభవామ్। సువర్న జ్యోతీః। య ఏవం వేద। ఇత్యుపనిషత్।

**న కంచన వసతౌ ప్రత్యాచక్షీత। తద్వ్రతమ్।**

కంచన వసతౌ న ప్రత్యాచక్షీత। తద్వ్రతమ్। ఎవరైనా వసతి కోరి మీ దగ్గరకు వస్తే ఆశ్రయం ఇవ్వకుండా తిరస్కరించి పంపవద్దు. ఇది వ్రతం. పూర్వం హొటల్స్ ఉండేవి కావు. ఆహారం అమ్మేవారు కాదు. ఈ నేపథ్యంలో ఊరిలోకి వచ్చిన బాటసారులు తప్పనిసరిగా రాత్రి ఎవరి ఇంట్లోనో గడపాల్సి వచ్చేది. ఆ రోజుల్లో అందరు ధర్మమార్గంలో నడుస్తూ, సద్బుద్ధితో ఉండేవారు.

ఇప్పుడు పరిస్థితి వేరు. అపరిచితులను ఒక రోజు మనింట్లో ఉంచాలంటే ఆలోచించాల్సిన రోజులివి. దేశకాలమాన పరిస్థితులు బాగా మారిపోయాయి. అభద్రతా భావం పెరిగిపోయింది. అపరిచితులకు ఆశ్రయాన్నిచ్చి కోరి కష్టాలు తెచ్చుకోవద్దు. అందుకు ప్రత్యామ్నాయంగా అలా వచ్చే యాత్రికులకు సదుపాయం కలిగించే వసతి గృహాలకు ఇతోధికంగా సహాయపడవచ్చు.

**తస్మాద్యయా కయా చ విధయా బహ్వన్నమ్ ప్రాప్నుయాత్।**

అందువల్ల ఏదో ఒక విధంగా అన్నాన్ని సమృద్ధిగా సమకూర్చుకోండి. అతిథి అంటే తిథి వారాలు చూడకుండా, చెప్పాపెట్టకుండా వచ్చేవాడని అర్థం. అతిథులకు భోజన సదుపాయం ఏర్పరచాలంటే మన దగ్గర ఆహార దినుసులు ఎప్పుడూ పుష్కలంగా ఉండాలి. అందువల్ల ఏదో ఒక విధంగా అన్నాన్ని సమృద్ధిగా సమకూర్చుకోండి అంటోంది శ్రుతి. ఏదో ఒక విధంగా అంటే అధర్మమార్గంగా అని తీసుకోకూడదు. అప్పటికప్పుడు సరుకుల కోసం పరుగులు తీయకుండా మన దగ్గర నిలవ ఉంటే అతిథులను సత్కరించడానికి అనుకూలంగా ఉంటుంది.

**అరాధ్యస్మా అన్నమిత్యాచక్షతే।**

అన్నం మీ కోసం తయారుగా ఉంది అని చెప్పటానికి పుష్కలంగా అన్నం సమ కూర్చుకోవాలి. ఇది కూడా ఈ రోజుల్లో సాధ్యం కావటం లేదు. ఇప్పటి కుటుంబ వ్యవస్థ చాలా మారిపోయింది. కుటుంబ సభ్యులు ఇంట్లో గడిపే సమయం తగ్గిపోయింది. కాలంతో పరుగులు మొదలయ్యాయి. ప్రత్యామ్నాయంగా అన్నదానం జరిపే సంస్థలకు శక్తి కొలది ధనసాయం చేయవచ్చు.

అలా అన్నదానం చేసేటప్పుడు ఎంత చేసిన వాడికి అంత మహదేవా అన్నట్లుగా – మనం చేసిన అన్నదానం శ్రేష్ఠతను బట్టి మనకి ఫలితం వస్తుంది. దీన్ని

ఇలా అర్థం చేసుకోవచ్చు.

**ఏతద్వై ముఖతోఽన్నగ్ం రాద్ధమ్।**

ఎవరు చాలా శ్రద్ధతో శ్రేష్ఠమైన అన్నదానం చేస్తారో వారికి శ్రేష్టమైన ఆహారం లభిస్తుంది.

**ఏతద్వై మధ్యతోఽన్నగ్ం రాద్ధమ్।**

ఎవరు మధ్యతరహా అన్నదానం చేస్తారో వారికి మధ్యతరహా అన్నం లభిస్తుంది.

**ఏతద్వా అంతతోఽన్నగ్ం రాద్ధమ్।**

ఎవరు అధమ తరహా (పాచిపోయిన అన్నం) అన్నదానం చేస్తారో వారికి అధమతరహా (పాచిపోయిన అన్నం) అన్నం లభిస్తుంది. కాబట్టి దానంలో కూడా మనం చేసే విధానం బట్టి మనకి దాని వల్ల వచ్చే లాభం ఉంటుంది.

**య ఏవం వేద।**

ఈ విధంగా తెలుసుకుని దానం చేసిన వారికి పుణ్యం లభిస్తుంది.

ఇక ఉపనిషత్తు రెండు రకాల ఉపాసనలు చెబుతోంది. మొదటి తరహా ఉపాసనలు ఆధ్యాత్మం అంటే మన శరీర భాగాలకి సంబంధించినవి. శరీరం జడమైనది. అది తనకు తానుగా ఏదీ చేయలేదు. ఆ పరబ్రహ్మ వల్లే ఈ శరీరభాగాలకు వాటి వాటి సామర్థ్యం కలుగుతోంది. ఈ దిశగా ఒక్కొక్క అంగాన్ని బ్రహ్మభావనతో ఉపాసన చేయాలి.

శ్రుతి చెప్పే ఆ భాగాలేమిటో చూద్దాం!

**క్షేమ ఇతి వాచి। యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః। కర్మేతి హస్తయోః। గతిరితి పాదయోః। విముక్తిరితి పాయౌ। ఇతి మానుషీ స్సమాజ్ఞాః।**

**క్షేమ ఇతి వాచి। బ్రహ్మ ఉపాసీత** (కలుపుకోవాలి) వాక్కులో బ్రహ్మను ఉపాసన చేయాలి. వాక్కు సరిగ్గా ఉంటేనే ఆదరణ, గౌరవం. క్షేమం అంటే రక్షణ. వాక్కును కాపాడుకుంటేనే జీవితం సజావుగా సాగుతుంది. మాట తూలితే వెనక్కు తీసుకోలేం. మనుష్యుల మధ్య సంబంధాలు మాటవల్లే పటిష్టం అవుతాయి. మాట వల్లే వీగిపోతాయి. ఈ విధంగా వాక్ బ్రహ్మ ఉపాసన చేసినవారు మధురమైన వాక్కులతో జనాదరణ పొంది అందరిచేత గౌరవింపబడుతారు.

**లక్ష్మీర్వసతి జిహ్వాగ్రే–**

**జిహ్వాగ్రే మిత్ర బాంధవాః।**
**బంధనం చైవ జిహ్వాగ్రే।**
**జిహ్వాగ్రే మరణం ధృవమ్॥**

నాలుక మీద లక్ష్మీదేవి నివసిస్తూంటూంది. నాలుక వల్లే మిత్రులు, బంధువులు ఏర్పడుతారు. నాలుకే బంధనం. నాలుకే మరణాంతకం కూడా! మంచి మాటలు మాట్లాడటానికి ఎందుకు వెనకాడాలి? **వచనే కా దరిద్రతా, యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః।**

**యోగం అంటే అప్రాప్తస్య ప్రాప్తం.** మన దగ్గర లేని దానిని సంపాదించు కోవడం. క్షేమం అంటే అలా సంపాదించుకున్నదానిని నిలబెట్టుకోవటం.

**ప్రాణః** అంటే **ప్రాగ్ గమనవాన్ వాయుః** నాసికల నుంచి ముందుకు ప్రవహించే వాయువు. అంటే మనం వదిలే శ్వాస.

అపానం అంటే అథోగమనవాన్ వాయుః లోపలికి లేక క్రిందకి ప్రవహించే వాయువు. మనం పీల్చే శ్వాస.

ఆ విధంగా బ్రహ్మను ఉచ్ఛ్వాస నిశ్వాసలకు కారణంగా ఉపాసన చేయాలి. ఈ రెండు శ్వాసలు యోగక్షేమాలుట. ఎలాగా? ఉచ్ఛ్వాస నిశ్వాసలుంటేనే ఏదైనా తెచ్చి పెట్టుకోవడం, దానిని కాపాడడం. ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఆగిపోతే యోగ క్షేమాలకు అర్థం లేదు.

కౌంటు లియో టాల్‌స్టాయ్ కథ ఒకటి ఉంది. ఒక ధనవంతుడు ఎవరికైనా కోరినంత భూమి ఇస్తానన్నాడు. కాకపోతే ఒక షరతు విధించాడు. ఏమిటది? అతను సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పరుగుతీయాలి. అతను పరుగులు తీసినంత మేరకు భూమి అతని పరం అవుతుంది. ఒక వ్యక్తి అన్నపానాదులు కూడా స్వీకరించకుండా పరుగులు తీస్తూనే ఉన్నాడు. సూర్యాస్తమయానికి కొన్ని ఘడియలు మిగిలాయి. బాగా రొప్పుతున్నాడు. శ్వాస ఆగిపోయే పరిస్థితి. అయినా ఇంకొంచెం పరుగుతీస్తే ఇంకొంచెం భూమి సొంతం చేసుకోవచ్చు అని అడుగు వేసి ఆఖరు శ్వాస వదిలాడు. ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఆగిపోతే సంపాదనకు అర్థం లేదు.

కనుక ఉచ్ఛ్వాస నిశ్వాసలు యోగక్షేమాలుగా, బ్రహ్మగా ఉపాసన చేయాలి. ఈ విధంగా ఉచ్ఛ్వాస నిశ్వాసలు బ్రహ్మ అని ఉపాసన చేసినవారు

దీర్ఘాయుష్షుతో, సిరిసంపదలతో తులతూగుతారు.

**కర్మేతి హస్తయోః**

చేతుల్లోని క్రియాశక్తికి బ్రహ్మే కారణం అని ఉపాసన చేయాలి. చేతులు పని చేస్తున్నంతసేపు వాటి గొప్పతనం మనం గమనించం. **రుద్రం- అయం మే హస్తో భగవాన్ అయం మే భగవత్తరః** ఈ ఎడమ చేతిలో భగవత్ శక్తి ఉంది. కుడిచేతిలో దానిని మించిన భగవత్ శక్తి ఉంది. కుడిచేయి పూజ చేయటానికి యోగ్యత ఉంది కనుక అలా చెప్పబడింది. ఆ చేతులను చూస్తూ వాటి గొప్పతనాన్ని శ్లాఘిస్తాడు రుద్రాధ్యయనం చేసేటప్పుడు. ఈ విధంగా చేతుల్లో బ్రహ్మను ఉపాసన చేసినవారు చక్కటి కర్మలు చేసి పుణ్యాన్ని ఆర్జిస్తారు.

**గతిరితి పాదయోః।**

మనం ఒక చోటు నుంచి మరొక చోటుకు వెళ్ళగలుగుతున్నాము అంటే పాదాలే కారణం. జడమైన పాదాలకు ఈ శక్తి బ్రహ్మవల్లే వచ్చింది. ఈ విధంగా పాదాలలో బ్రహ్మను ఉపాసన చేయాలి. పాదాలలో బ్రహ్మను ఉపాసన చేసినవారు తీర్థయాత్రలు మొదలైన ప్రయాణాలు సునాయాసంగా చేయగలుగుతారు.

**విముక్తిరితి పాయౌ।**

మల విసర్జన ద్వారా మన శరీరంలోని మలినాలను బయటకు పంపే శక్తి కూడా ఆ బ్రహ్మవల్లే కలుగుతుంది. మన శరీరంలో చాలా రుగ్మతలు మలవిసర్జన సరిగ్గాజరగకపోవడం వల్లే కలుగుతాయి. అది సక్రమంగా జరగటానికి ఆ బ్రహ్మే కారణం. ఈ విధంగా విసర్జనేంద్రియంలో బ్రహ్మను ఉపాసన చేయాలి. ఈ విధంగా విసర్జనేంద్రియంలో బ్రహ్మను ఉపాసన చేసిన వారికి మలవిసర్జన తేలిగ్గా జరిగి రోగాలు లేకుండా వారు ఆరోగ్యవంతులుగా ఉంటారు.**ప్రజాతిరమృత–మానంద ఇత్యుపస్థే।** ఇది కూడ శరీర భాగాలకు సంబంధించిన ఉపాసన కనుక ఈ వాక్యం తరువాతి అనువాకం నుంచి తేబడింది.జననేంద్రియం ద్వారా సంతతి పొంది, తద్వారా మనిషి తన గుణాలను, పోలికలను శాశ్వతంగా లోకంలో నిలుపుతున్నాడు. అమృతం అనడంలో ఉద్దేశం ఇదే.సంభోగ ఆనందము కూడా ఈ జననేంద్రియం వల్లే కలుగుతోంది. జడమైన జననేంద్రియం ఈ విధంగా సంతతిని, ఆనందాన్ని ఇవ్వగలుగుతోంది

అంటే బ్రహ్మే కారణం. జననేంద్రియంలో బ్రహ్మను ఉపాసన చేయాలి. ఈ విధంగా జననేంద్రియంలో బ్రహ్మను ఉపాసన చేసినవారు మంచి సంతానంతో సంసార జీవనం గడుపుతారు.

వైదికపరంగా మనకు ఏదీ చెడ్డదీ లేదు, తీసి పారేసేదీ లేదు. అన్నీ ఈశ్వర ప్రసాదమే. అంతా దైవ ప్రసాదమే.

సాధారణంగా ఉపాసనలు చెప్పి వాటి ఫలం కూడా చెప్పడం జరుగుతుంది. ఇక్కడ ఉపాసనా ఫలం చెప్పలేదు కనుక మనం వాటిని గ్రహించవలసి ఉంటుందని శంకరులు సూచించారు. ఇవే ఉపాసనలు నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్త విశాలత, చిత్త ఏకాగ్రత తద్వారా గురుప్రాప్తి, జ్ఞానప్రాప్తి కలుగుతాయి.

**ఇతి మానుషీ-స్సమాజ్ఞాః।**

ఇవి మన శరీరపరంగా చెప్పబడిన ఉపాసనలు.

**అథ దైవీః। తృప్తి రితి వృష్టౌ। బలమితి విద్యుతి। యశ ఇతి పశుషు। జ్యోతిరితి నక్షత్రేషు। ప్రజాతి రమృతమానంద ఇత్యుపస్థే। సర్వమిత్యాకాశే।**

**అథ దైవీః (సమాజ్ఞాః)। సమాజ్ఞాః**

కలుపుకుంటే ఉపాసనలు అని అర్థం వస్తుంది. ఇప్పుడు కొన్ని దైవీ ఉపాసనలు చెప్పబడుతున్నాయి.

**తృప్తిరితి వృష్టౌ।**

వృష్టి అంటే వర్షం. సకాలంలో వర్షం పడటం వల్ల దేశం సుభిక్షం అవుతుంది. వర్షం ద్వారా మనకు కనపడుతున్న ఈ దైవీశక్తిని బ్రహ్మగా ఉపాసన చేయాలి.

**బలమితి విద్యుతి।**

విద్యుల్లతలో ఎంతో శక్తి ఉంది. ఈ శక్తిని వినియోగం చేసుకునే పరిజ్ఞానం మనకు ఇంకా రాలేదు. ఈ దైవీశక్తి బ్రహ్మగా ఉపాసన చేయాలి.

**యశ ఇతి పశుషు।**

పూర్వం పశుసంపదను సంపదగా భావించేవారు. ఆ రోజుల్లో బార్టర్ సిస్టమ్ ఉండేది. ధనం చెలామణిలో లేనప్పుడు వస్తుమార్పిడి విధానం ఉండేది. ధనం బదులుగా ఇన్ని గోవులు అని లెక్కకట్టే వారు. బృహదారణ్యకంలో

జనక మహారాజు ఈ పద్ధతినే అనేక గోవులను దానం చేసినట్టుగా తెలుస్తోంది. ఎంత పశుసంపద ఉంటే అంత ధనికుడిగా జమకట్టేవారు. మరి ధనికుడు ధార్మికుడు కూడా అయితే చాలా కీర్తిమంతు డౌతాడు. గోసంపద ద్వారా యశస్సును ఆర్జించి పెట్టే దైవీశక్తిగా బ్రహ్మను ఉపాసన చేయాలి.

**జ్యోతిరితి నక్షత్రేషు।**

నక్షత్రాలు స్వయం ప్రకాశితాలు. నక్షత్రాల్లో ప్రకాశకత్వాన్నిచ్చే దైవీశక్తిగా బ్రహ్మను ఉపాసన చేయాలి. ఈ విధంగా ప్రకృతి శక్తులన్నీ ఈశ్వర విభూతిగా ఉపాసన చేయాలి.

**సర్వ మిత్యాకాశే।**

సర్వం ఇతి ఆకాశే బ్రహ్మ ఉపాసీత. ఆకాశంలో బ్రహ్మ లక్షణాలు చాలా కనిపిస్తాయి. ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు, నీటి నుంచి పృథివీ. ఇవన్నీ ఆకాశం నుంచే వచ్చాయి. ఈ వ్యక్త ప్రపంచమంతా ఆకాశం నుండే వచ్చింది. కాబట్టి ఆకాశమే సర్వం.

ఆకాశం ఇంద్రియ అగోచరమైనది. ఆకాశం నీలంగా ఉంది కదా! కనిపిస్తున్నది కదా! అని సందేహం రావచ్చు. భూమిపైన వాతావరణ పొరల వల్ల మనకు అలా అనిపిస్తోంది. భూమిని దాటి అంతరిక్షంలో ఆకాశం చిమ్మచీకటిగా ఉంటుంది. అది ఇంద్రియ అగోచరం.

ఆకాశం నిర్మలమైనది. దానిలో ఎటువంటి మలినమూ లేదు.

ఆకాశం ఖండ ఖండాలుగా లేదు. అది ఏకం. అద్వితీయం. సర్వవ్యాపకం. సర్వగతం. సమస్త భౌతిక ప్రపంచానికి ఆధారం. సూక్ష్మమైనది. అంతం లేనిది. ఈ లక్షణాలతో బ్రహ్మను ఉపాసన చేయాలి.

ఇలా ఆకాశ ఉపాసన చేయడం ద్వారా మన బుద్ధి సూక్ష్మంగానూ, పదునుగానూ తయారయి, బ్రహ్మను అర్థం చేసుకోవటానికి సిద్ధంగా ఉంటుంది. అందుకని ఆకాశ ఉపాసన ముఖ్యం. అది తర్వాతి మంత్రంలో వస్తుంది.

**తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి। తన్మహ ఇత్యుపాసీత। మహాన్ భవతి। తన్మన ఇత్యుపాసీత। మానవాన్ భవతి తన్నమ ఇత్యుపాసీత నమ్యన్తేస్మై కామాః। తద్బ్రహేత్యుపాసీత। బ్రహ్మవాన్ భవతి। తద్ బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత।**

**పర్యేణం మ్రియన్తే ద్విషన్తస్సపత్నాః। పరియేஉ ప్రియాభ్రాతృవ్యాః।**

**తత్ ప్రతిష్ఠేత్యుపాసీత।**

ఆకాశమే అన్నింటికీ ఆధారమైన బ్రహ్మగా ఉపాసన చేయాలి.

**ప్రతిష్ఠావాన్ భవతి.** ఈ విధంగా ఉపాసన చేసినవారు జీవితంలో బాగా స్థిరపడతారు. వారు నిరాధారులవరు.

**తన్మహ ఇత్యుపాసీత।**

ఆకాశమే అన్నింటికన్నా గొప్పదైన బ్రహ్మగా ఉపాసన చేయాలి.

**మహాన్ భవతి।**

ఈ విధంగా ఉపాసన చేసినవారు జీవితంలో గొప్పవారు అవుతారు.

**తన్మన ఇత్యుపాసీత।**

ఆకాశమే అన్నింటికన్నా తెలివైన బ్రహ్మగా ఉపాసన చేయాలి.

**మానవాన్ భవతి।**

ఈ విధంగా ఉపాసన చేసినవారు తెలివితేటలు గలవారు అవుతారు.

**తన్నమ ఇత్యుపాసీత ।**

ఆకాశమే నమస్కరించదగిన బ్రహ్మగా ఉపాసన చేయాలి.

**నమన్తేஉస్మై కామాః ।**

ఈ విధంగా ఉపాసన చేసిన ఉపాసకుడి సమస్త కోరికలు తీరుతాయి. ఉపాసకునికి ప్రణమిల్లుతాయి. అంటే అతని కోరికలు అనాయాసంగా తీరుతాయి.

**తద్బ్రహ్మేత్యుపాసీత।**

ఆకాశమే అన్నింటికన్నా పెద్దదైన బ్రహ్మగా ఉపాసన చేయాలి.

**బ్రహ్మవాన్ భవతి।**

ఈ విధంగా ఉపాసన చేసినవారు పెద్దమనిషిగా సంఘంలో మంచి పేరు గడిస్తారు.

**తద్బ్రహణః పరిమర ఇత్యుపాసీత।**

ఆకాశమే అన్నింటిని ప్రళయంలా తనలో లయం చేసుకునే బ్రహ్మసాధనంగా ఉపాసన చేయాలి.

ఈ విధంగా ఉపాసన చేసిన వారికి శత్రుశేషం ఉండదు. శత్రువులు రెండు రకాలు. మనం ద్వేషించేవారు. మనను ద్వేషించేవారు.

**పర్యేణం మ్రియన్తే ద్విషన్తస్సపత్నాః।**

ఈ ఉపాసకుని ద్వేషించే శత్రువులు నశిస్తారు.

**పరియేఽ ప్రియాభ్రాతృవ్యాః।**

ఈ ఉపాసకుడు ద్వేషించే శత్రువులు నశిస్తారు. అంటే శత్రువులు మరణిస్తారని కాదు. శత్రుత్వం ఉండదని అర్థం చేసుకోవాలి. ఉపాసకుడికి ఎవరిమీదా శత్రుత్వం ఉండదు. అలాగే ఉపాసకుడిపై ఎవరికి శత్రుత్వం ఉండదు. సంపూర్ణంగా శత్రుత్వ నాశనమవుతుంది. అందరూ మిత్రత్వంతో చల్లగా చక్కగా ఉంటారు.

ఇంతటితో ఉపనిషత్తు ముగిసింది. కాని ఇక్కడ ఆపితే తైత్తిరీయం ప్రధానంగా ఉపాసనలే చెప్పింది అనే అపప్రధ వచ్చే అవకాశం ఉంది. ఉపనిషత్తు తాత్పర్యం బ్రహ్మవిద్య మాత్రమే అని చెప్పటానికి రంగం సిద్ధం చేస్తోంది.

**స యశ్చాయం పురుషే। యశ్చాసావిదిత్యే। స ఏకః। స య ఏవంవిత్। అస్మాల్లోకాత్ ప్రేత్య। ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రమ్య। ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రమ్య। ఏతం మనోమయ మాత్మాన ముపసంక్రమ్య। ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రమ్య। ఏతమానందమయ మాత్మాన ముపసంక్రమ్య। స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే।స ఏకః।**

ఆ జీవుని లోని ఆత్మానందం ఈశ్వరునిలోని(ఆదిత్యునిలోని) ఆత్మానందం ఒకటే. ఇక్కడ లభించే ఏ ఆనందమైనా ఆత్మానందం ప్రతిబింబమే. దేహపరంగా జీవునికి, ఈశ్వరునికి చాలా భేదం ఉంది. ఆత్మపరంగా రెండూ ఒకటే.

**స య ఏవం విత్। అస్మాల్లోకాత్ ప్రేత్య।**

ఈ విధంగా ఎవరు తెలుసుకుంటారో అటువంటి జ్ఞాని ఈ లోకం నుంచి విడివడుతున్నప్పుడు –

**ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రమ్య।**

ఈ లోకంలో ఉన్నదంతా మిథ్యే అని తెలుసుకుని అన్నమయ అభిమానాన్ని వీడి అన్నమయాన్ని దాటుతున్నాడు. అంటే భౌతికంగా

దాటుతున్నాడని కాదు. అన్నమయం అనాత్మని, ఆత్మ కాదని, కార్యరూపమని, మిథ్య అని నిశ్చయంగా గ్రహించి, దానిని ప్రాణమయంలో విలీనం చేస్తున్నాడు. దీనినే ప్రవిలాపనం అని బ్రహ్మవల్లీలో చెప్పుకున్నాం.

**ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రమ్య॥**

అటువంటి జ్ఞాని ప్రాణమయ అభిమానాన్ని వీడి ప్రాణమయాన్ని దాటుతున్నాడు. అంటే భౌతికంగా దాటుతున్నాడని కాదు. ప్రాణమయం అనాత్మ అని, ఆత్మ కాదని, కార్యరూపమని, మిథ్య అని నిశ్చయంగా గ్రహించి, దానిని మనోమయంలో విలీనం చేస్తున్నాడు. దీనినే ప్రవిలాపనం అని బ్రహ్మవల్లీలో చెప్పుకున్నాం.

**ఏతం మనోమయ మాత్మాన ముపసంక్రమ్య॥**

అటువంటి జ్ఞాని మనోమయ అభిమానాన్ని వీడి మనోమయాన్ని దాటుతున్నాడు. అంటే భౌతికంగా దాటుతున్నాడని కాదు. మనోమయం అనాత్మ అని ఆత్మ కాదని, కార్యరూపమని, మిథ్య అని నిశ్చయంగా గ్రహించి, దానిని విజ్ఞానమయంలో విలీనం చేస్తున్నాడు. దీనినే ప్రవిలాపనం అని బ్రహ్మవల్లీలో చెప్పుకున్నాం.

**ఏతం విజ్ఞానమయ మాత్మాన ముపసంక్రమ్య॥**

అటువంటి జ్ఞాని విజ్ఞానమయ అభిమానాన్ని వీడి విజ్ఞానమయాన్ని దాటుతున్నాడు. అంటే భౌతికంగా దాటుతున్నాడని కాదు. విజ్ఞానమయం అనాత్మ అని ఆత్మ కాదని, కార్యరూపమని, మిథ్య అని నిశ్చయంగా గ్రహించి, దానిని ఆనందమయంలో విలీనం చేస్తున్నాడు. దీనినే ప్రవిలాపనం అని బ్రహ్మవల్లీలో చెప్పుకున్నాం.

**ఏతమానందమయ మత్మాన ముపసంక్రమ్య॥**

అటువంటి జ్ఞాని ఆనందమయ అభిమానాన్ని వీడి ఆనందమయాన్ని దాటుతున్నాడు. అంటే భౌతికంగా దాటుతున్నాడని కాదు. ఆనందమయం అనాత్మ అని ఆత్మ కాదని, కార్యరూపమని, మిథ్య అని నిశ్చయంగా గ్రహించి, దానిని ఆత్మానందంలో విలీనం చేస్తున్నాడు. దీనినే ప్రవిలాపనం అని బ్రహ్మవల్లీలో చెప్పుకున్నాం.

**ఇమాన్ లోకాన్ కామాన్నీ కామ రూప్యనుసంచరన్। ఏతత్సామ గాయన్నాస్తే। హా(3)వు। హా(3)వు। హా(3)వు। అహమన్న మహమన్న మహమన్నమ్। అహమన్నాదో హమన్నాదో౽ ఽ హమన్నాదః। అహగ్గ్ శ్లోకకృ దహగ్గ్ శ్లోక కృదహగ్గ్ శ్లోకకృత్। అహమస్మి ప్రథమజా ఋతా(3)స్య। పూర్వం దేవేభ్యో అమృతస్య నా(3) భాఇ యోమాదదాతి స ఇదేవ మా(3)వాః। అహమన్నమన్న మదన్తమా(3)ద్మి। అహం విశ్వం భువన మభ్యభవామ్। సువర్న జ్యోతీః। య ఏవం వేద। ఇత్యుపనిషత్।**

**ఇమాన్ లోకాన్ కామాన్నీ కామ– రూప్యనుసంచరన్। ఏతత్సామ గాయన్నాస్తే।**

జ్ఞాని తన స్వరూపం నిశ్చయం వల్ల కలిగిన ఆనందంతో సామగానం చేస్తున్నాడు. ఈ లోకంలో జ్ఞాని పిల్లలతో పిల్లల్లాగా కలిసిపోతాడు. భక్తులతో కలిసి భజనలు చేస్తాడు. వేదాంతులతో వేదాంత చర్చ చేస్తాడు. అతడు అన్ని పాత్రలలోనూ సునాయాసంగా ఇమిడిపోతాడు.

**హా(3)వు। హా(3)వు। హా(3)వు।**

సామగానంలో అహెూ అనడానికి హా(3)వు అంటారు. అహెూ అంటే ఆశ్చర్యం. అనంతమైన, అద్వితీయమైన, అసంగమైన పరమాత్మ పరిమితమైన, వివిధమైన, సంగత్వంతో ఉన్న జీవుడుగా ప్రకటమౌతున్నాడు. ఏకం, సత్యం, సారం, నిత్యం అయిన పరబ్రహ్మ అనేకం. అసత్యం, అసారం, అనిత్యం అయిన జీవుడుగా కనిపిస్తున్నాడు. ఎంత విడ్డూరం! హా(3)వు అంటే ఆశ్చర్యం, రెండవ హా(3)వు ఆశ్చర్యతరం, మూడవ హా(3)వు ఆశ్చర్యతమం.

**అహమన్నమహమన్నమహమన్నమ్। అహమన్నాదో(2)౽ హమన్నాదో (2)౽ హమన్నాదః। అహగ్గ్ శ్లోకకృదహగ్గ్ శ్లోకకృదహగ్గ్ శ్లోకకృత్।**

ఇక్కడున్నదంతా అన్న – అన్నాద సంబంధంతో ఉంది. నేనే అన్నాన్ని, నేనే అన్నాన్ని, నేనే అన్నాన్ని, నేనే అన్నం తినేవాడిని, నేనే అన్నం తినేవాడిని, నేనే అన్నం తినేవాడిని. అంటే నేనే ఈ సర్వం. నేనే బ్రహ్మను అనే బదులు ఇలా చెప్పింది శ్రుతి.

**అహమస్మి ప్రథమజా ఋతా(3)స్య।**

నేను సృష్టికి పూర్వం ఉన్నాను, (చైతన్యరూపంగా).

**పూర్వం దేవేభ్యో అమృతస్య నా(3)భాఇ।**

దేవతలకన్నా ముందు పుట్టిన చతుర్ముఖ బ్రహ్మను నేనే. అమృతత్వమునకు నాభి వంటి వాడిని అంటే ఆధారము నేనే. ఆత్మగా నేను శాశ్వతమైనవాడిని. **యోమా దదాతి ఇదేవ మా(3)వాః।**

అన్నము నైన నన్ను ఎవరు అన్నార్తులకు పంచుతారో వారికి నేను అన్నవృద్ధి చేస్తాను. ఇస్తూ ఉంటే వస్తూ ఉంటుంది సూత్రాన్ని బోధిస్తుంది ఉపనిషత్తు.

**అహమన్నమన్నమదన్తమా(3)ద్మి।**

అన్నము నైన నన్ను ఎవరు అన్నార్తులకు పంచరో వారిని నేను అన్నముగా తినేస్తాను. అన్న-అన్నాద సంబంధముతో ఆత్మగా నేను అన్నమును, అన్నాదమును. అన్నాదముగా నేను అటువంటివారిని తినివేస్తాను అని అర్థము.

**అహం విశ్వం భువన మభ్యభవామ్। సువర్న జ్యోతీః।**

నేను ఆత్మగా విశ్వమంతా సూర్యుని కిరణాల్లా వ్యాపించి ఉన్నాను.

**య ఏవం వేద।**

ఈ విధంగా ఆత్మతత్వమునెరిగినవాడు, నిత్య ముక్తుడౌతున్నాడు.

**ఇత్యుపనిషత్।** ఈ విధంగా ఉపనిషత్తు పూర్తి అయ్యింది.

**ఓం సహనా వవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।**

**తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై॥**

**ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

# దశ శాంతి మంత్రములు

**1.** మం॥ ఓం శం నో మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇన్ద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥ (కృష్ణయజుర్వేద తైత్తిరీయం)

**2.** మం॥ ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వినావధీత మస్తు, మా విద్విషావహై ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥ (కృష్ణ యజుర్వేద తైత్తిరీయం)

**3.** మం॥ ఓం యశ్ఛన్దసామృషభో విశ్వరూపః। ఛన్దోభ్యోధ్యమృతాత్సంబభూవ। స మేన్ద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవ ధారణో భూయాసమ్। శరీరం మే విచర్షణమ్। జీహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోశోసి మేధయా పిహితః। శ్రుతం మే గోపాయ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥(కృష్ణయజుర్వేద తైత్తిరీయం)

**4.** మం। ఓం అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోక్షితః। ఇతి త్రిశఙ్కో ర్వేదానువచనమ్ ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥ (కృష్ణ యజుర్వేద తైత్తిరీయం)

**5.** మం॥ ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే। పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః (శుక్లయజుర్వేద ఈశావాస్యోపనిషత్తు)

**6.** మం॥ ఓం ఆప్యాయన్తు మమాఙ్గాని। వాక్ప్రాణశ్చక్షుః, శ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం। మాహం బ్రహ్మ నిరాకుర్యామ్। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేస్తు। తదాత్మని నిరతే, య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు। తే మయి సన్తు॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః (సామవేదం. కేన, ఛాందోగ్య)

**7.** మం॥ ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్। ఆవిరావీర్మఏధి। వేదస్య మ ఆణీస్థః। శ్రుతం మే మా ప్రహాసీః అనేనాధీతేనాహెూ రాత్రాన్సందధామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు । తద్వక్తార మవతు। అవతు మామవతువక్తారమవతు వక్తారమ్॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥ (ఋగ్వేదము)

**8.** మం॥ ఓం భద్రం నో అపివాతయ మనః ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥ (ఋగ్వేదము)

**9.** మం॥ ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రంపశ్యేమాక్షభి ర్యజత్రాః। స్థిరైరంగైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః। స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః । స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥ (అథర్వణ వేదము)

**10.** మం॥ ఓం యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై। తగ్ం హ దేవమాత్మ బుద్ధి ప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥ (శ్వేతాశ్వతరోపనిషత్తు)

***

First edition - Year 2018 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019

Mobile: 9849092368

Emails: raokasturi@hotmail.com
raghavkasturi@gmail.com

for softcopy www.telugubhakti.com

Printed at
Sai Sri Printers
8-3-945 # 21
Pancom Business Centre,
Ameerpet
Hyderabad --500073

e-mail : saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222

Price Rs. 100